# టిసిపార్డ్

TSIPARD

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి : 8 సంచిక : 1

ఫిబ్రవరి 2016



ఎడిటర్

**అనిత రామచంద్రన్**, ఐ.ఏ.ఎస్.

కమీషనర్, టిసిపార్డ్

ఎడిటిరియల్ బోర్డు

**కె.యాదయ్య**

**డా॥కె.అసయ్య**

**ఎ.నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్,**

**టిసిపార్డ్**

**నవతెలంగాణ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్**

హైదరాబాద్



ప్రచురణ

**టిసిపార్డ్**

రాజేంద్రనగర్

హైదరాబాద్ - 500 030

తెలంగాణ, ఇండియా.

ఫోన్ : 040 - 24018656

ఫ్యాక్స్ : 040 - 24017005

E-mail:editorsthanikapalana@gmail.com

Website: www.tsipard.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికిగాని, టిసిపార్డ్‌కిగాని చెందినవిగా భావించనక్కరలేదు


# విషయ సూచిక


సంపాదకీయం ..... 4

మిషన్ భగీరథకు రూ.35000 కోట్ల కేంద్ర సహాయం ..... 5

పేద ముస్లిం బాలికలు - బాల్య వివాహాలు ..... 7

పల్లెల్లో ఐటీ వెలుగులు ..... 9

స్థానిక సంస్థలు-ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ..... 11

దేశంలో సంక్షేమ యంత్రాంగం ..... 12

బలహీనమైన గుండెకు బహు చికిత్సలు ..... 14

కనీస విద్యార్హత గల వారికే పంచాయితీ పదవులు-హర్యానా ప్రభుత్వం ..... 16

నాణ్యమైన ప్రత్తి కొరకు పాటించవలసిన ప్రమాణాలు ..... 18

తెలంగాణ సినిమా - తెరమరుగున తేజోవంతమైన చరిత్ర ..... 19

సుపరిపాలన ..... 21

పంచాయతీ వ్యవస్థ బలోపేతంపై టిసిపార్డ్ కేరళలో అధ్యయనం ..... 22

ఆవాలు - సాగుపద్ధతులు ..... 24

పారిశ్రామికీకరణతోనే ఆర్థికాభివృద్ధి ..... 25

బంగారు తెలంగాణ కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు - ప్రజల భాగస్వామ్యం ..... 27

వరిలో యాజమాన్య పద్ధతులు ..... 32

తెలంగాణా రాష్ట్రంలో అందరికీ విద్య దిశగా అడుగులు ..... 33

పర్యావరణ పరిరక్షణ మానవాళి బాధ్యత ..... 35

గ్రామీణాభివృద్ధిలో సాంకేతిక సౌకర్యాలు ..... 37

అధిక లాభాలను అందించే పాల పుట్టగొడుగుల పెంపకం ..... 39

మధ్యప్రదేశ్ పంచాయతీరాజ్ సంస్థల పరిశీలన ..... 41

తెలంగాణలో ప్రజాస్వామ్య పరిపాలన వికేంద్రీకరణకు అంకురార్పణ ..... 43

సంవత్సరం పొడవునా పచ్చిమేత లభ్యతకు బహువార్షిక జొన్న ..... 45

పాతిక సంవత్సరాల సంస్కరణలు ..... 46

మైనారిటీలకు ప్రభుత్వ పథకాల లబ్ధి ..... 48

పర్యావరణ ఉద్యమాలు ..... 50

మన రాజ్యాంగానికి ప్రాణం 'న్యాయ సమీక్ష' ..... 53

కారుచీకటిలో కాంతిరేఖ-చిరువ్యాపారుల పాలిట జీవన ముద్ర ..... 54

తెలంగాణలో డిజిటల్ ఆరోగ్య సేవలు ..... 58

పేదల జీవితాలకు ఉపాధినిచ్చిన యంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం ..... 59

గిరిజన తండాల్లో ఉచిత భోజనం ..... 62

గ్రీన్‌సూపర్ రైస్-నూతన వరి ఆవిర్భావం ..... 63

కరువు పరిస్థితులు - తెలంగాణ ప్రభుత్వ వ్యూహం ..... 64

గ్రామీణ వికాసానికే తొలి ప్రాధాన్యం ..... 66

# ఉపాధి హామి పథకం – పేదలకు భరోసా

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం పేద ప్రజలకు వరం. ఈ కార్యక్రమం వలన పేదలలో ఆత్మవిశ్వాసం పెరిగింది. వలసలు తగ్గాయి. బ్రతుకు భరోసా లభించింది. ఈ ఉపాధి హామీ పథకం అమలు చేయని రాష్ట్రాలు 12 వున్నా, అమలు చేయు రాష్ట్రాలలో అనూహ్యమైన లబ్ధి పేదలకు లభ్యమైంది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేయుటలో రోజువారీ కూలీలకు ధైర్యాన్ని స్థైర్యాన్ని ఇస్తుంది. కూలి పనిని రోజూ వెతుక్కోవలసిన బాధ తప్పిస్తుంది. వలసలు తగ్గాయి. పిల్లల్ని బడులు మాన్పించడం తక్కువైంది. అంగన్‌వాడీలు చిన్న పిల్లల బాగోగులను చూస్తుంది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం లభిస్తుంది. కుటుంబానికి కావలసిన తిండిగింజలు బియ్యం, గోధుమలు పౌరసరఫరా కేంద్రాల ద్వారా సన్నబియ్యం మనిషికి ఆరుకిలోలు కేవలం రూపాయికే అందించడం లాంటి సంక్షేమ పథకాల ద్వారా పేదరికపు రేఖకు దిగువునున్న వారికి వెసులుబాటు బాగా పెరిగింది. బి.పి.ఎల్. గ్రూపుల వారిని పేదరికపు రేఖకు ఎగువునకు తెచ్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తుంది.

ఈ ఉపాధి హామీ పథకం గత దశాబ్దకాలంగా గ్రామీణుల ఆత్మస్థైర్యాన్ని నింపిందని చెప్పవచ్చును. ఈ పథకాన్ని అమలు చేయటలో తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. అందుకు నిదర్శనం ఉపాధి హామీ పథకం విజయవంతంగా అమలు చేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో ఉన్నత స్థానంలో ఉన్నందుకు తెలంగాణ రాష్ట్రానికి నాలుగు జాతీయ అవార్డులు పలు వ్యక్తిగత ప్రశంసాపత్రాలు లభించాయి. ఇందుకు సంబంధించి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు ప్రత్యేక బహుమతులు అందుకోవడం ఎంతో సంతృప్తిని కలిగిస్తుంది. ఈ పథకాన్ని అమలు చేయటలో విజయవంతంగా నిర్విరామ కృషి చేసిన క్రిందిస్థాయి అధికారులకు అభినందనీయం. ఈ పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాలు, జాతులు కూలిలు ఆత్మవిశ్వాసం కలిగి అభద్రతాభావం నుండి బయటపడుతున్నారని చెప్పవచ్చు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ స్థాయిలో సామాజిక ఆస్తులు సృష్టించడంలో మంచి ఫలితాలను సాధించింది. ఈ పథకం పనులు వలన అన్నింటి కంటే ఎక్కువ ప్రయోజనం వ్యవసాయ రంగానికి అధికంగా మేలు జరిగింది. చిన్నతరహా నీటిపారుదల స్కీములను పునరిద్దరించడం లేదా పూడికలు తీయడం ద్వారా నీటి నిల్వలు పెరిగేందుకు అస్కారం కలిగింది. చెరువులు పూడికల పనులను ఈ పథకం క్రింద చేయుట వలన సంబంధిత గ్రామాలు ఇతర గ్రామాల వారికి ఆదర్శంగా నిలిచాయి. ఇండ్లు నిర్మించి పేదలకు గూడును కల్పించడం. మరుగుదొడ్లును గ్రామాల్లో నిర్మించి వారికి కనీస సౌకర్యాలు కలిగించడం కూడా ఈ పథకంలో భాగమే ఈ పథకం నందు సామాజిక తనిఖీ ప్రవేశపెట్టి నిధులు దారి మళ్ళించకుండా చేయటమే కాకుండా ఈ సామాజిక తనిఖీ అన్ని ప్రభుత్వ పథకాలకు విస్తరింప చేయుటకు పూనుకోవడం పారదర్శకత ప్రభుత్వ నిబద్ధత, మూడు రోజుల్లో కూలి చెల్లించడం కూడా ఒక రికార్డుగా చెప్పవచ్చు.

ఈ నరేగా (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్) ద్వారా గ్రామాలలో జీవన సదుపాయాలను కల్పించుకొనేందుకు ప్రజలు కూడా ముందుకు రావడం జరుగుతోంది. దేశంలో ఉన్న 38.5% పేదరికంను తగ్గించుటకు ఈ పథకం పలు రకాలుగా ఉపయోపడుతోంది. ఈ పథకం విజయవంతమైన అమలులో తెలంగాణ రాష్ట్రం పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టిన సంబంధిత అధికారులకు, ఉద్యోగులను మరొకసారి అభినందిస్తూ రాబోయే కాలంలో ఇదే రీతిలో ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాను.

(అనిత రామచంద్రన్)



# మిషన్ భగీరథకు రూ.35000 కోట్ల కేంద్ర సహాయం

**ఏప్రిల్‌నాటికి తొమ్మిది నియోజక వర్గాలకు భగీరథ మంచినీరు**

**160 టిఎంసీల కృష్ణా, గోదావరి జలాలతో ఇంటింటికి తాగునీరు**

**ప్రజల ఆరోగ్య ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పథకం అమలు**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పనుల్లో వేగం పుంజుకుంది. ఏప్రిల్ నాటికి వరంగల్, నల్గొండ, మెదక్ జిల్లాలోని తొమ్మిది నియోజక వర్గాలకు మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి మంచినీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పనుల్లో వేగం పెరిగింది. సంబంధిత అధికార యంత్రాంగం అంతా మిషన్ భగీరథ పనులపై దృష్టి కేంద్రీకరించింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రాజెక్టు పనులపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో ఆరా తీస్తుండడంతో అధికారులు ఉరుకుల పరుగులతో పనులను పర్యవేక్షిస్తున్నారు. కృష్ణా, గోదావరి నుండి 160 టిఎంసీల నీటిని మిషన్ భగీరథకు తీసుకోవాలని నిర్ణయించారు. రాబోవు 15 సంవత్సరాల కోసం పథకాన్ని రూపొందించినప్పటికీ రాష్ట్ర ప్రజలకు రాబోవు 30 సంవత్సరాల పాటు మంచినీటి సదుపాయం కల్పించే విధంగా పనులు జరుగుతున్నాయి.

మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రంలోని సుమారు 25 వేలకు పైగా ఉన్న జనావాసాలకు నల్లా ద్వారా రక్షిత మంచినీరందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2019 ఎన్నికల నాటికి ఇంటింటికి నల్లా నీరు ఇవ్వని పక్షంలో ప్రజలను ఓటేయమని అడగబోమని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు బహిరంగంగా ప్రకటించారు. ప్రాజెక్టును అమలు చేయడానికి ఏటా రూ. 25,000 కోట్లు కేటాయించడానికి కూడా నిర్ణయం తీసుకుంది. భగీరథ యత్నంగానే నిధులు, నీళ్లు సమకూర్చుకుంటున్నారు. నాబార్డు రూ. 4000 కోట్ల రుణం ఇవ్వడానికి ముందుకొచ్చింది. జపాన్ బ్యాంకు మరో రూ. 1000 కోట్ల రుణం మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం నీతీ అయోగ్ ద్వారా రాబోవు నాలుగేళ్ల కాలంలో రూ. 35,000 కోట్లు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేసింది.

డ్రింకింగ్ వాటర్ గ్రిడ్‌ను నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలని సంకల్పించారు. పథకం అమలు కోసం 5,227 కిలోమీటర్ల మేరకు ప్రధాన పైప్‌లైన్ వేయాలని, మధ్యస్థంగా మరో 45,809 కిలో మీటర్ల మేరకు పైప్‌లైన్లు వేసి, ఊరూరా మంచినీటి సరఫరా కోసం 75000 కిలోమీటర్ల మేరకు పైప్‌లైన్లు వేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత జలవనరులు, కొత్తగా అందుబాటులోకి రాబోతున్న సాగునీటి ప్రాజెక్టుల నుండి 10 శాతం జలాలు గ్రిడ్‌కు మరో 10 శాతం జలాలు పరిశ్రమలకు కేటాయించే విధంగా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో రాబోవు కాలంలో పైపులైన్ల ద్వారా మంచినీటిని అందించే పథకాలకు ఆటంకం రాబోదని ప్రభుత్వం భావించింది. పథకం అమలు కోసం నిర్వహించిన సర్వే కోసమే ప్రభుత్వం సుమారు రూ. 100 కోట్లు ఖర్చు చేసింది. అనేక మంది ఇంజనీరింగ్ నిపుణులు, నీటిపారుదల




నిపుణులు, సీనియర్ అధికారులు ముఖ్యమంత్రి ఆలోచనలకు తుది రూపం ఇచ్చారు. ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక సహాయం కోసం తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదికను పంపించింది. కేంద్ర ప్రభుత్వం ఆ నివేదికను నీతిఅయోగ్‌కు నివేదించింది. తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాన్ని నీతిఅయోగ్ అభినందించింది. ఇతర రాష్ట్రాలకు ఈ పథకం ఆదర్శప్రాయం అని పేర్కొంది. ఆర్థిక సహాయం అందించేందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 35000 కోట్ల ఆర్థిక సహాయాన్ని రాష్ట్రం కోరింది. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పథకం కింద ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని కేంద్రం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆర్థిక తోడ్పాటు అందించాలని పేర్కొన్న విషయాన్ని కేంద్రం ఈ సందర్భంగా గుర్తు చేసింది. పలువురు కేంద్ర మంత్రులు, నీతి అయోగ్‌లోని సీనియర్ అధికారులతో సంప్రదింపుల తర్వాతనే తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ఆర్థిక సహాయాన్ని కోరడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన డీపీఆర్‌ను ఆమోదించిన ప్రభుత్వం రాబోవు 4 సంవత్సరాల కాలంలో రూ. 35,000 కోట్లు మంజూరు చేయడానికి అంగీకరించింది.

ఆర్థిక వనరులు సమకూర్చుకొనడంలో ప్రభుత్వ ప్రయత్నాలకు సానుకూల స్పందన రావడంతో అధికారులు పనులను చేపట్టారు. టెండర్లు ఆహ్వానించి కాంట్రాక్టర్లను ఎంపిక చేశారు. పనుల ప్రాధాన్యతలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. గవర్నర్ నరసింహన్ ఇటీవల మెదక్, వరంగల్, నల్గొండ జిల్లాల్లో మిషన్‌భగీరథ పనులను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. నిర్దిష్ట కార్యాచరణతో పనులు జరుగుతున్నాయని అన్నారు. పనుల నాణ్యత పట్ల కూడా గవర్నర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. నిజంగానే ఇది భగీరథ యత్నం అని వ్యాఖ్యానించారు. ప్రతి ఇంటికి రక్షిత మంచినీటిని అందించడం వల్ల జరిగే మేలును గుర్తు చేశారు. రక్షిత మంచినీటి సరఫరా లేని ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం ప్రయత్నించడమేనని అన్నారు. ఫ్లోరైడ్ ప్రభావిత ఆవాసాల్లోని ప్రజలకు ఈ ప్రయత్నం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఫిబ్రవరి నెలాఖరు నాటికి 2000 కిలోమీటర్ల మేరకు పైప్‌లైన్లు వేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తంగా తెలంగాణ అంతటా రాబోవు నాలుగేళ్ల కాలంలో 1,26,036 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేయవలసి ఉంటుంది. పైప్‌లైన్లతో పాటుగా అంతర్గత పనులు కూడా చేపట్టడం జరుగుతుంది. మూడు రకాలుగా పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నందున నిర్వహణ పరంగా సమస్యలు ఉండబోవని ఇంజనీరింగ్ నిపుణులు భావిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి మంచినీటి పైప్‌లైన్లు వేస్తున్నందున ఈ పైప్‌లైన్ల వెంటనే ఇంటర్‌నెట్ కేబుళ్లు వేయాలని ప్రభుత్వం సంకల్పించింది. పైపులైన్ల కోసం 12 అడుగుల లోతైన గుంతలను తీస్తున్నారు. ఇంటర్‌నెట్ కేబుళ్లు వేయడానికి 5 అడుగుల లోతైన గుంతలు చాలని బిఎస్‌ఎన్‌ఎల్ అధికారులు వెల్లడించారు. డిజిటల్ విలేజ్ పథకం కింద కేంద్రం ఊరూరుకు ఇంటర్‌నెట్ పథకం అమలుకు కూడా అవసరమైన మేరకు నిధులు ఇవ్వడానికి ముందుకొచ్చింది. తెలంగాణలోని ప్రతి ఆవాసానికి రక్షిత మంచినీటితో పాటుగా ఇంటర్‌నెట్ సదుపాయం అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రజల ఆరోగ్య ప్రమాణాలను పెంచడం లక్ష్యంగా మిషన్ భగీరథను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు జరుపుతుంది.

– వార్తాంశాల సంకలనం నుండి



# పేద ముస్లిం బాలికలు – బాల్య వివాహాలు

" ఆడపిల్ల పుట్టగానే వారు ఆలోచించేది వరకట్నం, వారి వివాహ ఖర్చు గురించే, ఈ కారణంగానే వారి బంధువులలోని అబ్బాయితో చిన్నతనంలోనే నిశ్చితార్థం జరిపి, వివాహ వయస్సు రాకుండానే బాల్య వివాహాలు జరుపుతున్నారు. దీని వల్ల బాలికలు చదువును మధ్యలోనే ఆపేయాల్సి వస్తుంది. "

మైనారిటీల సమస్యలను పరిశీలించిన సచార్ కమిటీ (జూలై 2008) లెక్కల ప్రకారం అన్ని సామాజిక వర్గాల వారి కన్నా ముస్లిం బాలికలు చదువులో వెనుకబడి తెలుస్తుంది. దీని ప్రకారం 1వ తరగతిలో నమోదుయ్యే ముస్లిం బాలికల సంఖ్య 6వ తరగతి వరకు వచ్చేసరికి 50 శాతానికి తగ్గిపోయి 10వ తరగతికి వచ్చేసరికి 20 శాతానికి పడిపోతోందని తేలింది. దీనికి కారణం వారి సామర్థ్యానికి సంబంధించినవి కావు. ఎందుకంటే ప్రతి సంవత్సరం మార్కుల శాతాన్ని గమనిస్తే ముస్లిం బాలికలే ముందంజలో ఉన్నారు. పాఠశాల స్థాయి నుండి కళాశాల స్థాయి వరకు ఇతర బాలికలతో పోలిస్తే ప్రథమ స్థానాల్లో నిలిచారు. అతి తక్కువ జీవన ప్రమాణాలతోనే వారు ఇంతగా రాణించగల్గుతున్నారంటే వారి నిబద్ధత, కష్టపడేతత్వం తెలుస్తుంది. అదే వారికి అనుకూల వాతావరణం కల్పిస్తే ఇంకా ఉన్నత స్థానాలందుకోగల్గుతారనడంలో అతిశయోక్తి లేదు.

మగ పిల్లవాడు పుడితే అది కుటుంబానికి గర్వకారణం. ఆడపిల్లపుడితే బరువు బాధ్యత అనే ఆలోచనలు కొన్ని వందల ఏళ్ల నుండి నేటి వరకు కొనసాగుతున్నాయి. ఈ కారణంగానే ఆడపిల్లను భూమి మీదకు రాకుండానే చంపేసే విష సంస్కృతి నేటికీ ప్రబలుతున్నది. కూతుళ్ళు, కొడుకుల మధ్య తేడా చూపడం, మగ పిల్లలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో ఉన్నత చదువులు చదివించటం, ఆడపిల్లను దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివించి వారికి పై చదువుల పట్ల ఆసక్తి ఉన్నా వారిని ఇంటి పనికే పరిమితం చేసి బాల్య వివాహాలు జరిపించటం నేటికీ జరుగుతుంది. వీటికి గల కారణాలు గమనిస్తే ముఖ్యంగా క్రింద పేర్కొన్న అంశాలు దోహం చేస్తాయని పరిశీలనల్లో తేలింది.

**సామాజిక సమస్యలు,**

**ఆర్థిక సమస్యలు,**

**మతపరమైన సమస్యలు**

**సామాజిక సమస్యలు:** ఆడపిల్ల పుట్టగానే వారు ఆలోచించేది వరకట్నం, వారి వివాహ ఖర్చు గురించే, ఈ కారణంగానే వారి బంధువులలోని అబ్బాయితో చిన్నతనంలోనే నిశ్చితార్థం జరిపి, వివాహ వయస్సు రాకుండానే బాల్య వివాహాలు జరుపుతున్నారు. దీని వల్ల బాలికలు చదువును మధ్యలోనే ఆపేయాల్సి వస్తుంది. చాలా మంది బాలురు కూడా పై చదువులు చదవలేకపోతున్నారు. సాధారణంగా పెద్ద కుటుంబాలు అవటం మూలాన కుటుంబం గడవటానికి వారు కూడా చిన్నతనంలోనే ఏదో ఒక పని చేస్తూ కుటుంబ పోషణకై పాటు పడ్తూ యుక్త వయస్సు

రాగానే గల్ఫ్ దేశాలకు వలస పోతున్నారు. అమ్మాయిలకు పై చదువులు చదవాలని ఉన్నా వారికి తగ్గ పెళ్ళి సంబంధాలు రావనే ఉద్దేశ్యంతో వారి ఆశలను అడియాసలు చేస్తున్నారు తల్లిదండ్రులు. ఆడపిల్లలు ఎక్కువగా చదువుకుంటే అత్తవారింట్లో అణిగిమణిగి ఉండరనే ఉద్దేశ్యంతో మగపిల్లల తల్లిదండ్రులు కూడా తక్కువగా చదువుకున్న అమ్మాయిలనే కోరుకుంటున్నారు. వారికి కావల్సిందల్లా ఇంటిల్లిపాదికి వండి వార్చే వంట మనిషి, పని మనిషి మరియు పిల్లలను కనే యంత్రంగా ఆడపిల్లను చూస్తున్నారు.

సమాజంలో ఆడపిల్లపై జరుగుతున్న లైంగిక దాడులు, యాసిడ్‌దాడులు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌లు, వేధింపులు మొదలైనవి ఈ మధ్యకాలంలో హెచ్చు మీరడం వల్ల కూడా వారి తల్లిదండ్రుల్లో, అమ్మాయిల్లో ఒకలాంటి అభద్రతాభావానికి గురయ్యేలా చేస్తున్నాయి. ఈ కారణంగా కూడా చాలా మంది బాలికలు వారికి ఎంతో ఇష్టమైన చదువును మధ్యలోనే ఆపేయాల్సి వస్తుంది.

**ఆర్థిక సమస్యలు:** చాలా మంది అమ్మాయిలు ప్రాథమిక విద్య కాగానే చదువు ఆపటానికి ముఖ్యకారణం వారి తల్లిదండ్రులు పనికి వెళ్లినప్పుడు వారి చెల్లెళ్లను, తమ్ముళ్లను ఇంటిలో ఉండి చూసుకోవడం, ఇంటి పనుల్లో సహాయం చేయటం. వారు అనుభవిస్తున్న పేదరికానికి ముఖ్యంగా బలయ్యేది ఆడపిల్లనే వారి చదువు, పెళ్లి, పిల్లల్ని కనడం వంటి ముఖ్యమైన నిర్ణయాలు వారి ప్రమేయం లేకుండానే జరిగిపోతాయి.

మగవాళ్లు చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు అధిక వడ్డీతో రుణాలు పొందుతున్నారు. దానిని తీర్చుకోలేక వడ్డీ పెరిగిపోయి వ్యాపారాల్లో నష్టం వచ్చి అది కుటుంబంపైన భారం పడేలా చేస్తుంది. వడ్డీ వ్యాపారులు వారి భార్యాపిల్లలపై కన్నేసిన సంఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. 2009లో చార్మినార్‌పై నుండి సమీరాబేగం అనే 9వ తరగతి చదివే అమ్మాయిని క్రిందకు త్రోసి చంపినది వడ్డీ వ్యాపారేనని ఆమె తన మరణ వాంగ్మూలంలో పేర్కొంది.

ముఖ్యంగా పేదరికంలో మగ్గుతున్న వారి పిల్లలకు కనీస అవసరాలైన భోజనం, దుస్తులు వంటి వాటికే ప్రాధాన్యత సరిగా ఇవ్వలేక, చదువు అంటేనే ఆసక్తి కనబరచలేకపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం లాంటి పథకాలు ఎన్నో ఉన్నా ముస్లిం బాలికలు చాలా వరకు ప్రాథమిక విద్యకే పరిమితమైపోతున్నారు. ఎన్నో కారణాల వల్ల వీరు మాధ్యమిక, ఉన్నత పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారు. ఆ కారణంగానే హైదరాబాద్‌లో గమనిస్తే ఉర్దూ మాధ్యమంలో కొన్ని వందల ప్రాథమిక పాఠశాలలుంటే, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలు పదుల సంఖ్యలో ఉన్నాయి.

**మతపరమైన సమస్యలు:** కొంతమంది బాలికలు పార్క్‌లలో బురఖాలు వేసుకొని బాయ్‌ఫ్రెండ్స్‌తో తిరగడం వంటివి చూస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలు కూడా అలాగే చేస్తారనే ఉద్దేశ్యంతో వారికి పై చదువులు చదవాలని ఉన్నా మధ్యలోనే మాన్పించి పెళ్లిళ్లు చేస్తున్నారు. కో ఎడ్యుకేషన్ పాఠశాలలు, కళాశాలల్లో ఇలాంటివి ఎక్కువగా ఉంటాయని భావించి




> *“మగ పిల్లలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో ఉన్నత చదువులు చదివించటం, ఆడపిల్లను దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివించి వారికి పై చదువుల పట్ల ఆసక్తి ఉన్నా వారిని ఇంటి పనికే పరిమితం చేసి బాల్య వివాహాలు జరిపించటం నేటికీ జరుగుతుంది.”*

వాటిల్లో చేర్పించడానికే జంకుతున్నారు. అందుకే ముస్లిం బాలికల నమోదు శాతం పై చదువులకు వెళ్లే కొద్దీ తగ్గిపోతూ ఉంది. వారు రజస్వల వయస్సుకు వచ్చేసరికి ఆంక్షలు విధించడం, వారిని బయటికి రానివ్వకుండా చేసి ఇంటికే పరిమితం చేయడం వంటివి చేస్తున్నారు.

పాతబస్తీలోని కొన్ని ప్రదేశాల్లో ఇంకా అరబ్ షేక్‌లు అమాయక చిన్నారుల జీవితాలను బలి తీసుకుంటూనే ఉన్నారు. 80వ దశకంలో అమీనా అనే పదేళ్ల బాలికను ఎయిర్ హోస్టెస్ రక్షించి వాళ్ల తల్లిదండ్రులకు అప్పజెప్పడం ద్వారా ఈ ఉదంతం బయటపడింది. ఆ తర్వాత ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఇలాంటివి జరుగకుండా కృషి చేస్తున్నా కూడా అక్కడక్కడా ఎవరికంటా పడకుండా జరుగుతూనే ఉన్నాయి. ఏటా పదుల సంఖ్యలో అమ్మాయిలు బలవుతూనే ఉన్నారు. ఇటీవల ఒక స్వచ్ఛంద సంస్థ పాతబస్తీలో ‘మెహర్’ అనే ఆచారానికి బలవుతున్న 33 మంది అమ్మాయిలను రక్షించింది. ఈ ఆచారంలో బాలికల తల్లిదండ్రులకు డబ్బు ఆశ చూపి కొంతమంది మధ్య దళారులు విదేశీ వ్యక్తులతో ఒప్పంద వివాహాలు జరుపుతున్నారు. ఇలా చేయడం వల్ల అమ్మాయిల జీవితాలు బలవుతున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తున్నారు.

ఈ నేపథ్యంలో ముస్లిం బాలికల స్థితిగతులను మెరుగుపరచే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా షాదీముబారక్ అనే పథకాన్ని ప్రవేశపెట్టి 18 సం॥రాలు నిండిన పేద ముస్లిం వధువులకు వివాహ సమయంలో 51 వేలు ఆర్థిక సహాయం లభించేటట్లు చర్యలు తీసికొంది. ఈ పథకం 25 సెప్టెంబర్ 2014 నుండి అమలులోకి వచ్చింది. ఈ పథకంలో అమ్మాయి 10వ తరగతి సర్టిఫికెట్ కూడా జతచేయాలనే నిబంధన పాటిస్తే ముస్లిం అమ్మాయిలు 10వ తరగతి అయినా పూర్తి చేసి ఏదైనా అవసరం వచ్చినప్పుడు కుటుంబ పోషణకు పాటుపడే అవకాశాన్ని పరోక్షంగా కల్పించినట్లువుతుంది.

**– కె.విద్యుల్లత, ట్రైనింగ్ ఆఫీసర్, టిసిపార్డ్.**



# పల్లెల్లో ఐటీ వెలుగులు

- గ్రామ స్వరాజ్యానికి మరో ముందడుగు
- 104 గ్రామాల్లో పల్లెసమగ్ర కేంద్రాలు
- 700 గ్రామాలకు విస్తరణ
- మీ-సేవల్లాగానే ఈ-పంచాయతీల్లో పౌరసేవలు

**బా**పూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించే దిశగా రాష్ట్రంలో మరో అడుగు ముందుకు పడింది. సమాచార సాంకేతిక పరిజ్ఞానం (ఐటీ) కొత్తపుంతలు తొక్కుతున్న నేపథ్యంలో ఆ ఫలాలను గ్రామ గ్రామానికీ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె సమగ్ర కేంద్రాల (ఈ-పంచాయతీ) ద్వారా ఈ-గవర్నెన్స్‌కు బీజం వేసింది. ప్రస్తుతం కొన్ని సేవలకే పరిమితమైన ఈ-పంచాయతీలు రాబోయే రోజుల్లో 320 కీలక సేవలను అందించనున్నాయి. ప్రస్తుతం జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, పట్టణాలు, నగరాలకు పరిమితమైన మీ-సేవ, ఈ-సేవ కేంద్రాల ద్వారా పౌరులకు సేవలందిస్తున్నట్లుగానే గ్రామాల్లో ఈ-పంచాయతీలు వేర్వేరు సేవల్ని ఒకే చోట అందించనున్నాయి. మీ-సేవ, ఈ-సేవ, ఈ-పంచాయతీల ద్వారా అందించేందుకు వీలున్న 60 రకాల సేవలను అధికారులు గుర్తించారు. ప్రస్తుతం పల్లె సమగ్ర కేంద్రాల పేరుతో 104 గ్రామాలలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఈ నెల చివరినాటికి మరో 700 గ్రామాలకు విస్తరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

### పక్కాగా సమాచారం

పరిపాలనలో పారదర్శకత, అవినీతి నిర్మూలన, స్థానిక సంస్థల బలోపేతం లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారు ప్రారంభించిన డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పలు సాఫ్ట్‌వేర్లను జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) రూపొందించింది. ఇందులో ప్రధానంగా పీఆర్ఐఏ సాఫ్ట్, ప్లాన్ ప్లస్ సాఫ్ట్‌వేర్ల ద్వారా ఈ-పంచాయతీ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ సాఫ్ట్‌వేర్ల ద్వారా స్థానిక భాషలో కంప్యూటర్ అప్లికేషన్లు పనిచేస్తాయి. ప్రణాళికను సిద్ధం చేసుకొనే అప్లికేషన్ వేర్వేరు మార్గాల ద్వారా వచ్చే ఆదాయాలను ఒకే పేమెంట్ గేట్‌వే ద్వారా ఇబ్బందులు లేకుండా సులభతరం చేస్తుంది. వివిధ అనుమతుల విషయంలో ఎలాంటి అవినీతికి ఆస్కారం ఉండదు. గ్లోబల్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా రూపొందించిన గ్రాఫ్స్ ఆధారంగా ఉన్నతాధికారులు సమాచారాన్ని తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రధానంగా బీఆర్‌జీఎఫ్ జిల్లాల్లో వినియోగానికి ప్లాన్‌ప్లస్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. దీనికి అనుసంధానిస్తూ మరిన్ని సేవలను అందించే యాక్షన్‌సాఫ్ట్ అనే మరో సాఫ్ట్‌వేర్‌ను పంచాయతీలకు అందించారు. ముమ్ముందు రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఐసీ రూపొందించిన సర్వీస్‌ప్లస్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించుకొంటుంది. దీని ద్వారా ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్సుల జారీ, వేలాలు, కోర్టు



కేసులు, జెడ్పీ ప్రావిడెంట్ ఫండ్, నిరభ్యంతర పత్రాలు (ఎన్ఓసీ), పేరు మార్పు సదుపాయం, నల్లా కనెక్షన్లు, భవన నిర్మాణ అనుమతులు, ఆస్తుల విలువ నిర్ధారణ పత్రాలు, వివాహ నమోదు పత్రాలు, ఇంటి యాజమాన్య హక్కు పత్రాలు అందిస్తారు. ఇందులో జారీచేసిన పత్రాల వివరాలు వాటంతట అవే జీఐఎస్ మాడ్యుల్ ద్వారా మండల, జిల్లా, రాష్ట్ర పోర్టళ్లకు చేరుతుంది. సామాజిక తనిఖీ కోసం ఎన్ఐసీ రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కూడా ఈ-పంచాయతీల్లో వినియోగించుకోనున్నారు. సమగ్ర సర్వే డేటాను ఇప్పటికే సేకరించిన నేపథ్యంలో ఆ వివరాలను ఈ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసి, వివిధ పథకాల్లో అర్హులను గుర్తించి మెరుగైన సేవలు అందించే వెసులుబాటు కలుగుతుంది. శిక్షణ నిర్వహణ పోర్టల్ ద్వారా గ్రామాల్లోని ఎస్‌హెచ్‌జీ మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ-పంచాయతీల నిర్వహణపై కూడా దీని ద్వారా శిక్షణ ఇవ్వవచ్చు.

### గ్రామాలకు విస్తరించిన పౌరసేవా కేంద్రాలు

కేవలం జిల్లా, మండల, పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ-సేవ, మీ-సేవ కేంద్రాల సేవలు పల్లె సమగ్ర సేవా కేంద్రాల (ఈ-పంచాయతీ) ఏర్పాటుతో గ్రామాల్లోకి విస్తరించాయి. గ్రామస్థాయిలో ఎంటర్‌ప్రెన్యూర్ (వీఎల్ఈ) ద్వారా ఈ పంచాయతీలను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో డిగ్రీ అర్హత గల యువతను ఎంపిక చేసి వారికి ఐటీ శాఖ ద్వారా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చారు. స్వయం సహాయక సంఘాల ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ నిధి బ్యాంకును ఏర్పాటు చేసింది. దీనికి రాష్ట్ర వ్యాప్తంగా 1010 సెంటర్లు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు ఆంధ్రాబ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌తో స్త్రీ నిధి సంస్థ ఒప్పందాలు కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా 274 కేంద్రాల్లో ఎస్‌బీహెచ్, ఆంధ్రాబ్యాంకులకు బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ) కేంద్రాలుగా స్త్రీ నిధి వ్యవహరిస్తున్నది. ఈ కేంద్రాల నిర్వహణకు ఇంటర్నెట్ సౌకర్యం కోసం ఇప్పటివరకు డాటా కార్డును వినియోగించారు. ఈ కార్డు సేవలు ఆశించినంత వేగంగా లేకపోవడంతో 20 బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ) కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా వీశాట్, వై-మాక్స్, బీఎస్ఎన్ఎల్ బ్రాండ్‌తో పాటు అందుబాటులో ఉన్న ఎంఓఎస్ (కేబుల్ నెట్‌వర్క్)లను ఉపయోగించాలని నిర్ణయించారు. ప్రస్తుతం బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందుబాటులో ఉన్న పంచాయతీల్లో పల్లె సమగ్ర కేంద్రాల పేరుతో ఈ-పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగా రాష్ట్రంలోని 274 బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ) కేంద్రాల్లో 104 కేంద్రాలకు బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించి, పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. మిగిలిన కేంద్రాలకు కూడా దశల వారీగా బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటిని అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులో లేని మారుమూల గ్రామాల్లో వీశాట్, వై-మాక్స్, కేబుల్ నెట్‌వర్క్ ద్వారా సేవలందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నది. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని 8700 గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నది.

### ఈ పంచాయతీ ద్వారా అందిస్తున్న సేవలు

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, వాటిలో పత్రాల్లో సవరణలు, పిల్లల పేర్ల మార్పు, ఇంటిపన్ను, బ్యాంకుల ఆర్థిక సేవలు, స్వయం సహాయక సంఘాల ఆర్థిక కార్యకలాపాల నిర్వహణ, ఆసరా పింఛన్ల చెల్లింపులు, ఉపాధి హామీ పథకం చెల్లింపులు, మీ-సేవ కేంద్రాల సేవలు, ఇతర ప్రభుత్వ సేవలు.

### మీ-సేవ, ఈ-సేవ ద్వారా 24 సేవలు

పౌరుల వద్దకే ప్రభుత్వ సేవల నినాదంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా మీ-సేవ, ఈ-సేవ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రాష్ట్రంలో వేలమందికి ఉపాధి లభించడమే కాకుండా విస్తృతంగా పౌరసేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఇవి 30 రకాల సేవలను అందిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 24 రకాల సేవలు, గ్రేటర్ హైదరాబాద్‌లో అదనంగా మరో 6 రకాల సేవలు అందిస్తున్నాయి. సేవలకు గాను మీ-సేవా కేంద్రాలు ప్రారంభంలో రూ.25 నుంచి రూ.1,000ల వరకు ఛార్జీలు వసూలు చేసేవి. ప్రస్తుతం పెరిగిన విద్యుత్, సాంకేతిక ఛార్జీల కారణంగా రేట్లను పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నది.

### మీ-సేవ ద్వారా అందుతున్న సేవలు

అడంగల్/పహాణీ నకలు, రికార్డు ఆఫ్ రైట్స్ నకలు (ఆర్ఓఆర్ ఐబీ), ఎఫ్ఎంబీ నకలు, గ్రామ భౌగోళిక పట్టిక నకలు (విలేజ్‌మ్యాప్), ఎఫ్‌లైన్ పిటిషన్స్, రెవిన్యూ రికార్డుల్లో వివరాల మార్పు (మ్యుటేషన్), భూముల సబ్‌డివిజన్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్ (కులం-స్థానికత-జనన ధ్రువీకరణ), ఓబీసీ ధ్రువీకరణ పత్రం, ఈబీసీ ధ్రువీకరణ పత్రం, వ్యవసాయ ఆదాయ ధ్రువీకరణ పత్రం, నో-ఎర్నింగ్ మెంబర్ (ఆర్జన లేని కుటుంబ) ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల (సామాజిక భద్రత పథకం - ప్రభుత్వం ఉద్యోగులు - పింఛన్లు) ధ్రువీకరణ పత్రం, ఇంకబరెన్స్ సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ పత్రాల ధ్రువీకరణ పత్రం, మనీలెండింగ్ లైసెన్స్ ధ్రువీకరణ పత్రం, అల్లోపతి వైద్యశాల రిజిస్ట్రేషన్, ఆపద్బంధు, ఎన్ఎఫ్‌బీఎస్‌కు దరఖాస్తు, ఎన్ఓసీ (భూములు), తాకట్టు వ్యాపారానికి అనుమతులు, పాఠశాలలు, కళాశాలల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రత్యేకంగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పుట్టిన తేదీల మార్పు, మరణ ధ్రువీకరణ పత్రంలో సవరణలు, పిల్లల పేర్లు మార్పు వంటి సేవలను మీ-సేవ అందిస్తున్నాయి.

– మీడియా రిలీజ్

# స్థానిక సంస్థలు - ప్రజాస్వామ్య వికేంద్రీకరణ

*" భారతదేశంలో ప్రజలు 65% గ్రామాల నందు నివసిస్తున్నారు. వీరికి కావలసిన కనీస అవసరాలు త్రాగునీరు, రోడ్లు, ఆరోగ్యం, ప్రాథమిక విద్యలను స్థానిక సంస్థలు మాత్రమే తీర్చగలుగుతాయి. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ, స్థానిక సంస్థలలో మాత్రమే కనపడుతోంది. అనేక పేద బడుగు వర్గాలకు చెందిన కొంతమంది ఉపాధి హామీ కూలీలు సైతం సర్పంచ్‌లుగా, ఎంపిటిసిలుగా ఎన్నుకొనబడినారు."*



**భా**రతదేశం నందు స్థానిక సంస్థలు అనాదిగా ఉన్నట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. వీటి చారిత్రాత్మక మూలాలు హరప్ప మొహంజదారో మొదలగు నాగరికతలు విరిసిల్లినప్పుడు సభ, సమితి రూపాలలో ఉన్నట్టు చాలా మంది చరిత్రకారులు మరియు డి.డి.కౌశాంబి పేర్కొనడం జరిగినది. ఆ తర్వాత వచ్చిన మౌర్యులు, గుప్తులు, చాళిక్యులు, ఇక్ష్వాకుల కాలంలో కూడా ఇది కొనసాగిన చారిత్రక ఆధారాలు ఉన్నాయి కాని మధ్యయుగ భారత వీటి ప్రస్తావన దేశ చరిత్రలోలేదు. కారణంమొఘల్ చక్రవర్తులు స్థానిక పాలనను ప్రోత్సహించలేదని తెలుస్తోంది.

కాని భారతదేశం నందు బ్రిటీష్ వారి పాలనలో స్థానిక సంస్థలు ఉన్నాయి. కాని స్థానిక సంస్థలు మాత్రమే కాని స్వపరిపాలన సంస్థలు కావు. ఈ స్థానిక సంస్థలందు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేదు. బ్రిటీష్ అధికారులు మాత్రమే వాటిని నిర్వహించారు. 1772తో ప్రారంభమైన బ్రిటీష్ పాలనలో స్థానిక నగర సంస్థ పన్నులు వసూలు చేయడానికి మాత్రమే ఉపయోగపడినాయి. బ్రిటీష్ వారి అధికారం నిలబెట్టడానికి అధికారుల పెత్తనంతో మాత్రమే కొనసాగినాయి. గవర్నర్ జనరల్ రిప్పన్ కాలంలో మాత్రం కొన్ని సంస్కరణలు చేపట్టడం జరిగినది. ఆనాటి జమిందారీ రైత్వారీ పద్ధతుల్లో స్థానిక పాలన నిబిడీకృతమై నడిచింది.

స్వాతంత్ర్యానంతరం 1952 నందు ప్రారంభించిన సామూహిక అభివృద్ధి పథకం మొట్టమొదట స్థానిక సంస్థలు ఏర్పడడానికి దారి తీసింది. సంక్షేమ పథకాలు అమలు చేయడం ప్రారంభించారు. దీని అమలు తీరు పరిశీలించడానికి ఏర్పాటు చేసిన బలవంతరాయ్ మెహతా కమిటీ దీని లోపాలను పరిశీలించి దీని యందు ప్రజల భాగస్వామ్యం లేనందున అనుకున్నంత ప్రతిఫలం సాధించలేదని పేర్కొనడం జరిగింది. ఈ సిఫార్సుల ఫలితంగా 1959 నందు మూడెంచల పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పరచడమైనది. 1. జిల్లా పరిషత్, 2. పంచాయతీ సమితి, 3. గ్రామపంచాయతీలు తర్వాత స్థానిక ప్రభుత్వాలు బలోపేతం చేయడానికి మరియు వీటి పనితీరు పరిశీలించడానికి అశోక్‌మెహతా, జి.వి.కె. రావు కమిటీలను నియమించడం జరిగినది. కాని పంచాయతీరాజ్ సంస్థలు అనుకున్నంతగా పటిష్టం కాలేదు. దీనికి ప్రధాన కారణాలు పంచాయతీ రాజ్ సంస్థలకు

1. ఆర్థిక వనరులు లేకపోవడం
2. బలహీన వర్గాల (ఎస్సీ, ఎస్టీ, బిసి, మహిళా) ప్రాతినిధ్యం లేకపోవడం
3. ఆర్థికంగా ఉన్నత వర్గాల ఆధిపత్యం కొనసాగడం
4. పంచాయతీ రాజ్ సంస్థలకు కనీస అవసరాలు తీర్చడానికి కావలసిన అధికారాలు బదలాయించకపోవడం
5. నిర్ణీత కాల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించకపోవడం

పై సమస్యల ద్వారా పంచాయతీ రాజ్ సంస్థలు ప్రజల మన్ననలు పొందలేకపోయాయి.

అయినా 1993లో ప్రధాని పి.వి.నరసింహరావు నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం మొట్టమొదటిగా 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు రాజ్యాంగ అధికారాలు బదలాయించడానికి వెసలుబాటు కల్పించింది. దీని ముఖ్యాంశాలు

1. స్థానిక సంస్థలకు 29 అంశాలతో అధికారాలు
2. బలహీన వర్గాలకు, మహిళలకు మరియు మైనారిటీ, ఎస్సీ, ఎస్టీల భాగస్వామ్యం కల్పించింది.
3. రాష్ట్ర ఆర్థిక సంస్థ ఏర్పాటు
4. క్రమం తప్పకుండా ప్రతి 5 సం॥రాలకు ఎన్నికలు జరిపించడం.

వెంగళరావు కమిటీ పంచాయతీ రాజ్ సంస్థలను బలోపేతం చేయడానికి పెక్కు సూచనలు చేసింది.

మురళీధరరావు కమిటీ వెనుకబడిన తరగతులను కూడా అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని పేర్కొంది. 73వ రాజ్యాంగ సవరణ స్థానిక సంస్థలకు విషయంలో ఒక మైలురాయిగా వర్ణించవచ్చు. భారతదేశ ప్రజలు ఈ రోజు కూడా 65% వరకు గ్రామాల నందు నివసిస్తున్నారు. వారి కనీస అవసరాలు త్రాగునీరు, రోడ్లు, ఆరోగ్యం, ప్రాథమిక విద్య, తీర్చే భారము స్థానిక సంస్థలు మాత్రమే తీర్చగలుగుతాయి. ప్రజాస్వామ్య స్థానిక వికేంద్రీకరణ, స్థానిక సంస్థలలో మాత్రమే కనపడుతుంది. అనేక పేద బడుగు వర్గాలకు చెందిన వారు, ఉపాధి హామీ కూలీలు, సైతం సర్పంచ్‌లుగా, ఎంపిటిసిలుగా ఎన్నుకోబడినారు. కాని ఒకప్రక్క పార్లమెంట్ నందు కార్పొరేట్ దిగ్గజాలు, విదేశీ విద్యనభ్యసించినవారు ఉంటే పంచాయతీరాజ్ సంస్థలందు మాత్రం రెక్కాడితే గాని డొక్కాడని ప్రజలు మరియు నిరక్షరాస్యులు ప్రాతినిధ్యం వహించుతున్నారు. ఎన్నికలలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు 60%నకు మించిన పోలింగ్ జరగదు. కాని స్థానిక సంస్థలందు 90% ప్రజలు ఓటింగ్ నందు పాల్గొంటున్నారు. కొన్ని గ్రామాలందు 96% పోలింగ్ జరిగిన సందర్భాలు ఉన్నాయి. దీనిని బట్టి నిజమైన ప్రజాస్వామ్య వికేంద్రీకరణ స్థానిక సంస్థలందు కనపడుతుంది.

అందుకే మహిళలకు 50% ప్రాతినిధ్యం తెలంగాణ రాష్ట్ర స్థానిక సంస్థల్లో కల్పించి విజయవంతంగా అమలు చేస్తున్నారు. రాబోయే కాలంలో స్థానిక సంస్థలలో ప్రజల భాగస్వామ్యం మరింతగా పెరిగి వారికి సౌకర్యాలు అందులాగున పనిచేస్తాయని ఆశిద్దాం.

**- బి.శేషాద్రి, సెంటర్ హెడ్, సి.డి.పి. & ఏ.**



# దేశంలో సంక్షేమ యంత్రాంగం

*సాంఘిక సంక్షేమం అంటే సమాజం లోని వ్యక్తులు అవసరాలను సంతృప్తి పర్చడానికి సమిష్టిగా నిర్వహించే చర్యలు - రిచర్డ్ టెట్‌మన్*

- భారతీయ సమాజంలోని కొన్ని వర్గాలు ఏదో ఒక కారణంతో సమానత్వ భావనలోకి రాకుండా సామాజిక వెలివేతకు గురయ్యాయి.
- సామాజిక వెలి అనే పదంలో మొదటిసారిగా ఉపయోగించింది. ఫ్రెంచ్ దేశానికి చెందిన 'రీన్ లెనోయర్' పారిశ్రామిక విప్లవం ఫలితంగా సంక్షేమ రాజ్యభావన యూరప్‌లో (ఇంగ్లాండ్) ప్రారంభమైంది.
- ఫ్రెంచ్ విప్లవం సంక్షేమ రాజ్యానికి పుట్టుకగా భావిస్తారు.
- ప్రాచీన రాజ్యాలు, పోలీస్ రాజ్యాలు, నేటి ఆధునిక రాజ్యాలు సంక్షేమ రాజ్యాలు
- ఉపయోగితవాది జెర్మి బెంథామ్ భావనలు శ్రేయోరాజ్య భావన గురించి తెలియజేస్తుంది.

**నిర్వచనలు:**

- సంక్షేమ రాజ్యం అంటే అటు కమ్యూనిస్టు రాజ్యానికి, ఇటు మితిమీరిన వ్యక్తి శ్రేయోవాదానికి మధ్యేమార్గం ఏర్పడిందిర.
  – హాబ్‌మన్
- ఆధునిక కాలంలో ప్రజలందరికీ ఏదో ఒక రూపంలో పలు రకాల సేవలు అందిస్తున్న రాజ్యాలు  సేవా రాజ్యాలు
  – రోస్కోలాండ్
- భారతదేశంలో సమాజ సంక్షేమం కోసం రాజ్యాంగ ప్రవేశికలోని భావనలు, ఆదేశిక సూత్రాల్లో పొందుపర్చిన నియమాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలు రూపొందించే సమయంలో వారికి ఉపయోగపడి మార్గదర్శకంగా ఉంటూ సంక్షేమ చర్యలు నిర్వహించడానికి ఉపయుక్తంగా ఉన్నాయి.
- దేశంలో సంక్షేమ కార్యక్రమాలను రూపొందించి అమలు పర్చాల్సిన భాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత దేశ ప్రజలందరికీ కనీస అవసరాలు సమకూర్చాల్సిన అవసరం ఏర్పడింది.
- కేంద్ర ప్రభుత్వం 1952 అక్టోబర్ 2వ సమాజ అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇదే కార్యక్రమాన్ని 1953 అక్టోబర్ 2న సమాజ వికాస అభివృద్ధి పథకంగా ప్రవేశపెట్టారు.
- సిడిపి, ఎన్ఇఎస్‌పి కార్యక్రమాలు సమాజ వికాస పథకాలుగా

అమలయ్యాయి.

- 1957లో కేంద్ర ప్రభుత్వం సమాజ అభివృద్ధి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది.
- 1974లో గ్రామీణ అభివృద్ధి శాఖను ఏర్పాటుచేశారు.
- 1985లో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో సాంఘిక సంక్షేమ శాఖను ఏర్పాటు చేశారు. ఈ శాఖ కిందివర్గాల సంక్షేమం కోసం కృషి చేసింది.
- 1. షెడ్యూల్డ్ కులాల సంక్షేమం
- 2. షెడ్యూల్డ్ తెగల సంక్షేమం
- 3. వెనుకబడిన తరగతుల సంక్షేమం
- 4. మైనార్టీల సంక్షేమం
- 5. వికలాంగుల సంక్షేమం
- 1985లో ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ శాఖను 1998లో అటల్‌బిహారీ వాజ్‌పేయ్ ప్రభుత్వం సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖగా పేరు మార్చింది.
- ప్రస్తుతం కేంద్ర సామాజిక న్యాయం, సాధికారమంత్రి దావర్‌చందర్ గెహ్లాట్
- 1. గిరిజన శాఖ
- 2. మహిళ, శిశు సంక్షేమ శాఖ
- 3.మానవ వనరుల అభవృద్ధి శాఖ
- 4. మైనార్టీల వ్యవహారాల శాఖ
- సామాజిక సంక్షేమం అమలు చేయడానికి కేంద్రం రాజ్యాంగబద్ధమైన, చట్టపరమైన కమిషన్లు ఏర్పాటు చేసింది. అవి...
- 1. జాతీయ షెడ్యూల్డ్ కులాల కమీషన్ (ఎస్సీ)
- 2. జాతీయ షెడ్యూల్డ్ తెగల కమీషన్ (ఎస్టీ)
- 3. జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (ఓబిసి)
- 4. జాతీయ అల్పసంఖ్యాక వర్గాల కమిషన్ (మైనార్టీ)
- 5. జాతీయ మహిళా కమీషన్
- 6. జాతీయ మానవ హక్కుల కమిషన్
- 7. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్
- భారత రాజ్యాంగ పరిషత్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ రాజ్యాంగ ప్రధాన లక్ష్యం పేదరికానికి...............

**ప్రాథమిక హక్కులు:**

- అధికరణం 14 ప్రకారం చట్టం అందరికి సమానం
- 15(2) నిబంధన ప్రకారం ప్రభుత్వ బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ ధన సహాయంతో నిర్వహించే సంస్థల్లో జాతి, కుల, మత, లింగ జన్మ విచక్షణలు చూపకుండా అందరికీ ప్రవేశం కల్పించాలి.
- 15(4) నిబంధన ప్రకారం ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ప్రత్యేక రక్షణలు కల్పించి, మినహాయింపులు ఇవ్వవచ్చు.
- 15(5) నిబంధన ప్రకారం ప్రైవేట్, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలవారికి ప్రత్యేక అవకాశాలు కల్పించాలి.
- 16(2) నిబంధన ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో జాతి, కుల, మత, లింగ, జన్మ వారసత్వ, స్థిర నివాస ప్రాతిపదికన వివక్ష చూపరాదు.
- 16(4) నిబంధన ప్రకారం బలహీనవర్గాల వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో సరైన ప్రాతినిథ్యం లేనప్పుడే రిజర్వేషన్లు కల్పించవచ్చు.
- 16(4ఎ) నిబంధన ప్రకారం ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ఉద్యోగాల్లో పదోన్నతిలో రిజర్వేషన్లు కల్పించవచ్చు.
- 16(4బి) నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో అర్హత మార్కులు తగ్గించవచ్చు.
- 17వ నిబంధన అంటరానితనం నేరం.
- 19(5) నిబంధన ప్రకారం ప్రతి వ్యక్తి తనకు ఇష్టమైన వృత్తిని స్వీకరించవచ్చు.
- 23 నిబంధన ప్రకారం వెట్టిచాకిరి, బానిసత్వాన్ని నిర్మూలించి ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి రక్షణ కల్పించాలి.
- 29 నిబంధన ప్రకారం వెట్టిచాకిరి బానిసత్వాన్ని నిర్మూలించి ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి రక్షణ కల్పించాలి.
- 29 నిబంధన ప్రకారం భారతదేశంలో అన్నివర్గాల ప్రజలు తమ భాష, లిపి, సంస్కృతిని పరిరక్షించుకోవచ్చు. అంటే ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి భాష, లిపి సంస్కృతి పరిరక్షించబడుతుంది.
- 30(2) నిబంధన ప్రకారం అల్పసంఖ్యాక వర్గాల విద్యాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి.

**ఆదేశ సూత్రాలు:**

- 38(1) నిబంధన ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంఘిక ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి.
- 39(సి) ప్రకారం జాతీయ సంపద వికేంద్రీకరించాలి.
- సంపద అందరికీ సమానంగా పంపిణీ చేయాలి. 46వ నిబంధన ప్రకారం ఎస్సీ,ఎస్టీ వెనుకబడిన తరగతుల వారికి విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి.

**ఇతర అంశాలు:**

- 16(4) నిబంధన ప్రకారం గిరిజన జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, రాష్ట్రాల్లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని నియమించాలి.
- 243 (డి) నిబంధన ప్రకారం పంచాయతీరాజ్ వ్యవస్థలో 243(టి) నిబంధన ప్రకారం పట్టణ ప్రభుత్వాలలో జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ వర్గాలవారికి ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి.
- 10వ భాగం 244 నిబంధనలో షెడ్యూల్డ్, గిరిజన ప్రాంతాలకు సంబంధించిన పరిపాలన అంశాలు చేర్చారు. ఈ నిబంధన అసోం, మేఘాలయ త్రిపుర, మిజోరం రాష్ట్రాలకు వర్తించదు.



# బలహీనమైన గుండెకు బహు చికిత్సలు

శరీర అవసరాలకు సరిపడినంత రక్తాన్ని గుండె పంప్ చేయ్యలేని పరిస్థితిని హార్ట్ ఫెయిల్యూర్‌గా చెప్పవచ్చు. ఇలాంటి సమస్యతో బాధపడుతున్న కొంత మందిలో గుండె రక్తంతో పూర్తిగా నిండదు. గుండెకు రక్తాన్ని, పంప్ చేసి సామర్థ్యం తగ్గిపోతుంది.కానీ హార్ట్ ఫెయిల్యూర్ అనేది చాలా ప్రమాదకరమైన స్థితి అనే చెప్పుకోవాలి. వెంటనే వైద్య సహాయం అవసరం అవుతుంది.

### లక్షణాలు

హార్ట్ ఫెయిల్యూర్ సమస్య క్రమంగా పెరుగుతూ వస్తుంది. గుండె క్రమంగా బలహీన పడుతూ ఉంటుంది. ఒక్కోసారి గుండెలోని కుడి భాగంలో ఫెయిల్యూర్ ఏర్పడవచ్చు. ఒక్కోసారి రెండువైపులా ఏర్పడవచ్చు. కుడి భాగంలో మాత్రమే సమస్య ఉన్నప్పుడు గుండు సరిపడినంత రక్తాన్ని ఊపరితిత్తులకు సరఫరా చేయలేకపోవడం వల్ల ఆక్సిజన్ తగినంతగా అందదు. గుండెలో ఎడమైపు సమస్య ఏర్పడినపుడు శరీరానికి సరిపడినంత ఆక్సిజన్ కలిగిన రక్తాన్ని పంపిణీ చేయ్యలేదు.

కుడిభాగంలో సమస్య ఏర్పడితే పాదాలు, చీలమండలు, కాళ్లు, పొట్ట, కాలేయ భాగాల్లో నీరు చేరుతుంది. కుడి ఎడమ రెండు భాగాల్లో గుండె బలహీన పడినపుడు ఊపరి తీసుకోవడంలో ఇబ్బంది, అలసటగా ఉ ఒడడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

### కారణాలు

సాధారణంగా హార్ట్ ఫెయిల్యూర్ సమస్యకు కరోనరీ హార్ట్ డిసీజ్ కారణమవుతుంది. రక్తపోటు, మధుమేహం అందుపులో ఉండకపోవడం ఈ సమస్యకు ముఖ్యమైన కారణం. వీటిని అదుపులో ఉంచగలిగితే హార్ట్ ఫెయిల్యూర్ సమస్య రాకుండా చూడవచ్చు.

ఇవే కాకుండా మరికొన్ని అనారోగ్య పరిస్థితులు కూడా హార్ట్ ఫెయిల్యూర్‌కు కారణం కావచ్చు.

1. కార్డియో మమోపతి లేదా గుండె కండరాల సమస్య పుట్టకతోనే ఉ ఒడవచ్చు లేదా ఏదైనా ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా ఈ సమస్య రావచ్చు.
2. గుండె కవాటాల్లో సమస్యలు : గుండెలోని కవాటాల్లో పుట్టకతో లేదా ఏదైనా ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా ఏర్పడవచ్చు. దీనివల్ల గుండెపోటు రావడం ఫలితంగా గుండె బలహీన పడడం జరగవచ్చు.
3. క్రమం తప్పిన గుండె లయ: ఇలాంటి సమస్య పుట్టుకతో గుండెలో లోపాలు ఉన్నప్పుడు ఏర్పడుతుంది. దీనిని పుట్టుకతో వచ్చే లోపాలు లేదా కంజెనిటల్ హార్ట్ డిసీజ్ అంటారు.
4. కాన్సర్‌కు తీసుకునే రేడియేషన్, కీమోథెరపీ వంటి చికిత్సలు, థైరాయిడ్ సమస్యలు, ఆల్కహాల్ లేదా ఇతర డ్రగ్స్ వాడకం, హెచ్ఐవీ/ ఎయిడ్స్, విటమిన్ ఇ ఎక్కువగా తీసుకోవడం వంటి కారణాలతో కూడా గుండె బలహీన పడి హార్ట్ ఫెయిల్యూర్‌కు దారి తీయవచ్చు.



## నిర్ధారణ

హార్ట్ ఫెయిల్యూర్ సమస్యను నిర్ధారించడానికి ముందు కుటుంబ చరిత్ర, భౌతిక పరీక్షలు చేస్తారు. ఎందుకంటే హార్ట్ ఫెయిల్యూర్ సమస్యలో కనిపించే లక్షణాలు అనేక ఇతర అనారోగ్య సమస్యలలో కూడా కనిపిస్తాయి.

- కరోనరీ హార్ట్ డిసీజ్ వంటి సమస్యలు ఉన్నాయేమో ముందుగా పరీక్షించి నిర్ధారిస్తారు.
- లక్షణాలు కనిపించడానికి ఇతర అనారోగ్య కారణాలేమైనా ఉన్నాయేమో చూస్తారు.
- గుండె రక్తాన్ని పంప్ చేసే సామర్థ్యాన్ని పరీక్షిస్తారు.
- కుటుంబంలో ఇది వరకు ఎవరికైనా ఇలాంటి సమస్య ఉందేమో నిర్ధారించుకుంటారు. హార్ట్ ఫెయిల్యూర్ సమస్యకు సరైన సమయంలో చికిత్స అందించడం ద్వారా వారి ఆయుర్ధాయం పెంచడం మాత్రమే కాదు. వారు ఆనందంగా, ఆరోగ్యంగా కూడా జీవించేందుకు అవకాశం ఉంటుంది.

## చికిత్స

### కార్డియాక్ రీసింక్రనైజేషన్ (సీఆర్‌టీ) :

ఈ చికిత్స ద్వారా హృదయ స్పందనను లయబద్ధం చేస్తారు. ఇలా హృదయస్పందన లయ తప్పడాన్ని ఎరిథమియాస్ అంటారు. దీనిని సరిచేయడానికి ఒక చిన్న నాణేం పరిమాణంలో ఉన్న పేస్‌మేకర్‌ను గొంతు కింద భాగంలో ఉన్న కాలర్ ఎముకల క్రింద అమరుస్తారు. అది మూడు వైర్ల ద్వారా కొద్దిపాటి ఎలక్ట్రిసిటీ పంపండం ద్వారా హృదయ స్పందనను క్రమబద్ధీకరిస్తూ ఉంటుంది. గుండె సరిగ్గా కొట్టుకోకపోవడం వల్ల సమస్య ఏర్పడుతున్నపుడు ఇలాంటి చికిత్సను అందిస్తారు.

### ఇంప్లాంటబుల్ కార్డియో డీఫైబ్రిలేటర్ (ఐసీడీ):

కొంతమందిలో గుండె చాలా బలహీనపడుతుంది. వారిలో తీవ్రమైన ఎరిథమియాస్ ఉంటుంది. ఇలాంటి వారికి ఐసిడీ మంచి చికిత్స. ఐసిడీ అనేది ఒక చిన్న పరికరం. దీనిని ఛాతిలో లేదా పొట్ట భాగంలో అమరుస్తారు. ఇది కూడా హృదయస్పందనను లయబద్ధం చేయ్యడానికి ఉపయోగపడుతుంది.

కొన్నిసార్లు తీవ్రమైన అరిథమియాస్ వల్ల గుండె ఆకస్మాత్తుగా ఆగిపోవచ్చు. ఇలా ఆకస్మాత్తుగా గుండె ఆగిపోవడం వల్ల ముందుగా మెదడుకు రక్త ప్రసరణ నిలిచిపోతుంది. తర్వాత శరీరంలోని మిగిలిన అవయవాలకు కూడా రక్త ప్రసరణ ఆగిపోతుంది.

ఇలాంటి సందర్భంలో కొద్ది నిమిసాల వ్యవధిలోనే చికిత్స అందిస్తే తప్ప ప్రాణాపాయం నుంచి బయట పడడం అసాధ్యం. అలాంటి ప్రాణాంతకంగా పరిణమించే అరిథమియాస్‌ను కూడా ఇది అదుపు చేస్తుంది.

**గుండె మార్పిడి :** కొంత మందిలో గుండె చాలా బలహీనపడిపోయి చాలా తీవ్రమైన హార్ట్ ఫెయిల్యూర్ సమస్య ఉంటుంది. అలాంటి వారికి వీలైనంత వరకు ఆహార నియమాలు పాటిస్తూ, సరైన మందులు ఇస్తూ ప్రాణాలు కాపాడుతారు.

అలాంటి వారికి గుండె మార్పిడి ఒక్కటే పరిష్కారం. ఈ చికిత్సలో దాత నుంచి సేకరించిన ఆరోగ్యవంమైన గుండెను అమరుస్తారు. ఈ గుండెను బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి సేకరిస్తారు. ఇలా గుండె మార్పిడి చేయించకున్న వారిలో 90 శాతం కంటే ఎక్కువ మంది ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం పాటు ఆరోగ్యంగా జీవించిన వారు ఉన్నారు.

## జాగ్రత్తలు

హార్ట్‌ఫెయిల్యూర్ సమస్యకు శాశ్వత చికిత్స అందించడం వీలు కాదు కానీ లక్షణాలను అదుపు చేసి జీవితకాలంతో పాటు జీవిత నాణ్యతను పెంచవచ్చు.

హార్ట్ ఫెయిల్యూర్ సమస్యలో సకాలంలో మందులు క్రమం తప్పకుండా వాడడం అనేది చాలా ముఖ్యమైన విషయం. ఆహారంలో ఉప్పు తగ్గించి తీసుకోవడం వల్ల శరీరంలో ఎక్కువ ఫ్లూయిడ్ నిల్వ ఉండకుండా నివారించవచ్చు.

ఇందుకోసం ఆహారంలో అదనంగా ఉప్పు చేర్చకపోవడం, సోడియం తక్కువగా ఉన్న వాడడం, తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా ఉపయోగించడం, తాజా పండ్లు, కూరగాయల నుంచి తీసిన రసాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలోకి తక్కువ సోడియం చేరుతుంది.





" హర్యానా ప్రభుత్వం అక్కడ జరిగే పంచాయితీరాజ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస విద్యార్హత ఉండాలంటూ చట్టాన్ని రూపొందించింది. దీనిపై ఆ రాష్ట్రంలోనే కాకుండా, దేశవ్యాప్తంగా కూడా రాజకీయ నాయకులకు కనీస విద్యార్హత ఉండాలా వద్దా అనేదానిపై పలు కోణాల్లో చర్చలు కొనసాగుతున్నాయి. హర్యానా ప్రభుత్వం నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించడంతో నిరక్షరాస్యులైన రాజకీయ నేతల్లో వణుకుపుడుతోంది. "

# కనీస విద్యార్హతగలవారికే పంచాయితీ పదవులు - హర్యానా ప్రభుత్వం

రాజకీయ నాయకులకు, పాలకులకు ఇప్పటివరకూ కనీస విద్యార్హతలను ఎక్కడా నిర్దేశించలేదు. నిరక్షరాస్యులు కూడా అవకాశం వస్తే ముఖ్యమంత్రులయ్యే అవకాశం భారత ప్రజాస్వామ్యం కల్పించింది. ఇటీవలే బీహార్‌లో భారీ మెజార్టీతో గెలిచిన నితీష్‌కుమార్ కెబినెట్‌లో కనీసవిద్యార్హతలను అసలు అక్షరాలు రానివారు కూడా మంత్రులయ్యారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రతికూల ప్రచారం జరిగింది.

నితీష్‌కుమార్ కేబినెట్‌లోని మంత్రుల విద్యార్హతలపై అనుకూల ప్రతికూల చర్చలు పెద్ద ఎత్తున సాగాయి. ఈ నేపథ్యంలోనే హర్యానా ప్రభుత్వం అక్కడ జరిగే పంచాయితీరాజ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస విద్యార్హత ఉండాలంటూ చట్టాన్ని రూపొందించింది. బిజెపి నాయకత్వంలోని హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఇలాంటి సాహసోపేత చట్టాన్ని తీసుకువచ్చారు. దీనిపై ఆ రాష్ట్రంలోనే కాకుండా, దేశవ్యాప్తంగా కూడా రాజకీయ నాయకులకు కనీస విద్యార్హత ఉండాలా వద్దా అనేదానిపై పలు కోణాల్లో చర్చలు కొనసాగుతున్నాయి.

ముఖ్యమంత్రిగా ఖట్టర్ పదవీకాలం ఏడాది దాటింది. ఆయన ఆర్ఎస్ఎస్ ప్రచారక్ స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయిదాకా ఎదిగారు. 50 ఏళ్ళ తర్వాత హర్యానాలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటయింది. ఆ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న ఖట్టర్ ఏడాదికాలంలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని సంస్కరణలు వినూత్న పథకాలను తీసుకువస్తున్నారు. ముఖ్యంగా ఆయన మహిళల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో మహిళా పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేసి అందులో మహిళలనే కానిస్టేబుళ్లుగా నియమిస్తున్నారు. పోలీసు స్టేషన్లలో ఉండాలనేది బ్రహ్మచారిగా ఉన్న ఖట్టర్ నిర్ణయంగా చెపుతున్నారు. ఈ పోలీసు స్టేషన్లకు అక్కడ మహిళా లోకం నుంచి మంచి స్పందనే లభిస్తున్నది.

ఆ తర్వాత రాష్ట్రంలోని పౌరులెవరిపైన అయినా ఫిర్యాదు చేయడానికి 'హర్‌సమయ్' ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ పోర్టల్‌కు కూడా విశేష ఆదరణ లభించింది. మధ్యవర్తులు లేకుండా ఫిర్యాదు చేసే అవకాశం ఉండటంతో పెద్ద ఎత్తున ప్రభుత్వ శాఖలపై అధికారులపైనా చివరకు రాజకీయ నాయకులపైన కూడా ఫిర్యాదులందుతున్నాయి.

ఇదే కాకుండా ఆ రాష్ట్రంలోని పోలీసులు అందరికీ యోగ శిక్షణ ఇవ్వాలని ఆయన నిర్ణయించారు. పోలీసులుగా నియమించేవారికి యోగాలో ప్రవేశం ఉండాలని నిబంధనలు నిర్దేశించారు. పోలీసులుగా పనిచేసేవారికి భౌతికంగా, మానసికంగా ఫిట్‌నెస్ ఉండాలంటే యోగా తప్పదంటూ ఆయన అక్కడి పోలీసులకు యోగాలో శిక్షణ ఇస్తున్నారు. ఇదికాక కొత్తగా పంచాయితీరాజ్ ఎన్నికలు వస్తుండటంతో ఈ ఎన్నికల్లో పోటీ చేసే వారికి కొన్ని ఆంక్షలు ఉండాలంటూ ఆయన చట్టాన్ని రూపొందించారు. సమాజంలోని వివిధ రకాలుగా విద్యార్హతలను ఆయన నిర్దేశించారు.

# విద్యార్థిని సర్పంచి



రాజస్థాన్ రాష్ట్రంలోని లీలావతీ గ్రామం (హనుమాన్ గర్ జిల్లా)లో సర్పంచ్‌గా ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన గార్గి కాలేజి మనోవిజ్ఞాన శాస్త్రం (సైకాలజీ) హానర్స్ 2వ సంవత్సరం విద్యార్థి వసుంధర చౌదరిని పోటీ లేకుండా ఎన్నికయ్యింది. 2015 గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఎన్నికైన అతి పిన్నవయస్సు సర్పంచ్ ఆమె. ఈ సందర్భంగా వసుంధర చౌదరి మాట్లాడుతూ 'తన కల నిజంగా నెరవేరిందని తనకు వచ్చిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని లీలావతీ గ్రామంను అభివృద్ధి చేస్తానని పేర్కొంది.

తన చదువుకు భంగం కలుగుకుండ గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది. లీలావతీ గ్రామంలోనున్న రోడ్లకు మరమ్మత్తులు చేయడం, టాయ్‌లెట్ల నిర్మాణానికి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించడం, వాష్‌రూమ్స్‌ను ప్రతి ఇంటికి ఏర్పాటు చేయడం. ముఖ్యంగా గ్రామస్తులలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉండుటవలన, పాఠశాలలో విద్యా సౌకర్యాలను చర్యలు తీసుకొన్నారు. చెట్లు నాటడం బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం, స్వచ్ఛభారత్ క్రింద గ్రామంలో పారిశుధ్యం పాటించులాగున చేసి, సౌరశక్తి సౌకర్యాలు కల్పించడం ద్వారా కూడా సౌకర్యాలు గ్రామంలో అభివృద్ధి చేయుటకు ప్రయత్నిస్తోంది. **– పి.ఐ.బి.**

అలాగే పంచాయితీల్లో విద్యుత్ బిల్లులు బ్యాంకుల రుణాలు చెల్లించిన వారికి ఇంట్లో టాయిలెట్ లేని వారికి ఎన్నికల్లో పోటీచేసే అర్హత లేదని చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం అమలులోకి రాకముందే ముగ్గురు మహిళలు దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లారు. ప్రభుత్వం విధించిన నిబంధన తమకు ప్రజాప్రతినిధులు అయ్యే అవకాశం లేదని దాన్ని రద్దు చేయాలని వారు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. సుప్రీంకోర్టు హర్యానా ప్రభుత్వం రూపొందించిన కొత్త చట్టాన్ని అసాంతం అధ్యయనం చేసింది. అందులోని మంచి చెడులను విశ్లేషించింది.

ముఖ్యంగా ప్రజలను పాలించే పాలకులు వారికి రోల్‌మోడల్స్‌గా ఉండాలంటే నిబంధనలను రూపొందిస్తే తప్పేమిటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. హర్యానా ప్రభుత్వం కిందిస్థాయి పంచాయితీల్లో ఆదర్శప్రాయమైన వ్యక్తులే ఎన్నిక కావడానికి వీలుగా విద్యార్హతలతోపాటు ఇతర నిబంధనలు రూపొందించడం తప్పులేదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఇది ఖట్టర్‌కు మంచి ప్రశంసగా నిలిచింది.

ముఖ్యంగా విద్యకు సంబంధించి ఒసిలకు ఎస్‌ఎస్‌సి, ఎస్‌సిఎస్టీలకు ఐదో తరగతిలాంటి విద్యార్హతలను నిర్దేశించటడంలో తప్పేమిటని విద్యతోనే పరిణతి వస్తుందని సభ్యతా సంస్కారం అలవడుతుందని చట్టాలను చదివి అవగాహన చేసుకునే అవకాశం ఉంటుందని కోర్టు నిబంధనలను పూర్తిగా సమర్థించింది. అలాగే డిఫాల్టర్లు ఎన్నికల్లో పోటీ చేయకూడదనే నిబంధనపై న్యాయమూర్తుల మధ్య చర్చ జరిగితే ఈ నిబంధన వల్ల పేదలు పోటీచేసే అవకాశం కోల్పోతారని పిటిషనర్ల తరపున న్యాయవాది వాదిస్తే కరెంటు బిల్లులు బ్యాంకు రుణాలు చెల్లించలేని వారు లక్షలు ఖర్చు చేసి ఎన్నికల్లో ఎలా పోటీ చేస్తారని జడ్జిలు ఆయనను ప్రశ్నించారు. అలాగే ప్రతి ఇంట్లో టాయిలెట్ ఉండాలనే నిబంధన పేదలకు ఆర్థికంగా కష్టతరమని చెపితే అక్కడ ఇప్పటికే ఎనిమిది లక్షల 50వేల దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లో 8 లక్షల మందికి ప్రభుత్వం టాయిలెట్లను నిర్మించి ఇచ్చిందని కొద్దిమంది వాటిని నిర్మించకపోతే పారిశుధ్యాన్ని నిర్లక్ష్యం చేయడంకాదా? అని సుప్రీం కోర్టు పిటిషనర్లను ప్రశ్నించింది.

అక్షరాస్యత, పరిశుభ్రత అనేది సమాజానికి అత్యంత అవసరమని అది ప్రజల నుంచి ఉద్యమంగా ప్రారంభం కావాలని కోర్టు సూచించింది. కాబోయే పాలకులకు కనీసం ఇవి లేకపోవడం అన్యాయమేనని దీన్ని నిరోధించడానికి నిబంధనలు రూపొందించే చట్టం రావడంలో తప్పేమి లేదంటూ మహిళలు వేసిన పిటిషన్‌ను కొట్టివేశారు. హర్యానా ప్రభుత్వం నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించడంతో నిరక్షరాస్యులైన రాజకీయ నేతల్లో వణుకుపుడుతోంది. ఇదే చట్టం దేశమంతటా అన్ని పాలనా వ్యవస్థల్లో వస్తే తమ భవిష్యత్తేమిటని వారంతా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటిదాకా రెండేళ్ళకు పైగా శిక్షపడినవారినే రాజకీయంగా ఏ పదవిలో ఉన్నా అనర్హులుగా చేస్తున్నారు. ఎక్కడాలేని విధంగా అసలు ఎన్నికల్లో పోటీకి కనీస విద్యార్హతలు నిర్దేశించడం అనేది ఇపుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# నాణ్యమైన ప్రత్తి కొరకు పాటించవలసిన ప్రమాణాలు



మన రాష్ట్రంలో ప్రత్తి అతి ముఖ్యమైన వాణిజ్య పంట, రాష్ట్రంలో ఈ సంవత్సరం సుమారుగా 12 లక్షల హెక్టార్లలో ప్రత్తి పంటను సాగు చేయడం జరిగింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ప్రత్తి దిగుబడులను ఈ సీజనులో గణనీయంగా తగ్గించనున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే దిగుబడులను అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో రైతాంగం పొందినట్లయితే మంచి మార్కెటు రేటును పొంది, నష్టాలను కొంతవరకు తగ్గించుకోవచ్చు. నాణ్యమైన ప్రత్తి దిగుబడులను పొందడానికి ప్రతి రైతులు కొన్ని ముఖ్యమైన సూచనలు పాటించవలసి వుంటుంది.

### ప్రత్తిని ఏరేటప్పుడు:

ప్రత్తి పంటలో పూలు పలు దఫాలుగా వస్తుంది. కాబట్టి తదనుగుణంగా 3-4 సార్లు ప్రత్తిని ఏరవలసి ఉంటుంది. పూర్తిగా పగిలిన ప్రత్తి కాయల నుంచి మాత్రమే ప్రత్తిని సేకరించాలి. ప్రత్తిని ఏరేటప్పుడు ప్రత్తితో పాటు ఆకులు, చెత్త రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రత్తి ఏరడానికి ముందు ఎటువంటి సస్యరక్షణ మందులు పిచికారి చేయకూడదు. పురుగు మందుల అవశేషాలు దూదిలో ఉంటే దాని నాణ్యత తగ్గిపోతుంది. ప్రత్తి తీతలు సాధారణంగా శీతాకాలంలో జరుగుతుంటాయి. ఉదయం 8 గంటల తర్వాత, మధ్యాహ్నం ఒంటి గంటలోపు మరల సాయంత్రం 3 నుండి 6 గంటల వరకు ప్రత్తిని ఏరుకోవాలి. ఉదయం పూటే ప్రత్తికి ఏరినట్లయితే కురిసిన మంచువల్ల ప్రత్తి తడిసి ముద్దగా అవుతుంది. అటువంటి ప్రత్తిని ఏరి ఆరబెట్టకుండా బోరాలలో తొక్కడం వల్ల విత్తనాలు మరియు దూది నాణ్యత కోల్పోవడం జరుగుతుంది. మిట్ట మధ్యాహ్నం ప్రత్తిని ఏరినట్లయితే గుల్లల వద్ద ఉన్న తోడిమలు, ఎండిన ఆకులు పెళుసెక్కి ముక్కలై ప్రత్తికి అంటుకుంటాయి. పురుగు/తెగుళ్లు ఆశించిన ప్రత్తిని విడిగా ఏరుకొని మార్కెటింగ్ చేసుకోవాలి. అదే విధంగా వర్షాల వల్ల లేక ఏ ఇతర కారణాల వల్లనైనా నాణ్యత సరిగా లేనట్లయితే అటువంటి ప్రత్తిని మంచి ప్రత్తితో కలపకుండా వేరుగా అమ్ముకోవాలి. పొట్టి పింజ ఉండే రకాలతో కలపకుండా వేరుగా ఏరుకోవాలి. తద్వారా ఏ రకానికి రావలసిన మార్కెటు రేటు ఆ రకానికి పొందవచ్చు. రైతులు మొదటి మరియు ఆఖరి దఫా ఏరేటువంటి ప్రత్తిని విడివిడిగా ఉంచుకోవడం మేలు. సాధారణంగా ఈ ప్రత్తిలో నాణ్యత తక్కువగా ఉంటుంది. ప్రత్తిని పాలిథిన్, జనప బస్తాలలో కాకుండా గుడ్డ సంచులలో ఏరడం ద్వారా నాణ్యతను కాపాడుకోవచ్చు.

### ప్రత్తిని నిల్వ చేసేటప్పుడు:


ప్రత్తిని తీయగానే నీడలో ఆరబెట్టాలి. గుడ్డి ప్రత్తిని, చెత్త చెదారమును వేరుచేయాలి. ఆరబెట్టడం వల్ల ప్రత్తి గింజ బాగా గట్టిపడి, అలాగే తేమ ఆరి ప్రత్తి శుభ్రంగా ఉంటుంది. సరిగా ఆరక ముందు ప్రత్తిని తొక్కినట్లయితే తేమ వల్ల వేడి ఎక్కువై గింజలు ముడుచుకుపోయి, ప్రత్తి తూకము తగ్గడమే కాకుండా ముక్కు పురుగు ఆశించడం వల్ల నాణ్యత కూడా తగ్గుతుంది. ప్రత్తి నిలువ చేసినప్పుడు పరిశుభ్రమైన స్థలంలో నిలువ చేయాలి. ఎలుకలు, ఇతర క్రిమికీటకాలు సోకకుండా జాగ్రత్త వహించాలి.

### ప్రత్తిని మార్కెటింగ్ చేసేటప్పుడు:

ప్రత్తిని మార్కెట్‌కు తరలించే ముందు నీటిని కలుపకూడదు. నీరు కలపడం వల్ల విత్తనాలు మరియు దూది నాణ్యత కోల్పోవడం జరుగుతుంది. ప్రత్తిని బస్తాలకు బదులుగా బోరాలలో తొక్కుకొని మార్కెట్‌కు తీసుకెళ్లడం మంచిది. ఈపద్ధతిలో రైతులకు బస్తాలు కొనవలసిన అవసరం ఉండదు. తూకాలు మోసాలు చేయడానికి అవకాశం లేదు. అలాగే కూలీలతో ఎత్తడం లేదా దించడం ఖర్చు ఉండదు. కొనుగోలుదారునికి నాణ్యతపై నమ్మకం ఉంటుంది. కాబట్టి ఎక్కువ ధర రావడానికి అవకాశం ఉంటుంది. రైతులు ఎప్పటికప్పుడు టి.వి.లు, రేడియోలు, న్యూస్ పేపర్ల ద్వారా మార్కెట్ ధరలను తెలుసుకొంటూ అమ్ముకోవడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చు.

రైతాంగం పైన సూచించిన పద్ధతులను పాటించడం ద్వారా ప్రత్తిలో నాణ్యమైన దిగుబడులను తద్వారా మంచి మార్కెటు రేటును పొందవచ్చు.

**డా॥ ఆర్.సుభాష్‌రెడ్డి, డా॥ యస్.త్రివేణి, వై.నాగరాజు, బి.ప్రసన్నకుమార్, డి.మనోజ్‌కుమార్, జె.దుర్గాసాయి (అసోసియేట్ డీన్) వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500030**





# తెలంగాణ సినిమా

## తెరమరుగున తేజోవంతమైన చరిత్ర

'కినిమా' అనే గ్రీకు పదం నుండి రూపాంతరం చెందినదే సినిమా అనే మాట. 1889లో థామస్ ఆల్వా ఎడిసన్ కెనెటోస్కోపు కనుగొనడంతో ఈ సినిమా కళ పుట్టింది. తొలుత ఒక నిముషం, రెండు తర్వాత అయిదు నిముషాల వ్యవధి వరకు నడిచే చిన్న మూకీ సినిమాలు తయారైనవి. ఇట్లంటి సినిమాలను ముందుగా ఇండియాకు తెచ్చిన వారు లూమియర్ బ్రదర్స్. వీరు 1896లో బొంబాయిలోని వాట్సన్ హొటల్‌లో 'దిసీ బాత్ 'ది' అరైవల్ ఆఫ్ ట్రైన్' వంటి చిన్న సినిమాలను ప్రదర్శించి భారతీయులకు సినిమాలను పరిచయం చేశారు. వీటి ప్రేరణతో 1913లో దాదా సాహెబ్ ఫాల్కే తొలి భారతీయ కథాచిత్రం 'రాజా హరిశ్చంద్ర' తీశారు. దీనికన్నా ముందే నిజాం స్టేట్‌లో తెలంగాణ సినిమా చరిత్రకు బీజాలాపన జరిగిన విషయం చాలా మందికి తెలియదు. తెలంగాణ సినిమా ఏమిటి? తెలంగాణలో సినిమా ఎక్కడిది? తెలంగాణలో సినిమా వాళ్లెవరున్నారు? వంటి ప్రశ్నలు పరిశ్రమలో విహారం చేసినవి. ఇప్పటిదాకా హైదరాబాద్‌లో జరిగిన సినిమాల సంగతులు వివక్షతో కూడి తెలుగు సినిమా చరిత్రలో ఒక ఉపశీర్షికగా పేర్కొనబడినవి. కానీ తెలంగాణ సినిమాకు భారతీయ సినిమాతో బాటు సమాంతర చరిత్ర ఉన్నది.

1908లో హైదరాబాదులో మూసినదికి పెద్దఎత్తున వరదలు వచ్చి జననష్టం,ఆస్థినష్టం భారీగా జరిగింది. ఈ వరదల దృశ్యాలను చిత్రీకరించడానికి ఆరవ నిజాం మహబూబ్‌అలీ కలకత్తాకు చెందిన జె.ఎఫ్.మదన్ బృందాన్ని రప్పించి సినీ కెమెరాలతో వరద దృశ్యాలను షూట్ చేయించారు. ఆ తరువాత ఈ దృశ్యాలను ప్రజల కోసం ప్రదర్శించారు కూడా. వీటి గురించి ఆ రోజుల్లో హైదరాబాదు ప్రజలు కథలు కథలుగా చెప్పుకునేవారు. ఇక్కడొక విషయం గమనించాలి. దీంతో నిజాం స్టేట్‌లో 1908కి ముందే సినిమాల గురించిన అవగాహన ఉందని రుజువవుతున్నది. లేకుంటే నిజాం జె.ఎఫ్.మదన్‌ని పిలిచి చిత్రీకరణ జరిపించి వుండేవాడు కాదు. ఖచ్చితంగా హైదరాబాదులో 1908కి ముందే ఫిలిం స్క్రీనింగ్స్ జరిగినవి. ఇది కాదనలేని సత్యం. 1908లోనే బాబూ పి.ఎస్ అనే ఒకాయన తెలంగాణ అంతటా తిరిగి 'ఇంపీరియల్ బయోస్కోప్ కంపెనీ' పేరున మూకీ సినిమాలు ప్రదర్శించారు. ఈయన 1935లో తయారైన 'శ్రీకృష్ట తులాభారం'లో కృష్ణుడుగా నటించిన ఎస్.జైసింగ్‌కి తండ్రి. ఈ బాబూ పి.ఎస్. ఎక్కడివాడో తేలాల్సి ఉంది. దీంతో 1908కి ముందే తెలంగాణ సినిమా ప్రారంభమైనదని రూఢీ అవుతున్నది. అదే తెలుగు సినిమా పితామహుడుగా చెప్పుకునబడుతున్న రఘుపతి వెంకయ్య 1909లో సినిమా ప్రదర్శన మొదలు పెట్టిన విషయం ఇక్కడ గమనార్హం.

పోతే, ఇటీవల 2010లో లండన్ సేజ్ పబ్లికేషన్స్ వారు ప్రచురించిన 'బయోస్కోప్' అనే గ్రంథంలో హైదరాబాదులోని మూకీల నాటి కొన్ని చారిత్రక వాస్తవాలు వెలుగులోకి వచ్చినవి. ఇవన్నీ కూడా 1908కి ముందే హైదరాబాదులో స్క్రీనింగ్స్ జరిగినట్లు రుజువు పరుస్తున్నవి. 1896





సెప్టెంబర్ మొదటి వారంలోనే సికింద్రాబాదు నుండి చిన్న సినిమాల (మూకీలు)తో కూడిన పీప్ హోల్ షోస్ మద్రాసు వెళ్లినట్లుగా స్టీఫెన్ పుట్నాం హ్యూస్ రాశారు. అంతేగాకుండా 1897, ఆగస్టులో స్టీవెన్‌సన్ అనే విదేశీ మూకీ చిత్రాల ప్రదర్శకుడు దక్షిణ భారతదేశమంతటా పర్యటిస్తూ హైదరాబాద్ జంట నగరాల్లో ప్రదర్శనలు ఇచ్చినట్లు when film came to madras అనే అధ్యాయంలో రాశారు. పై విషయాలన్నీ 1896 సెప్టెంబర్ 2, 1897 ఆగస్టు 31 నాటి మద్రాసు మేయిల్ అనే దినపత్రికలలో రిపోర్టు అయినవి. ఈ స్టీవెన్‌సన్ హైదరాబాదులో ధనవంతుల కుటుంబాల వారికి ప్రైవేటుగా కూడా ఆ రోజుల్లో సినిమా ప్రదర్శనలు వేసి చూపాడు. ఇవి హైదరాబాదులో మూకీల చరిత్రకు బలమైన సాక్ష్యాధారాలు. దీంతో 120 ఏళ్ళ కిందనే తెలంగాణలో సినిమా ఉందనేది రుజువవుతున్నది.

ఏడవ నిజాం (1911) పాలనకు వచ్చిన తరువాత కూడా సినిమా పట్ల తమ ఆదరణను ప్రకటిస్తూ వచ్చారు. 1920లోనే సెలక్ట్ టాకీస్ కట్టించారాయన. ఇదే సంవత్సరం బీడ్ జిల్లా పర్భనీలో సర్దార్‌ఖాన్ "దక్కన్ సినిమా" అనే థియేటర్‌ని నిర్మించారు. కాగా మొన్నటి దాకా తెలుగు నాట నిర్మించిన తొలి థియేటర్‌గా విజయవాడలో "మారుతి"ని చెప్పుకున్నా అది 1921 అక్టోబర్‌లో మొదలైంది. దీంతో థియేటర్ల నిర్మాణంలో కూడా తెలంగాణనే ముందున్నదని తేలిపోయింది. సినిమాల ప్రదర్శన రంగంలో భారతదేశంలో ఎక్కడా జరగని ప్రక్రియ హైదరాబాదులో జరిగింది. అదే మహమూద్‌మియా సినిమా బండి. ఈ ప్రక్రియను పీప్ హోల్ షోలకు కొనసాగింపుగా చెప్పుకోవచ్చు.

1921లో మద్రాసులో తయారైన భీష్మప్రతిజ్ఞ తెలుగువారు తీసిన తొలి మూకీ అంటున్నా అది తమిళదేశంలో తయారైన తెలుగు వారి తొలి మూకీ. అయితే తెలుగు నేల (ఆంధ్ర)లో తొలిసారిగా కాకినాడలో సి.పుల్లయ్య 1925లో భక్త మార్కండేయ మూకీ తీశారు. మూకీల కాలంలో మద్రాసు నుండి ఇక్కడికి వచ్చి మూకీలు తీసినట్లు గానీ, ఇక్కడి వారు అక్కడికి వెళ్లినట్లు గానీ ఎక్కడా రికార్డు కాలేదు. ఇక్కడ ఏర్పడిన నిర్మాణ సంస్థలన్నీ హైదరాబాదుకు చెందినట్లు 'దక్కను' అని రాసుకున్నవి. కనుక మూకీల చరిత్రలో హైదరాబాదులో జరిగిన మూకీల చిత్ర నిర్మాణం గురించిన వివరాలను తెలంగాణ సినీ చరిత్రకు తొలి రోజులుగా చూడాలి. కాని మద్రాసుతో ముడిపెట్టరాదు. ఎందుకంటే మద్రాసు కన్నా మూకీల కాలంలో హైదరాబాదు ముందుంది కనుక. అరవ దేశంలో తెలుగు సినిమాలు తీసి తెలుగు సినిమా చరిత్ర అంటే, హైదరాబాద్‌లో తయారైన సినిమాలది తెలంగాణ సినిమా చరిత్ర కాదా?


**– హెచ్.రమేష్‌బాబు, 94409 25814 ఫ్రీలాన్స్ జర్నలిస్టు**

# సుపరిపాలన

## (Good Governance)

మనదేశంలో మంచిపాలనకు పునాదులు ప్రాచీన కాలంలోనే పడ్డాయి. త్రేతాయుగంలో రామాయణంలోనే మంచిపాలననే ప్రజారంజకంగాను, ప్రజల అవసరాలను తీర్చు పాలకునికి మంచిపేరు ప్రతిష్టలు తెచ్చిపెడుతుంది.

మంచి పాలనకు కొన్ని ప్రధానమైన అంశాలు ఇమిడి ఉన్నాయి.




## కొన్ని సత్యాలు

| | | | | |
|---|---|---|---|---|
| 6 అక్షరాలివి | MANDIR - 6 words<br>MASJID - 6 words<br>CHURCH - 6 words | and | GEETA - 5 words<br>QURAN - 5 words<br>BIBLE - 5 words | 5 అక్షరాలివి |

They are all same 6-5 = 1 God is One



# పంచాయతీ వ్యవస్థ బలోపేతంపై టిసిపార్డ్ కేరళలో అధ్యయనం

గ్రామ స్వరాజ్యం కోసం గాంధీజీ కన్న కలలను నెరవేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. స్థానిక స్వపరిపాలన వల్ల గ్రామం, జిల్లా, రాష్ట్రం దేశం బాగుపడుతుందని చాటిచెప్పిన మహాత్మాగాంధీజీ మాటలను నెరవేర్చి, స్థానిక సంస్థల వ్యవస్థను పటిష్టపరిచి పారదర్శకంగా పాలన కొనసాగించేందుకు రాష్ట్ర పంచాయితీరాజ్‌శాఖ మంత్రి శ్రీ కల్వకుంట్ల తారక రామారావుగారి ఆదేశాల మేరకు టిసిపార్డు పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషన్ శ్రీమతి అనితా రాంచంద్రన్‌గారు చర్యలు చేపట్టారు.

ఇందులో భాగంగా దేశంలోని వివిధ రాష్ట్రాలలో పంచాయతీ వ్యవస్థ పటిష్టంగా అమలవుతున్న కేరళ, కర్నాటక, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు స్థానిక ప్రజాప్రతినిధులను అధ్యయనం చేసేందుకు పంపించాలని నిర్ణయించారు. ఈనెల 8వ తేది నుండి 10వ తేదీ వరకు కరీంనగర్ జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ శ్రీమతి తుల ఉమ మరియు జిల్లాకు చెందిన 47 మంది జడ్‌పిటిసిలు, టిసిపార్డ్ (ఎస్ఐఆర్‌డి) తరఫున శ్రీమతి కుసుమి మాధవి (సిహెచ్-ఎల్ఎస్ఎ) కూడిన టీమ్ మూడు రోజులపాటు కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (కిలా) వారి సహకారంతో క్షేత్రస్థాయిలో పంచాయతీలలో అమలవుతున్న విధానాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి అధ్యయనం చేయడం జరిగింది.

జడ్‌పిటిసిలు రెండు బృందాలుగా విడిపోయి అధ్యయనం చేయడమైనది. ఒక బృందానికి జడ్జీచైర్‌పర్సన్ తుల ఉమ నాయకత్వం వహించగా మరో బృందానికి వైస్‌చైర్మన్ రాజారెడ్డి నాయకత్వం వహించారు. కిలా తరఫున ప్రొ.రాఘవన్ మరియు ప్రొ.రామకిష్టన్ గారు బృందాలతో సమన్వయం పరిచినారు.

వల్లచిర గ్రామపంచాయతీ ప్రెసిడెంట్ (సర్పంచ్) పోఫీఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆ గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు, స్టాండింగ్ కమిటీ సభ్యులతోపాటు పంచాయితీ సిబ్బంది హాజరయ్యారు. ఈ పంచాయితీ పరిధిలో 20,223 మంది జనాభా ఉండగా 4 వార్డులు ఉన్నాయి. ఈ పంచాయితీ కార్యాలయం మన రాష్ట్రంలోని మున్సిపల్ కార్యాలయాలను తలపించాయి. పంచాయితీ కార్యాలయం సిబ్బంది మొత్తం 30 మంది విధులు నిర్వహిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి కార్యాక్రమాలకు 2014-15లో రూ.88.6 కోట్లు వెచ్చించినట్లు గ్రామ ప్రెసిడెంట్ పోఫీ పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా తెలిపారు.

గ్రామీణాభివృద్ధికి సంబంధించి ఏదైనా కార్యక్రమం చేపట్టాలంటే స్టాండింగ్ కమిటి సిఫార్సులు తప్పనిసరి. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రత్యేకంగా గ్రామంలో "కృషి భవన్"లు ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ఉపాధి హామీ పథకం అమలు సైతం పంచాయితీనే చేస్తుంది. మండలం (బ్లాక్) జిల్లా పంచాయితీలకు ఎలాంటి సంబంధం ఉండదు. పన్నుల వసూలు అధికారం పూర్తిగా స్థానిక పంచాయితీలకే ఉంటుంది. ప్రాథమిక, మాధ్యమిక, పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్‌తో సహా ఫార్మాసిస్టులు, నర్సులు, మిగతా సిబ్బంది, అంగన్‌వాడీ కేంద్రం, వ్యవసాయాధికారి, పశుసంవర్ధక శాఖ ఆసుపత్రి, మత్స్యశాఖ అధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్లు గ్రామ పంచాయతీ పర్యవేక్షణలోనే పనిచేయాలి.



పంచాయితీలు ఇచ్చిన "వర్క్‌టన్" రిపోర్టు ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం ఆయా శాఖల ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తుంది. ఉద్యోగులను సస్పెండ్ చేసే అధికారం స్థానిక పంచాయితీలకు ఉన్నది. కాని తొలిగించే అధికారం మాత్రం లేదు.

మడకత్ర అనే పంచాయితీని మరో బృందం సందర్శించింది. 25,274 జనాభా ఉన్నది. 12 వార్డులు ఏర్పాటు చేశారు. 2015-15 ఆర్థిక సంవత్సరానికి రూ.43 కోట్లు వ్యయం చేశారు. ప్రతియేటా ఈ గ్రామానికి రూ.4 కోట్లు ఆదాయం వస్తుందని స్థానిక ప్రెసిడెంట్ చెప్పారు.

బ్లాక్ పంచాయితీల పనితీరుపై జడ్పీటిసిల బృందం ముల్లసేరీ మరియు తల్లికుల్లమ్ అనే బ్లాక్ పంచాయితీలను సందర్శించారు. స్టాండింగ్ కమిటీల సభ్యులు, ప్రెసిడెంట్, బిడిఓతో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చ కొనసాగించారు. కరీంనగర్ జడ్జీటిసీ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని కేరళ బ్లాక్ పంచాయితీల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు.

జిల్లా పంచాయితీల వ్యవస్థ అధ్యయనం కోసం పాలక్కడ్ మరియు త్రిసూర్ జిల్లా పంచాయితీలను రెండు బృందాలైన జడ్జీటిసీ సభ్యులు సందర్శించారు.

పాలక్కడ్ జిల్లా పంచాయితీ అధ్యక్షురాలు అడ్వకేట్ శాంతికుమారి దళితురాలు. అయినా జనరల్ సీటు నుండి గెలుపొందారు. అభివృద్ధి గూర్చిన వివరాలను చర్చించారు. జిల్లా జనాభా 29 లక్షలు. 30 జిల్లా పంచాయితీలున్నాయి. జిల్లాలో పూర్తిస్థాయి విద్యుదీకరణ జిల్లాగా పేరుగాంచింది. ఇలా చేయడం దేశంలోనే ప్రప్రథమని శాంతకుమారి చెప్పారు. ఒకనాడు మేము అత్యంత కరువు కాటకాలను అనుభవించాం. ఇప్పుడు పాలక్కడ్ "రైస్ బౌల్ ఆఫ్ కేరళ"గా మార్చామని అన్నారు. మరో విశేషం ఏమిటంటే ఈ పంచాయితీ ఏకంగా ఒక మినీ జలవిద్యుత్ కేంద్రాన్ని కొండ ప్రాంతంలో ఏర్పాటు చేసి నిర్వహిస్తోంది. దీని ద్వారా మూడు మెగావాట్లు జలవిద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. ఈ పంచాయితీ రెండు జాతీయ అవార్డులను సాధించింది. 5 స్టాండింగ్ కమిటీల ద్వారా కార్యకలాపాలను నిర్వహిస్తోంది. 40% నిధులను వ్యవసాయ సంబంధిత అవసరాలకై ఖర్చు చేస్తుంది.

వేరొక బృందం, త్రిసూర్ జిల్లా పంచాయితీను సందర్శించారు. జిల్లా పంచాయితీ అధ్యక్షురాలు శీలా విజయ్‌కుమార్ మరియు స్టాండింగ్ కమిటీ సభ్యులు ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల అధిపతులతో కూడిన





సమావేశాన్ని నిర్వహించారు. పనులు చేపట్టే విధానం, అధికార వికేంద్రీకరణ, ఎన్నికల నియమావళి జిల్లా పంచాయితీ అధికారాలు విధులు బాధ్యతలు, పథకాలను అమలు చేసే విధానం, స్టాండింగ్ కమిటీల బాధ్యతలు, డి.పి.సి. మరియు డిడిసిల పనితీరు మరియు సమీక్ష తదితర అంశాలపై జడ్జీటిసీ సభ్యులు జిల్లా పంచాయితీ స్టాండింగ్ కమిటి సభ్యుల నుండి సమాచారం సేకరించారు. జిల్లా ప్రణాళిక కమిటీ (డి.పి.సి.) చాలా పటిష్టంగా ఏర్పాటు కేరళలో చేయడమైనదని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఎందుచేతనంటే ప్రతిపనిని కూడా డి.పి.సి. ద్వారా ఆమోదం తీసుకున్న పిదపనే ప్రారంభిస్తారు అని తెలుసుకొనడం జరిగింది. ఆ తరువాత బృందం సభ్యులు దళిత వాడలను సందర్శించి అక్కడి స్థితిగతులను తెలుసుకున్నారు.

శిక్షణా కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు 2 బృందాలు తల్లికుల్లమ్ మరియు ముల్లుసెలి బ్లాక్ (మండల) పంచాయితీలను సందర్శించడమైనవి. ముల్లసెరి బ్లాక్ పంచాయితీ ప్రెసిడెంట్ లేల వేణుగోపాల్ మరియు 13 బ్లాక్ సభ్యులతో సమావేశం కావడమైనది. వారు వివిధ అంశాలు అనగా పేదలకు ఇల్లు, త్రాగునీటి వనరులు, సదుపాయాలు, మహిళా అభ్యుదయం, ఆరోగ్యం మరియు పారిశుధ్యం, ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.యస్. మొదలగు వాటిపై ఏ రకముగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ, నిధులు సమకూర్చుకుంటూ అమలు పరుస్తున్నారో వివరించారు. ముఖ్యంగా రెండు రకాల నిధులు గూర్చి చర్చించారు. అవి

1. ప్లాన్డ్ ఫండ్ 2. మెయింటెనెన్స్ ఫండ్

మార్చి 31 తేదీలోపు అన్ని కార్యక్రమాలు, ప్రాజెక్టులు దిగ్విజయంగా పూర్తి చేస్తామని చెప్పడం జరిగింది. తరువాత 36 పడకల కమ్యూనిటి హెల్త్ సెంటర్‌ని, కరీంనగర్ జడ్జీటిసీల బృందం సందర్శించింది. బిడిఓ బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో హెల్త్‌సెంటర్‌కి నూతనంగా పెయింటింగ్ వర్క్ మరియు టాయిలెట్లు రిపేర్లు చేయడమైనది. ప్రతినెలా ఇప్లిమెంటింగ్ ఆఫీసర్ల మీటింగ్ ఉంటుందని అందులో భాగంగా కీలకమైన నిర్ణయాలు తీసుకుంటారని వారు వివరించారు.

టిసిపార్డు వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ క్షేత్రస్థాయి శిక్షణా కార్యక్రమం కరీంనగర్ జడ్పీటిసీ సభ్యులకు ఎంతో ఉపయోకరంగా ఉన్నదనడానికి ఏ సందేహం లేదు. కిలా వారి సహకారం కేరళ పంచాయితీ రాజ్ వ్యవస్థపై జడ్పీటిసీలు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ఛైర్‌పర్సన్ తుల ఉమ గారు కరీంనగర్ జిల్లాను మరో కేరళగా తీర్చిదిద్దడానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఇలాంటి చక్కని శిక్షణా కార్యక్రమం వలన తామెంతో మేలు పొందామని, టిసిపార్డు కమీషనర్‌గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

**కుసుమ మాధురి, సెంటర్‌హెడ్, సిడబ్ల్యుసిడి, టిసిపార్డ్**



# ఆవాలు-సాగు పద్ధతులు

**మ**నదేశంలో ఆవాలు ఒక ముఖ్యమైన నూనెగింజల పంటగా సాగుచేయబడుతున్నది. ప్రధానంగా ఉత్తర భారతదేశంలో సాగు చేస్తున్నప్పటికీ మన రాష్ట్రంలో కూడా ఈ పంట సాగుకు అనుకూలంగానే ఉంటుంది. కర్నూలు జిల్లాలో వరి మాగాణులలోనూ మరియు కరీంనగర్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో ఈ పంటను కొంత వరకు సాగు చేస్తున్నప్పటికీ మేలైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వలన అతి తక్కువ దిగుబడులు మాత్రమే సాధించగలుగుతున్నాం. మన రాష్ట్రంలో కర్నూలు, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాలోని పర్వత ప్రాంతాలూ ఈ పంట సాగుకు అనుకూలం. ఈ ప్రాంతాలలో ఈ పంటను సాంప్రదాయేతర పంటగా మేలైన పద్ధతుల ద్వారా సాగుచేసి అధిక దిగుబడులను పొందడానికి అవకాశం ఉంది. 90 నుండి 110 రోజుల వ్యవధిలో తక్కువ పెట్టుబడి మరియు అతి నీటి వసతితో అధిక నికర లాభం పొందటానికి ఆవాల పంటను సాగు చేసుకోవాలి.

**నేలలు:** ఎక్కువ తేమను నిల్వ చేసుకోగల నల్ల నేలలు బాగా అనుకూలమైనవి. నీటి పారుదల క్రింద ఎర్రనేలల్లో కూడా సాగుచేయవచ్చు.

**నేలతయారి:** 3 లేక 4 పర్యాయాలు గొర్రుతో దున్ని గుంటక తొలి మెత్తటి దుక్కిని తయారు చేసుకోవాలి.

**విత్తుకాలము:** ఆవ పంటను విత్తుటకు అక్టోబర్, నవంబర్ మాసాలు అనుకూలమైనవి.

**విత్తనం:** ఎకరాకు 1.25 కిలోల నుండి 1.5 కిలోల విత్తనాన్ని కొంచెం ఇసుకలో కలిపి వరుసల మధ్య 45 సెం.మీ. మరియు వరుసలలో మొక్కల మధ్యన 15 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. పైరు మొలకెత్తిన తర్వాత వారం రోజులకు పలుచన చేసి సరియైన మొక్కల సాంద్రత ఉండేటట్లు శ్రద్ధ వహించాలి.

**ఎరువులు:** ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువుతో పాటు 25 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేటు మరియు 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను ముందుగా వేసుకొని పైరు 30 నుండి 35 రోజుల సమయంలో అదనంగా 25 కిలోల యూరియా పై పాటుగా వేసుకోవలి.

**సాగునీటి యాజమాన్యం:** నీటి పారుదల క్రింద సాగు చేసేటప్పుడు 3 నుండి 4 తేలిక తడులు అవసరం. నల్లనేలలు ఎక్కువ తేమను నిల్వ చేసుకుంటాయి. కాబట్టి 3 తడులు సరిపోతాయి. ఎర్రనేలల్లో 4 తడులు అవసరం.

**సస్యరక్షణ - పురుగులు: పేనుబంక :** ఎసిఫేటు ఒక గ్రాము లేక డైమిథోయేట్ 1.5 మి.లీ. లేక మెటాసిస్టాక్స్ 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి ఒకటి లేదా రెండు సార్లు 10 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

**ఆకు ఎండు తెగులు:** కిలో విత్తనానికి 2 గ్రాముల కాప్టాన్ లేదా థైరమ్ లేదా 3 గ్రాముల మాంకోజెట్‌తో విత్తనశుద్ధి చేసి విత్తాలి లేక 3 గ్రాముల బ్లైటాక్స్ లీటరు నీటిలో కలిపి తెగులు ఆశించిన వెంటనే 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**బూడిద తెగులు:** లీటరు నీటికి 1 గ్రాము బావిస్టిక్ లేదా 1 మి.లీ కాలిక్సిల్ మందును తెగులు ఆశించిన వెంటనే 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**పంట కోత:** గింజలలో 40 శాతం తేమ ఉన్నప్పుడు 75 శాతం కాయలు పసుపు రంగుకు మారినప్పుడు పంట కోయాలి.

**ఆదాయవ్యయాలు:** మేలైన రకాలను ఎంపిక చేసుకొని సరైన యాజమాన్య పద్ధతులను పాటించి సకాలంలో సస్యరక్షణ చేపడితే ఆవాల సాగులో 4 నెలల్లో రూ.10,000-15,000/-ల వరకు నికర లాభం పొందవచ్చు.

**- కె.ఎ.విజయగోపాల్, డా॥యస్.త్రివేణి, వై.నాగరాజు, బి.ప్రసన్నకుమార్, జి.తిరుమల్, యస్.వినోద్‌బాబు, సి.నాగహరీష్,మైక్రో బయాలజి విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్**



# పారిశ్రామికీకరణతోనే ఆర్థికాభివృద్ధి

ఆర్థికాభివృద్ధి పారిశ్రామికీరణ వలన పారిశ్రామికీకరణ మూలధనం వలన జరుగుతుంది. ఒక దేశం అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక విదేశీ పరిశ్రమల పోటీ నుండి రక్షించడానికి దిగుమతి సుంకాలను పెంచి, వాటి ధరలను దేశీయ వస్తువుల ధరలకన్నా ఎక్కువగా ఉండేటట్లు చూస్తారు. అంతర్జాతీయ వ్యాపారం వలన ఆయా దేశాల్లో వస్తుసేవల ప్రత్యేకీకరణ జరిగి అందరి సంపదను పెంచుతుంది. ఇది స్వేచ్ఛా వ్యాపార సిద్ధాంతాలపై ఆధారపడి ఉంది. మూలధన లభ్యత ఆర్థిక వ్యవస్థ పురోగతికి కీలకం. ఆకలి, పేదరికం ప్రస్ఫుటంగా ఉన్నది. ప్రభుత్వం వెచ్చించిన నిధులు, సంస్కరణలు ఫలాలు అవరోహణ సిద్ధాంతం ఏ కొందరికో మేలు చేస్తున్నది. వార్షిక వృద్ధిరేటు, విదేశీమారక నిల్వలు, దిగుమతుల కంటే ఎగుమతులు అధికంగా ఉండటం పర్యావరణాన్ని ధ్వంసం చేసే విధంగా సహజవనరులను దోచుకోవడం అభివృద్ధికి సంస్కరణల పేరిట ప్రాతిపదికగా మారుతున్నది. పెట్టుబడిదారుల్లో మన వ్యవస్థ పట్ల నమ్మకం కలగాలంటే పారదర్శకత జవాబుదారీతనాలకు పెద్దపీట వేస్తూ పాలన సాగాలి. ప్రజలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వయం శక్తిమంతులుగా తీర్చిదిద్దునప్పుడే పేదరికం, ఆకలిపోగలవు. అభివృద్ధి ప్రక్రియలో పేదలు భాగస్వాములు గావించాలి. ప్రభుత్వాలు పరిపాలన నిర్వహిస్తూ ప్రజలకు అవసరమైన శాసనాలు చేయడానికి పరిమితం కావాలని వ్యాపార నిర్వహణ నుంచి పూర్తిగా బయటకు వచ్చి ప్రైవేటు వ్యాపార కార్యకలాపాలకు ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించింది. ఆర్థిక సంస్కరణల వల్ల కొందరు వ్యక్తుల చేతుల్లో సంపద కేంద్రీకృతమైంది. మరింత వేగవంతమైన అభివృద్ధిని సాధించాలంటే ధనికులకు రాయితీలు పన్ను మినహాయింపులు కల్పిస్తూ వారిని మరింత ధనవంతులుగా మార్చే పథకాలు అమలవుతున్నాయి.

ఆర్థికసంస్కరణల పేరిట ఫలితాలు కుంభకోణాలు, విచ్చలవిడి అవినీతినైతిక ప్రమాణాలు దిగజారడం, అధికారమే పరమావధికావడం సంస్కరణల వల్ల సంభవిస్తున్నాయి. లోటు కన్పిస్తున్నది. ప్రభుత్వంలోని వివిధ స్థాయిల్లో వేటవేసిన అవినీతి నిర్లక్ష్యం, నిర్లప్తతల కారణంగా స్వదేశీ విదేశీ పెట్టుబడిదారుల్లోనూ భయం, దేశీయ పెట్టుబడిదారులే వేలకోట్ల రూపాయలు పెట్టుబడులను విదేశాల్లో పెడుతున్నారు. పేదరిక నిర్మూలన పేరిట ప్రజాకర్షక పథకాలను ఇష్టానుసారంగా ఖర్చుపెడుతున్న నిధులు అధికభాగం దళారుల జేబుల్లోకి పోతున్నది. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు అత్యధిక ప్రాధాన్యమిస్తే ఉపాధి అవకాశాలు పెరగగలవు. నగదు లభ్యత, సమస్య, దేశీయ వినియోగం భారీగా పతనం కావడం, ఉపాధి ఉద్యోగావకాశాల్లో కోత, ఎగుమతి క్షీణిత, స్టాక్‌మార్కెట్‌లు కుదేలించడం, ద్రవ్యోల్బణం ధరల పెరుగుదల, ద్రవ్యలోటు ఆర్థిక వ్యవస్థలను తిరోగమనంలోకి తీసుకోగలవు. విద్యుత్ రహదార్లు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, నీటి పారుదల, పట్టణ మౌలికసదుపాయాలు మెరుగుపడాలంటే కోట్ల రూపాయలు వెచ్చించాలి. ఉద్యోగాల కల్పనకు ప్రైవేటు వ్యయం పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. స్థిరమైన సమతుల ఆర్థికాభివృద్ధి సాధించాలి. కుంభకోణాలు, విచ్చలవిడి అవినీతి, నైతిక ప్రమాణాలు దిగజారడం, అధికారమే పరమావధి కావడం సంస్కరణలమయమైంది. ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదల కంటే మనుగడ కోసం పరుగులు తీయాల్సిన పరిస్థితి తయారైంది. సంప్రదాయ సంపాదన మార్గాలు, వృత్తులు క్షీణించి వలసలు అధికమైపోతున్నది. సదుపాయాల కొరత ఏర్పడుతుంది. నగరాలు మురికివాడలుగా తయారవుతున్నాయి. సాంఘిక, వైద్యరంగాల్లో వయోజన విద్యలో చిన్నపిల్లల ఆరోగ్యం విషయంలో చైనా దేశం సాధిస్తున్న విజయాలు సహేతుకంగా ఉన్నాయి. ఉన్నత వర్గాలను మరింత సంపన్నంగా తీర్చిదిద్దేందుకు సంపదను కొందరి చేతుల్లోనే కేంద్రీకరించేందుకు సంస్కరణలు ఉపయోగపడుతున్నాయి. ఎప్పుడు సంస్కరణలను సంస్కరించే ప్రక్రియలపై సమీక్షించే పరిస్థితులు లేవు.

పరపతి రంగాన్ని పునరుద్ధరించి, దాన్ని సరిగా నియంత్రించి పరిశ్రమలకు తగినంత నిధులు లభ్యమయ్యేటట్లు చూడాలి. వృధా

వ్యయాన్ని అరికట్టి నిర్దిష్టమైన నియంత్రణ చర్యలలో విత్తలోటుకు అడ్డుకట్ట వేసేదిశగా ప్రభుత్వం అడుగులు కదపాలి. అనవసరమైన సబ్సిడీలకు అంతం పలకాలి. ఆర్థికవ్యవస్థ రెట్టింపు కావాలంటే అందుకు అనువైన పెట్టుబడులు సమీకరించడం మానవ వనరుల వృద్ధి సరళమైన ఆర్థిక విధానాలు, రాజకీయస్థిరత్వం, ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంపొందించడం, వస్తుసేవలకు ప్రైవేటు డిమాండ్ గణనీయంగా పెరగడం ఎంతో అవసరం. అభివృద్ధికి ఆర్థిక గణాంకాలను కాకుండా మానవవనరుల అభివృద్ధి సూచికను పరిగణనలోకి తీసుకుంటే అభివృద్ధిపథంలో ముందుకుసాగే బదులు అధోగతిపాలవుతుంది. మనదేశంలో కోట్లాదిమంది నిరుపేదలకు పౌష్టికాహారం అందించలేని ప్రభుత్వాలు రెండంకెల వృద్ధి సాధన గురించి కబుర్లు చెప్పుకోవడం జరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంస్కరణలు విధానంలో ఆశించిన ఫలితాలు ప్రయోజనం చేకూరడం లేదు. ఎప్పటి నుంచో అనుసరిస్తున్న విధానాలు ప్రస్తుత పరిస్థితులకు తగినవిధంగా లేవు. ప్రస్తుత విధానాలే కొనసాగిస్తే పోటీ ప్రపంచంలో మనం వెనుకబడిపోగలం. ప్రభుత్వ వ్యయం పెరిగి అప్పులు పెరుగుతున్నాయి. నిరుద్యోగం, పేదరికం తగ్గుదల కాలేదు.

## నిరుద్యోగ సమస్య

సమాజంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యల్లో నిరుద్యోగ సమస్య అత్యంత ప్రధానమైంది. ప్రపంచంలో ఎక్కడా లేనంతమంది నిరక్షరాస్యులు, నిరుపేదలు, నిరుద్యోగులు మనదేశంలోనే పోగుపడి ఉన్నారు. సామాజిక శ్రేయస్సు, వృద్ధిని కాంక్షించే ప్రభుత్వం మానవ వనరుల సంపూర్ణ వినియోగం, సద్వినియోగంతో పాటు ఇతర వనరుల వినియోగం వల్ల సాధ్యపడుతుంది. ఒక దేశంలోని ఉద్యోగితస్థాయి ఆర్థికాభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది. ఆర్థికాభివృద్ధి వల్ల అన్నిరంగాల్లోనూ ఉద్యోవకాశాలను పెంపు చేయటానికి దోహదపడుతుంది. మనదేశంలో ఉన్న నిరుద్యోగితకు మూలం ధనవనరుల కొరత, పరస్పర పూరకాల కొరత. నిరుద్యోగిత కారణం మానవ వనరులను సక్రమంగా వినియోగించుకునే విధానలోపం, విద్యావంతుల్లో నిరుద్యోగిత ముఖ్యకారణం. దేశంలో ఆర్థికాభివృద్ధి, క్షీణగతిన పెరగటం, సాంకేతికపరమైన శిక్షణాలోపం, మార్కెట్‌లోని అవసరాలకు విద్యా విధానానికి మధ్య అనుసంధానత లేకపోవడం, వృత్తివిద్యలో శిక్షణ లేకపోవటం, ఆచరణకు ఉపయోగపడిన లోపభూయిష్టమైన విద్యావిధానం ముఖ్య కారణాలవుతున్నాయి. అన్ని విధాల విద్యాస్థాయిలోను నిరుద్యోగ సమస్య పరిమాణం పెరుగుతోంది. సమాజంలో పౌరులందరి సృజనాత్మకత శక్తులు సద్వినియోగపడనప్పుడు సమాజాభివృద్ధి ఉత్పత్తి పెరుగుదల కుంటుపడుతుంది. చదువుకున్న యువతీ యువకులందరూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ ఉండటం వల్ల ప్రభుత్వ శాఖల్లోని వివిధ నియామకాలు రాను రాను తగ్గిపోతున్నందున, చదువులు పూర్తి చేసి ఉద్యోగాలకు ఎగబడే జాబితాలో ప్రతి సంవత్సరం చేరే వారి సంఖ్య గణనీయంగా ఉండటంతో యువతలో నిరుద్యోగుల శాతం క్రమేణా అధికమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఆర్థిక విధానాల పరమైన మార్పుల వల్ల నిరుద్యోగిత ఎక్కువవుతోంది.

ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ వల్ల వాణిజ్యం పెరుగుతుందని, మార్కెట్లు, నూతన సాంకేతిక విప్లవం వల్ల పరిశ్రమలు నెలకొల్పబడతాయని, దీని ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతుందని ప్రపంచీకరణను ఆహ్వానించడం జరిగింది. గ్రామాల్లో దీర్ఘకాలిక సామాజిక వనరుల ఏర్పాటుకు, తద్వారా ఉపాధి పెంపుదలకు ప్రయత్నించుచుతుంది. పారిశ్రామిక కేంద్రీకరణ వల్ల ఉత్పన్నమయ్యే ఉద్యోగావకాశాలు లేక గ్రామాల నుండి ప్రజల వలస ఖాయిలా పడ్డ సంస్థలు, అధిక సిబ్బంది తొలగింపు శ్రామిక మార్కెట్ల సరళీకరణ తగ్గింది. కులవృత్తులు కూలబడిపోగా అన్ని వృత్తుల వారు వ్యవసాయ కూలీలుగా, ఉపాంత రైతులుగా మారటంలో అవసరాన్ని మించి భూమిపై శ్రామిక ఒత్తిడి అదనపు శ్రామికుల భౌతిక ఉత్పాదకత కనుమరుగవుతున్నది. సేద్యపు భూమి వర్షాధారం కావటం చేత 3, 4 నెలలు వ్యవసాయదారులు నిరుద్యోగులుగా ఉంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతం నుండి వ్యవసాయ కార్మికులు పట్టణాలకు వలసపోతున్నారు. పట్టణాల్లో దీని వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీన్ని అరికట్టేందుకు సామాజిక సమతుల్యతను సాధించేందుకు ప్రభుత్వం కొంత మార్గం సుగమం చేసింది.

వృత్తి విద్యావిధానం అమలు చేయాలి. పారిశ్రామికంగా దేశాన్ని తీర్చిదిద్దాలి. ఉద్యోగావకాశాలు గల విద్యావిధానమే అమల్లో ఉండాలి. యువతీ యువకుల్లో స్వావలంబనం అవసరం. నేటి విద్యావిధానంలో మౌలిక మార్పులు అవసరం. పాఠశాల వదిలిన ప్రతి విద్యార్థి తన కాళ్లపై తాను నిలబడే విధంగా విద్యావిధానంలో మార్పురావాలి. ఉద్యోగాల కల్పనకై ప్రభుత్వం కృషి చేయడం కన్నా కొత్త పరిశ్రమలు స్థాపించడానికి పూనుకోవాలి. వ్యవసాయోత్పత్తులను పరిశ్రమలకు మళ్లించి పారిశ్రామికాభివృద్ధి సాధించాలి. ప్రతి వ్యక్తి నిర్బంధంగా ఏదో వృత్తిలో చేరాలి. ప్రభుత్వ వ్యయం తగ్గాలంటే సామాజికరంగాల్లో ప్రభుత్వ పాత్ర తగ్గి ప్రజలు ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం అవసరమని ప్రభుత్వాలు గుర్తించాలి. మౌలిక సదుపాయాలు మెరుగుపడకపోవడం, ప్రజలకు తగిన విధంగా సేవలు అందకపోవడం రుణం చెల్లింపులు మోయలేనిభారంగా తయారవడం ఆర్థిక సంక్షోభానికి దారితీసింది. ప్రభుత్వ వ్యయం తగ్గించుకోవడం, రుణాలపై చెల్లింపులను క్రమేణా తగ్గించుకోవాలి. ప్రభుత్వ వ్యయం పెట్టుబడుల వైపు మౌలిక సదుపాయాల దిశగా మళ్లించాలి. ప్రభుత్వ వ్యయం పెట్టుబడుల వైపు మౌలిక సదుపాయాల దిశగా మళ్లించాలి. సంక్షేమ పథకాలపై సబ్సిడీలు తగ్గించాలి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సంస్కరణల అమలులో ముఖ్యమైనది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, ఆర్థిక రాయితీలతో పాటు రాజకీయంగానూ చర్యలు చేపట్టారు. ధనికులు పేదల మధ్య అంతరాలు దేశంలో సామాజిక అసమానతలకు దారి తీస్తున్నది. పేదలకు పథకాలు, ప్రతిఫలాలు సక్రమంగా అందకుండా పోతున్నది. కొందరు దళారులు, స్వార్థ చింతకులు పథకాలు దారి మళ్లించి ప్రయోజనం పొందుతున్నారు. పేదరికానికి మూలం అసమానతలే. ఒక రకమైన అసమానత మరో అసమానతకు దారితీస్తుంది. అణగారిన వర్గాలు, వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక అవసరాలను గుర్తించి అందుకనుగుణంగా ప్రత్యేక పథకాలు, నిధులు కేటాయించాలి. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కనీస వ్యూహాలను, పథకాలు, కార్యక్రమాలు అమలుచేయాలి. వెనుకబడిన ప్రాంతాలలో గణనీయమైన అవకాశాలున్నా అభివృద్ధి చాలా మందకొడిగా ఉంటున్నది వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక వసతులు పెంపొందించాలి. పథకాలు అమలుకు ఫలితాలనిచ్చేలా నిధులు కేటాయించాలి.

**– ఎం.రాఘవయ్య, సీనియర్‌జర్నలిస్టు**

# బంగారు తెలంగాణ కోసం
# ప్రభుత్వ సంక్షేమ పథకాలు - ప్రజల భాగస్వామ్యం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పునర్నిర్మాణంలోను, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే కర్తవ్యంలోను ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, రాష్ట్ర పునర్నిర్మాణం కోసం చేపట్టిన అనేక వినూత్న కార్యక్రమాలలో ప్రజలు క్రియాశీలంగా భాగస్వాములు అవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎలా ఉమ్మడిగా ఉద్యమించారో, రాష్ట్ర అభివృద్ధి కోసం, బంగారు తెలంగాణ కోసం ఐక్యంగా ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాల అమలులో ప్రజలు భాగస్వాములై ముందుకు సాగుతున్నారు.

తెలంగాణ ప్రజల సాంస్కృతిక సంపద, సంప్రదాయాలను, వారసత్వాన్ని కాపాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. ఈ పథకాల వల్ల తెలంగాణ ప్రజల ఔన్నత్యానికి, తెలంగాణ సమాజం ఎదుగుదలకు, తెలంగాణ పురోభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుంది.

ప్రజాస్వామ్య పాలనలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం. ప్రజల భాగస్వామ్యంతోనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యం. దీనికి ఉదాహరణగా మన రాష్ట్రంలో గల వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని గంగిదేవిపల్లి, నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ గ్రామాలలో జరిగిన అభివృద్ధి, పరిపాలనలో ప్రజల భాగస్వామ్యానికి ప్రత్యక్ష నిదర్శనం. ప్రభుత్వంమాది, అని ప్రజలు అనుకున్నపుడు పరిపాలన భాగస్వామ్య పద్ధతిలో జరుగుతుంది. అంటే ప్రజా పరిపాలనకు అవసరమైన ప్రణాళిక తయారీలో గాని దానిని ఆమోదించి మరియు పథకాలు అమలు చేయడంలో గాని ఆ తరువాత దానిని మూల్యాంకనం చేయడంలోగాని ప్రజల భాగస్వామ్యం విరివిగా ఉంటే సత్ఫలితాలు వస్తాయని మనకు తెలుసు.

గ్రామ పంచాయతీలకు సాధికారతను కల్పించే దిశగా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం 'గ్రామజ్యోతి' కార్యక్రమాన్ని ప్రకటించింది. స్వయం సహాయక సంఘాలు, శ్రమశక్తి సంఘాలు, యువజన సంఘాల, సామాజిక సంఘాల, స్వచ్ఛంద సేవా సంస్థల, విశ్రాంత ఉద్యోగులు, ప్రజాసంఘాలు, వివిధ రంగాలలో అపార అనుభవం గల వ్యక్తుల రూపంలో చాలా విలువైన మానవవనరులు ప్రతి గ్రామపంచాయతీలో మనకు లభ్యమవుతాయి. స్థానిక ప్రభుత్వాలైన గ్రామపంచాయతీలు అభివృద్ధి బాటలో పయనించాలంటే అలాంటి మానవవనరుల సేవలను ఆహ్వానించడం తప్పనిసరి. గ్రామ పంచాయితీలలో గ్రామ సభల ద్వారా అన్ని రంగాల వారిని భాగస్వాములను చేయాలి. ప్రభుత్వ పథకాలకు, అర్హులైన వారిని గ్రామసభలో అందరి సమక్షంలో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలి.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### ఆసరా:

తెలంగాణ సమాజంలోని నిరుపేదలకు సంక్షేమము మరియు సామాజిక భద్రత కల్పించాలనే ఆశయంతో తెలంగాణ ప్రభుత్వం 'ఆసరా' పథకాన్ని 1.10.2014 ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా నిస్సహాయక స్థితిలో ఉన్న నిరుపేదలైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, చేనేత, గీత కార్మికులు, బీడీ కార్మికులు మరియు హెచ్.ఐ.వి/ఎయిడ్స్‌తో జీవిస్తున్న వారు సగౌరవంగా మరియు సురక్షితంగా సమాజంలో జీవించే భరోసా కల్పిస్తుంది. వృద్ధులు, వితంతువులు, కల్లు గీత పనివారు, నేత పనివారు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ రోగులకు రూ. 1000/- మరియు వికలాంగులకు రూ. 1500/- ఆర్థిక సహాయంగా జీవన భృతి కల్పిస్తుంది.



### కళ్యాణలక్ష్మి:

కళ్యాణలక్ష్మి పథకం ద్వారా నిరుపేదలైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు మరియు వెనుకబడిన వర్గాలకు చెందిన నిరుపేదలైన 18 సం॥ నిండిన అవివాహిత యువతులకు పెళ్లి అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా పెళ్ళి ఖర్చుల నిమిత్తం రూ. 51 వేలను ప్రభుత్వం నేరుగా యువతుల కుటుంబాలకు అందిస్తుంది. ఈ పథకం అక్టోబర్ 2, 2014 తేదీ నుండి అమలులోకి వచ్చింది.



### షాదీ ముబారక్:

మైనారిటీ స్త్రీల వివాహ సమయంలో వారి కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం వారికి వివాహ సమయంలో ప్రభుత్వ సహకారం అందించి వారి తల్లిదండ్రులకు ఆర్థిక బాధలు తగ్గించుటకు షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా మైనారిటీ కమ్యూనిటీకి చెందిన 18 సం॥ నిండిన అవివాహిత బాలికలకు వివాహ సమయంలో రూ.



51,000/- ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అదజేస్తుంది. ఈ కార్యక్రమం అక్టోబర్ 2, 2014 నుండి అమలులోకి వచ్చింది.

**రైతులకు ఋణమాఫీ:**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పంట ఋణమాఫీపై దృష్టి సారించి పంట ఋణాలను మాఫీ చేసింది. ఈ ఋణమాఫీ పథకం ద్వారా దాదాపు 36 లక్షల మంది పేద, చిన్న, సన్నకారు రైతులు లబ్దిపొందారు.




**మిషన్ భగీరథ (వాటర్‌గ్రిడ్):**

రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాలు మరియు పరిశ్రమలకు అవసరమైన నీటి అవసరాలను తీర్చుకొనుటకు వివిధ వనరుల ద్వారా లభ్యమయ్యే నీటిని సక్రమంగా వినియోగించుకునుటకు గాను రూ.25 వేల కోట్ల రూపాయలతో రాష్ట్ర ప్రభుత్వం వాటర్‌గ్రిడ్ నిర్మాణానికి కార్యాచరణ రూపొందించింది. ఈ పథకం ద్వారా ప్రతి ఇంటింటికి పైపుల ద్వారా మంచినీరు అందిస్తారు. ముఖ్యంగా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా చేయుటకు నిర్ణయించారు.



ఈ పథకం ప్రారంభం నుండి 30 సం॥ల వరకు ప్రజలకు అవసరమయ్యే నీటిని సరఫరా చేయడమే ఈ గ్రిడ్ యొక్క ముఖ్య లక్షణం. ఈ పథకం క్రింద గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరికీ రోజుకి 100 లీటర్లు మరియు పట్టణ ప్రాంతాల్లో 130 లీటర్ల మంచినీటిని అందిచే లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేయడం జరిగింది. ప్రతి సాగునీటి ప్రాజెక్టుల్లో 10 శాతం నీటిని వాటర్‌గ్రిడ్‌కి కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నారు.

**హరితహారం:**

తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికి అటవీ ప్రాంతాన్ని 33% పెంచడానికి ప్రభుత్వం "హరితహారం" అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమం క్రింద రాబోయే మూడేళ్ళలో రాష్ట్రంలో 230 కోట్ల మొక్కలకు నాటేందుకు కార్యాచరణ ప్రారంభమైంది. ఈ 230 కోట్ల మొక్కలలో 100 కోట్లు అటవీ ప్రాంతాలలో మిగిలిన 130 కోట్ల మొక్కలు అరణ్యేతర ప్రాంతాలలో నాటుతారు. ఈ పథకం ద్వారా విరివిగా చెట్లను పెంచి, తద్వారా పచ్చదనాన్ని పెంచి వాతావరణ సమతుల్యం సాధించడం ప్రభుత్వ ధ్యేయం. హరితహారం ద్వారా క్షీణించిన అడవులకు పునరుజ్జీవనం, ఉన్న అడవులను కాపాడుకోవడం, భారీ స్థాయిలో చెట్లు నాటడం తద్వారా భూమిలో తేమను నిలబెట్టడం వంటి ఉపయోగాలు పొందవచ్చు.



**మిషన్ కాకతీయ:**

మన ఊరు - మన చెరువు అనే నినాదంతో మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వారా తెలంగాణ లోని చెరువులను పునరుద్దరించి గ్రామాల్లో సాగునీరు, త్రాగునీరు కొరత తీర్చేందుకు మరియు వాటికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు మిషన్ కాకతీయ పథకాన్ని మార్చి 12, 2015న ప్రారంభించారు. సమగ్ర సర్వే ద్వారా రాష్ట్రంలో సుమారు 46,531 చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలను గుర్తించి ప్రతిఏటా 20% చొప్పున 46,531 చెరువులను రానున్న ఐదేళ్ళలో రూ. 20,000 కోట్ల అంచనా వ్యయంతో పునరుద్దరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం ద్వారా గ్రామాల్లో పాడుబడిన మరియు పూడికతో నిండిన చెరువులను పునరుద్దరించి వాటిని వాడుకలోనికి తెచ్చి వాటి ద్వారా గ్రామాలను సస్యశ్యామలం చేస్తూ గ్రామాల్లో నివసిస్తున్న వివిధ చేతి వృత్తుల వారికి పూర్వ వైభవం తీసుకురావాలనే దృఢనిశ్చయంతో ప్రభుత్వం పనిచేస్తుంది. దీని ద్వారా వ్యవసాయాభివృద్ధి, భూసార, జల సంరక్షణ, వరదల నియంత్రణ, కరువు నివారణ, పశుగణం, గృహ వినియోగాలు, భూగర్భ జలాలు పెంచడం, శీతోష్ణస్థితి, పర్యావరణ పరిరక్షణ మొ॥ ఉపయోగాలు కలుగుతాయి.




**సమగ్ర కుటుంబ సర్వే:**

నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా తీర్చిదిద్దడానికి, తెలంగాణ రాష్ట్ర సామాజిక, ఆర్థిక స్థితిగతులను మరియు రాష్ట్ర ప్రజల యొక్క జీవన పరిస్థితి మరియు సామాజిక ఆర్థిక స్థితిగతులను సంపూర్ణంగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం "సమగ్ర కుటుంబ సర్వే" కార్యక్రమాన్ని చేపట్టి రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు సంబంధించి ఒకే ఒక పటిష్టమైన గణాంక సమాచార నిధిని తయారు చేసింది. దీని ద్వారా అర్హత కలిగిన లబ్దిదారులను గుర్తించి వారి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను తయారుచేసి సమర్థవంతమైన అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడానికి వీలుపడుతుంది.




**మన ఊరు - మన ప్రణాళిక:**

గ్రామ ప్రజలు తమ ఊరిని అభివృద్ధి చేసుకునే క్రమంలో సమస్యలను సరిగా అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి సరైన ప్రణాళికలు రూపొందించుకోవడం లక్ష్యంగా మన ఊరు - మన ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది.



ఈ ప్రణాళిక ద్వారా సమగ్రాభివృద్ధికి కీలక అంశాలైన సహజవనరులు, వ్యవసాయం, పౌష్టికాహారం, త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, ఉపాధికల్పన

వంటి అంశాలలో కీలకపాత్ర పోషించేందుకు పంచాయతీ రాజ్ సంస్థలను అన్ని విధాలా సంసిద్దులను చేసేందుకు గణనీయమైన కృషి చేస్తుంది.

తద్వారా సామాజిక న్యాయం, ఆర్థికాభివృద్ధితో పాటు సుపరిపాలన దిశగా స్థానిక ప్రభుత్వాలను ముందుకు తీసుకువెళ్ళడానికి వ్యూహాత్మక కార్యాచరణ చేపడుతున్నది.

## స్వచ్ఛ తెలంగాణ:

2019 నాటికి 'బహిరంగ మల విసర్జనను' రూపుమాపాలనే ఉద్దేశ్యంతో స్వచ్ఛ తెలంగాణ మిషన్‌కు ప్రభుత్వం శ్రీకారం చేసింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని అన్ని నగరాలు మరియు పట్టణాలను శుభ్రత పైన ప్రత్యేక దృష్టిని పెడుతూ పారిశుద్ధ్యం, పరిశుభ్రము మరియు ప్రజారోగ్యం పైన ప్రజలలో అవగాహణ తీసుకురావడం మరియు ప్రజారోగ్యాలపైన ప్రత్యేక దృష్టిని సారిస్తారు. అంతేకాక ప్రతి ఇంటికి మరుగుదొడ్డి సౌకర్యం కల్పిస్తూ వాటి వినియోగంకు ప్రోత్సహిస్తుంది. వారి ప్రవర్తనలో మార్పు తీసుకువస్తారు.




## స్వచ్ఛ తెలంగాణ - స్వచ్ఛ హైదరాబాద్:

ప్రధాన నగరాల్లో ఒకటైన హైద్రాబాద్‌ను అందంగా, పరిశుభ్రంగా మరియు సకల సౌకర్యాలు గల విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం స్వచ్ఛ తెలంగాణ - స్వచ్ఛ హైద్రాబాద్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మన గవర్నరు, ముఖ్యమంత్రి గారు, మంత్రులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, రాష్ట్ర ఉన్నతాధికారులు స్వయంగా బస్తీల్లో తిరుగుతూ ప్రజలను ఉత్సాహపరుస్తూ వారిని కూడా స్వచ్ఛ హైద్రాబాద్ కార్యక్రమంలో భాగస్వాములను చేశారు.

## తెలంగాణ పల్లె ప్రగతి (తెలంగాణ రూరల్ ఇన్‌క్లూజివ్ గ్రోత్ ప్రాజెక్ట్ - TRIGP):

తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ స్థితిగతులను నిరుపేదల జీవనాభివృద్ధి పెంపొందించడం కోసం "తెలంగాణ పల్లె ప్రగతి" అనే ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాన్ని ప్రపంచ బ్యాంకుల సహకారంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్ట్ కాల పరిమితి 5 సం॥లు (ఫిబ్రవరి 1, 2015 - ఫిబ్రవరి 1, 2020).

తెలంగాణ రాష్ట్రంలోని ఎంపికచేయడబడిన వెనుకబడిన 150 మండలాల్లో మొదటి దశ ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎంపిక చేసుకోబడిన వెనుకబడిన పేదల ఆదాయాలను, మానవ అభివృద్ధి సేవలను మరియు సామాజిక హక్కులను పెంపొందిస్తారు.

ఈ ప్రాజెక్టు క్రింద చిన్న మరియు పేద రైతులు, షెడ్యూలు కులములు / షెడ్యూలు తెగలు, ఇతర నిరుపేదలు లబ్దిదారులు.

**ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యాలు:**

1. గ్రామస్థాయిలో 2.5 లక్షల పేదల ఉత్పత్తిదారుల సంఘాలు, కృషిమార్టుల ఏర్పాటు ద్వారా ఆదాయం పెంచడం.
2. వ్యవసాయ పద్దతులు, మార్కెటింగ్ మెలకువల్లో శిక్షణ, పాడిపరిశ్రమ, గొర్రెలు, మేకలు, పెంపకంతో పాటు వరి, తృణ ధాన్యాల ఉత్పత్తి, తదితర అంశాలలో వారికి చేయూతనందించడం.
3. 2.5 లక్షల పేద కుటుంబాలలో ఆరోగ్యం, ఆహార భద్రత కల్పించడం
4. 150 మండలాలలో అందరూ మరుగుదొడ్లు వినియోగించుకుని వారి గ్రామాన్ని బహిరంగ విసర్జనలులేని గ్రామంగా ఎంపిక చేయడానికి తోడ్పాటు.
5. 1000 గ్రామ పంచాయితీలలో 'పల్లె సమగ్ర సేవా కేంద్రాలు' ఏర్పాటు చేయడం.

## ఆహార భద్రత:

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో 'ఆహార భద్రత' ఒకటి. అర్హులైన ప్రతి పేదవారికి సబ్సిడీ ఆహార ధాన్యాలు, నిత్యావసర సరుకులు అందించే లక్ష్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం. ప్రతి లబ్దిదారునికి నెలకు 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తారు.

ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేయడం కోసం మన తెలంగాణ ప్రభుత్వం ప్రతి స్థాయిలో నిఘా కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. (G.O.Ms.No.9 పౌర సరఫరాల శాఖ, తేది: 16.07.215)

## సన్నబియ్యం పథకం:

వసతి గృహాల్లో, హాస్టళ్ళలో చదువుతున్న విద్యార్థులకు, మధ్యాహ్న భోజనం పథకం లబ్దిపొందుతున్న విద్యార్థులకు పుష్టికరమైన మరియు నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం (సూపర్ ఫైన్) సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టింది. అంతేకాక కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉన్నప్పటికీ ప్రతి మనిషికి 6 కిలోలు సన్నబియ్యం సరఫరా చేసేందుకు నిర్ణయించింది. ఈ పథకం జనవరి 1, 2015 నుండి అమలులోకి వచ్చింది.

## ఆరోగ్యలక్ష్మి:

మహిళా సంక్షేమము మరియు రాష్ట్రంలోని తల్లి బిడ్డలందరు ఆరోగ్యంగా ఉండాలని వారికి పౌష్టిక ఆహారం అందించి మాతా శిశు మరణాల రేటును తగ్గించే ప్రధాన లక్ష్యంగా ఆరోగ్య లక్ష్మి కార్యక్రమాన్ని జనవరి 1, 2015న మన రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడం జరిగింది. గర్భిణులు, బిడ్డకు పాలిస్తున్న తల్లి (బాలింత)లకు పౌష్టికాహారం సమకూర్చడం కోసం అంగన్‌వాడి కేంద్రాలలో ప్రతి రోజు ఒక పూర్తి భోజనం ఏర్పాటు చేస్తారు.

గర్భిణీ స్త్రీలు మరియు బాలింతలు: ప్రతిరోజు ఒక గ్రుడ్డు, 200 మి.లీ. పాలతో పాటు నెలలో 25 రోజుల పాటు సంపూర్ణ పౌష్టికాహార భోజనం అందిస్తారు.

7 నెలల నుండి 3 సం॥లోపు పిల్లలు: నెలకు 16 గ్రుడ్లు, 2.5

కిలోల పౌష్టికాహార ప్యాకెట్లను అందజేస్తారు.

3 సం॥ నుండి 7 సం॥లోపు పిల్లలు: అన్నం, పప్పు కూరలు, స్నాక్స్ మరియు ప్రతిరోజు ఒక గ్రుడ్డు.

**విత్తన బాండాగారం:**

పుష్కలమయిన సూర్యరశ్మి, పొడి వాతావరణము గాలిలో తక్కువ తేమ, అనువయిన నేలల వల్ల విత్తన పంటల సాగుకు తెలంగాణ అత్యంత అనుకూలము. తెలంగాణలో 45% పైగా పంటల దిగుబడి, రాష్ట్రంలో విభిన్న స్వభావం కలిగిన నేలలు సమశీతోష్ణ వాతావరణము మంచి వర్షపాతము ఉన్నవి. ఈ పరిస్థితులు విత్తనోత్పత్తికి దోహదం చేస్తాయి. ఇలాంటి ప్రత్యేక పరిస్థితులున్నందు వలననే ఇక్రిసాట్‌తో పాటు 360 కి పైగా విత్తన కంపెనీలు తెలంగాణలో ఉన్నాయి.

భారతదేశ విత్తన రాజధానిగా తెలంగాణకు పేరుంది. దేశానికి అవసరమయ్యే విత్తనాలు తెలంగాణలోనే తయారవుతున్నాయి. ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు ఎంతో కృషి సల్పుతుంది.

**దళిత కుటుంబాలకు మూడు ఎకరాల భూమి:**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి దళితుల అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఆశించినంతగా దళితుల అభివృద్ధి చెందలేదు. ఇప్పటికీ 90% దళితులు నిరుపేదలుగానే ఉన్నారు. అందుకనే సామాజిక అసమానతలను రూపుమాపి సాధికారతను కల్పించే ఉద్దేశ్యంతో భూమిలేని నిరుపేద దళిత వ్యవసాయాధారిత కుటుంబాలకు ప్రతి కుటుంబానికి మూడెకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి శ్రీ చంద్రశేఖర్ రావు గారు నిర్ణయించారు. ఈ భూమిలో బోరు, మోటారు, కరెంట్ సదుపాయం లాంటి వసతులను ప్రభుత్వం కల్పిస్తుంది. ఈ పథకము ద్వారా మహిళా లబ్దిదారుల పేరిట పట్టాను రూపొందించి భూములను రిజిస్ట్రేషన్ చేస్తారు. ఇది ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది.

**పల్లె సమగ్ర సేవా కేంద్రాలు:**

సొసైటి ఫర్ రూరల్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ వారు తెలంగాణలో 150 వెనుకబడిన మండలాల్లో తెలంగాణ పల్లె ప్రగతి (TRIGP) కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే పల్లె సమగ్ర సేవా కేంద్రం (వన్ స్టాప్ షాప్) ను నెలకొల్పారు. దీని ద్వారా అన్ని రకాల ఆర్థిక లావాదేవీలు. ముఖ్యంగా లబ్దిదారులకు ఉపాధి కూలీ చెల్లింపు, పింఛన్ల చెల్లింపు మొదలయిన ఇతర ఆర్థిక లావాదేవి జరుపబడతాయి. ఈ కేంద్రాలు స్వయం ప్రతిపత్తిగల కేంద్రంగా వ్యవహరిస్తూ మీ.సేవా ఇతర బ్యాంక్‌లకు అనుసంధానంగా పనిచేస్తుంది.

**డబుల్ బెడ్‌రూమ్:**

కనీస అవసరాలైన కూడు, గుడ్డ, నీడ అనేవి ప్రజలందరికి ఎంతో అవసరం. కానీ ధరలు అందుబాటులో లేక నిరుపేదలు, బడుగువర్గాల వారు సొంత ఇంటి కల కళగానే మిగిలిపోతుందని వారి సొంత గూడు కల నెరవేర్చడం కోసం తెలంగాణ ప్రభుత్వం రెండు పడక గదుల నిర్మాణం పథకం చేపట్టింది. ఈ పథకం క్రింది ఇల్లులేని నిరుపేదలను గ్రామసభలో అర్హత గల లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ పథకం క్రింద పేద, నిరుపేద వర్గాల వారై ఉండి దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నవారై వారికి కుటుంబ ఆహార భద్రత కార్డు కల్గినవారై ఉండాలి, కుటుంబ యజమాని భార్య పేరున ఇల్లు మంజూరు చేస్తారు, ఇల్లులేక కిరాయి ఇంటిలో నివసిస్తున్న వారు, గుడిసెలలో, కచ్చా ఇల్లల్లో నివసిస్తున్న స్థానికులై అన్ని ఆధారపత్రాలు కలిగి ఉండాలి,



**5 రూపాయలకే భోజనం:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా 2014 మార్చిలో గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ 5 రూపాయలకే భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా నిరాశ్రయులైన నిరుపేదల ఆకలిగొన్న వారికి కనీసం ఒక్క పూటైనా కడుపునిండా నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సహాయంతో జి.హెచ్.యం.సి 5 రూపాయలకే భోజనం అందిస్తుంది. రోజు దాదాపు 15 వేలకు పైగా ప్రజలు ఈ పథకం ద్వారా తమ ఆకలిని తీర్చుకుంటున్నారు.



**గ్రామజ్యోతి:**

పంచాయతీలు, తాండాలు, పల్లెల సమగ్ర అభివృద్ధి కోసం గ్రామజ్యోతి రూపకల్పన జరిగింది. గ్రామ సభయే గ్రామ స్థాయిలో అత్యున్నత స్థాయి పార్లమెంటు లాంటిది. దానికి పూర్తి బాధ్యతలు కట్టబెట్టడం ద్వారా పంచాయితీలు బలోపేతం అయ్యి గ్రామ స్వరాజ్యం వస్తుంది అనే గాంధీజీ మాటలు పరిగణలోకి తీసుకుని 'గ్రామజ్యోతి' లాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వచ్చే నాలుగేళ్ళలో 25 వేల కోట్ల రూపాయలతో గ్రామాల్లో త్రాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్య, విద్య, వైద్యం, సామాజిక భద్రత, పేదరిక నిర్మూలన, సహజ వనరుల నిర్వహణ, వ్యవసాయం మరియు మౌళిక వసతుల కల్పనకు ఈ కార్యక్రమం ద్వారా అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయితీలలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలన్నింటిలో గ్రామ ప్రజలను భాగస్వాములను చేస్తూ గ్రామ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రచించి వాటిని సక్రమంగా అమలు జరిగేలా చేయడంలో ప్రజలు బాధ్యత వహిస్తారు. దీనితో అధికారుల్లో పారదర్శకత, జవాబుదారీ తనం పెరిగి అన్ని అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా అమలు అవుతాయి. గ్రామజ్యోతి కార్యక్రమంలో గ్రామసభ యొక్క పాత్ర చాలా విశిష్టమైనది. వివిధ అంశాల మీద గ్రామ స్థాయిలో కార్యాచరణ కమిటీల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది.

**T-HUB (డిజిటల్ తెలంగాణ) :**




IT కి రాజధానిగా హైదరాబాదు ముస్తాబు అవుతుంది. నవ భారత నిర్మాణానికి నూతన ఆలోచనలతో ఓత్సాహిక పారిశ్రామిక వేత్తలను, సైంటిస్టులను ప్రోత్సహించే దిశలో ప్రభుత్వం ఎంతో కృషి సల్పుతోంది. ఈ-కామర్స్, లైఫ్‌సైన్సెస్, మెడికల్, ఈ లర్నింగ్, ఈ రిటైలింగ్ రంగాలలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి యువతను ప్రోత్సహిస్తుంది.

**డ్రైవర్ కమ్ ఓనరు పథకం:-**



నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో, డ్రైవర్ కం ఓనర్ పథకాన్ని ప్రవేశపెట్టి, యువతకు మారుతి స్విఫ్ట్ డిజైనర్ కార్లను, సబ్సిడీతో పాటు ఋణ సౌకర్యంగూడ సమకూరుస్తున్నారు.

**TS. PAS (టి.యస్.ఐ.పాస్):- తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్టుల అనుమతులు, స్వీయ ధృవీకరణ విధానం:(నూతన పారిశ్రామిక విధానం)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సత్వర పారిశ్రామికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రవేశపెట్టింది. స్థానికంగా ఔత్సాహికులను ప్రోత్సహించడం, నిపుణులను ప్రోత్సహించడం, పరిశ్రమల కోసం ప్రత్యేక గ్రిడ్‌లు ఏర్పాటు, రాజకీయ జోక్యం లేకపోవడం, ఏకగవాక్ష విధానం, భూ బ్యాంక్ ఏర్పాటు మొదలగునవి.

**KG to PG ఉచిత విద్య:-**



విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయుడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలోని విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకువచ్చి, కులాల, మతాలకు అతీతంగా అందరికీ ఉచిత మరియు నాణ్యమైన విద్యను అందించాలని దృఢ నిశ్చయంతో మన ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు.

**ఈ పథకం యొక్క లక్ష్యాలు:**

1. రాష్ట్రంలోని ప్రతి నియోజక వర్గానికి 10 రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయడం.
2. కుల, మతాలకు డబ్బుతో పని లేకుండానే నాణ్యమైన ఉచిత విద్యను అందించడము.
3. ప్రాథమిక స్థాయి నుంచే అనగా 5వ తరగతి నుంచే ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయడం.
4. ఇంగ్లీషు మీడియం, సి.బి.యస్.ఇ సిలబస్ ను ఈ పాఠశాలలో బోధించడము.
5. ఐ.ఐ.టి. లను విద్యాశాఖ మాత్రమే నిర్వహించాలి.
6. ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంతో పాటుగా మెరుగైన వైద్యం గురుకుల పాఠశాలలో అందించడము.
7. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం / మెరుగుపరచడం.

**మహిళల భద్రత కోసం "షీ బృందాలు":-**

హైద్రాబాద్ నగరంలో మహిళలు, యువతులు, విద్యార్థినులు, మైనర్ బాలికలపై నిరంతరంగా యదేచ్ఛగా కొనసాగుతున్న అఘాయిత్యాలను, అత్యాచారాలను మరియు ఈవ్ టీజింగ్ సమస్యలకు ముగింపు పలకాలన్న దృఢ సంకల్పంతో ఇంటా, బయటా, కార్యాలయాల్లో, బస్సుల్లో, రైళ్ళలో మహిళలను, ఉద్యోగులను, విద్యార్థులను రక్షించేందుకు "షి" బృందాలను 24.10.2014 నుంచి నగరంలో అందుబాటులోనికి వచ్చాయి. "తెలంగాణ స్టేట్ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ అండ్ ఎంపవర్‌మెంటు ఆఫ్ ఉమెన్" పేరుతో ఒక సంస్థను రిజిస్ట్రేషన్ చేసి స్థాపించడం జరిగింది. షీ క్యాబ్స్‌లో మహిళా డ్రైవర్లను ప్రోత్సహించి, 'షీ క్యాబ్స్' పేరుతో మహిళా అభ్యర్థులకే టాక్సీలు సమకూర్చడం జరిగింది.

ప్రస్తుతం హైద్రాబాద్ నంగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో 25 కి. పైగా 'షి' బృందాలు ఎంతో సమర్ధవంతంగా నగర అదనపు పోలీస్ కమీషనర్ (నేరాలు) స్వాతిలక్రా) ఆధ్వర్యంలో పనిచేస్తున్నాయి.

**తెలంగాణ కార్మిక సంక్షేమ పథకాలు:**

నమోదైన ప్రతి భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ రంగంలోని కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో మంచి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకము మే 1, 2015 నుంచి అమలవుతున్నది.

- ★ భవన నిర్మాణ కార్మికునిగా నమోదైన 12 నెలల తర్వాత అతని భార్యకు రెండు కాన్పుల వరకు కాన్పుకు రూ. 10,000/- ఇవ్వడం జరుగుతుంది.
- ★ ప్రసూతి సమయంలో ఇతర వైద్య ఖర్చులకు గాను రూ. 30,000/- వరకు ఇవ్వడం జరుగుతుంది.
- ★ ఈ నగదును లబ్దిదారుల బ్యాంకు ఖాతాలో మాత్రమే జమచేయడం జరుగుతుంది.
- ★ రిజిష్టర్ అయిన కార్మకులకు ప్రమాదవశాత్తు కాని, సహజ మరణం కాని సంభవిస్తే దహన ఖర్చులకు రూ. 20,000/- అంజేస్తారు.

ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన, మహిళా విభాగాలు అందరూ ప్రభుత్వ పథకాల గురించి చర్చించి, వాటిని అర్హులైన లబ్ధిదారులను, పారదర్శకంగా ఎంపిక అయ్యేటట్లు చూడవల్సిన బాధ్యత అందరి మీద వుంది. అర్హులైన లబ్ధిదారులను గ్రామసభలలో అందరి సమక్షంలో చర్చించి, నిర్ణయించి ఎంపిక చేయాలి. ప్రభుత్వ పథకాలు మార్గదర్శక సూత్రాలపైన అందరికీ అవగాహన కలిగించాలి. ఈ విధమైన ప్రక్రియతో ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలు పూర్తిస్థాయిలో భాగస్వామ్యమైనప్పుడు బంగారు తెలంగాణ సాధించవచ్చు.

**కె.యాదయ్యగౌడ్, జాయింట్ డైరెక్టర్, టిసిపార్డ్**



# వరిలో యాజమాన్య పద్ధతులు

రబీలో ప్రస్తుతం రైతులు బోర్లు, నీటి సౌకర్యం ఉన్న భూముల్లో సాగు చేస్తున్న వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి. దీనివల్ల అధిక దిగుబడి సాధించవచ్చు. విత్తనశుద్ధి మొదలు నారుమడులు, నాటు, కలుపు, ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక లాభాలు గడించవచ్చు. యాజమాన్య పద్ధతులపై మహామ్ముత్తారం వ్యవసాయశాఖాధికారి కలువల సతీష్ రైతులకు సలహాలు, సూచనలిచ్చారు.

**విత్తనశుద్ధి:** కిలో వరి విత్తనానికి మూడు గ్రాముల కార్బండైజిమ్‌ను కలిపి నారుమడిలో చల్లాలి. దుంపనారు అయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండైజిమ్‌ను కలిపి విత్తనాలను 24 గంటలు నానబెట్టి, తర్వాత మండెకట్టి మొలకలను నారుమడిలో చల్లుకోవాలి.

**పంట సమయం:** దీర్ఘకాలిక రకాలు (150 రోజులు) ఖరీఫ్‌లో మే నుంచి జూన్ చివరి వరకు రబీలో అక్టోబర్ 15 నుంచి నవంబర్ చివరి వరకు మధ్యకాలిక రకాలు (135-140 రోజులు) ఖరీఫ్ జూన్-జూలై, రబీలో నవంబర్ నుంచి డిసెంబర్ రెండో వారం వరకు, స్వల్పకాలిక రకాలు (120-125 రోజులు) ఖరీఫ్‌లో జూలై-ఆగస్టు మూడవ వారం వరకు, రబీలో నవంబర్ 15 నుంచి డిసెంబర్ చివరి వరకు విత్తుకోవచ్చు.

**నారుమడి యాజమాన్యం:** నారుమడిలో ప్రతి ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలిగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం మోతాదు రెట్టింపు వేయాలి. ఊదగడ్డి నిర్మూలనకు బూటాక్లోర్ 7.5 మి.లీ లీటర్ నీటిలో కలిపి, విత్తిన ఏడు లేక ఎనిమిదో రోజున మడిలో నీటిని కలిపి పిచికారీ చేయాలి. లేదా 14-15 రోజులప్పు డు బ్యుటైల్ 10 శాతం 2 మి.లీ. లేదా బిస్‌పైరియోబాక్ 0.6 మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కలు పు తీయటానికి ఏడు రోజుల ముందు కార్బోఫ్యూరాన్ మూడు శాతం లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరోఫైర్‌ఫాస్ 2.0 మి.లీ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**నారు విత్తుకునే పద్ధతి:** 15-30 రోజుల నారును విత్తుకోవడం మంచిది. నాటు వేసేటప్పుడు పంటకాల పరిమితిని బట్టి చ.మీ.కు దీర్ఘకాలిక రకాలైతే 33, మధ్యకాలిక రకాలు 44, స్వల్పకాలిక రకాలు 66 కుదుళ్లు ఉండేలా నాటుకోవాలి. నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు 30 సెం.మీ. బాటలు తీయడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంతవరకు అదుపు చేయవచ్చు. ముదురు నారు నాటినప్పుడు కుదుళ్ల సంఖ్య పెంచి, కుదురుకు 4-5 మొక్కల చొప్పున నాటుకోవాలి. అలా నాటినప్పుడు నత్రజని ఎరువును సిఫారసు కంటే 25 శాతం పెంచి మూడు దఫాలుగా గాక, రెండు దఫాలుగా అంటే 70 శాతం దమ్ములోనూ మిగతా 30 శాతం అంకురం దశలో వాడాలి.

**ఎరువుల యాజమాన్యం:** ఎకరానికి ఖరీఫ్‌లో నత్రజని 40 కిలో లు, 20 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్‌ను వాడాలి. రబీలో 70-75 కిలోల నత్రజని, 30 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్, 20 కిలోల జింక్‌ను వాడాలి. నత్రజనిని మూడు సమ భాగాలుగా చేసి నాటుకు ముందు దమ్ములోను, దుబ్బుచేసే దశలోను, అంకురం దశలోను, బురద పదునులో మాత్రమే సమానంగా వెదజల్లి, 24-36 గంటల తరువాత పలుచగా నీరు పెట్టాలి. మొత్తం భాస్వరం ఎరువును దమ్ములోనే వేయాలి. పొటాష్ ఎరువులను ఆఖరి దమ్ము లో సగం, అంకురం ఏర్పడే దశలో మిగతా సగాన్ని వేయాలి. ఈ ఎరువులతో పాటుగా జింక్ ఎరువును ఎకరానికి 20 కిలోల చొప్పున ప్రతి రబీ సీజన్‌లో ఆఖరి దమ్ములో వేయాలి. జింక్ ఎరువును భాస్వ రం ఎరువుతో కలిపి వేయరాదు. సమస్యాత్మక నేలలైతే ఎకరానికి 40 కిలోల జింక్‌ను వేసుకోవాలి.

**కలుపు యాజమాన్యం:** ఏకవార్షిక గడ్డిజాతి మొక్కలు ఉన్నప్పు డు బ్యుటాక్లోర్ 50శాతం 1 నుంచి 1.5మి.లీ లేదా అనిలోఫాస్ 30 శాతం 500 మి.లీ లేదా ప్రిటిలాక్లోర్ 50 శాతం 400 మి.లీ ఎకరానికి 20 కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన 3 నుంచి 5 రోజుల్లో పలచగా నీరు పెట్టి సమానంగా వెదజల్లాలి. లేదా ఎకరాకు 35 నుంచి 50 గ్రాముల ఆక్సాడయార్జిల్ 80 శాతం పొడి మందును 500 మి.లీ నీటిలో కలిపి ఆ ద్రావణాన్ని ఎకరాకు 20 కిలోల పొడి ఇసుకలో కలి పి నాటిన 3 నుంచి 5 రోజుల్లో సమానంగా వెదజల్లాలి.

నీటి యాజమాన్యం: నాట్లు వేసేటప్పటి నుంచి చిరు పొట్ట దశ వరకు పొలంలో నీరు పలచగా ఉంచుకోవాలి. చిరు పొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకు 5 సెం.మీ లోతు వరకు నీరుండాలి. కోతకు పదిరోజుల ముందుగా నీటిని నెమ్మదిగా తగ్గించి ఆరబెట్టాలి.

**- అజ్మీరా దాకూనాయక్, మహాముత్తారం**




# తెలంగాణా రాష్ట్రంలో అందరికీ విద్య దిశగా అడుగులు

సమాజానికి అవసరమయ్యే సేవలు ఏమిటి? అందుకు అనుగుణంగా సేవలందించేవారిని ఎలా తయారు చేయాలి? అనే విషయంపై విద్యా శాఖకు అవగాహన ఉండాలి. ఏ వృత్తిలో ఎంతమంది అవసరం? అనే విషయాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా కోర్సులు తీసుకురావాలి. సమాజానికి అవసరమైన నర్సులు, ఉపాధ్యాయులు, మానవ వనరులను పెంపొందించే వారు, ప్రణాళికలు రూపొందించే వారు, కళాకారులు, మెకానిక్‌లు, రాజకీయ, రాజకీయేతర నాయకులు.. ఇలా ఎన్నో రకాల వ్యక్తులను తయారు చేయాల్సిన బాధ్యత కూడా విద్యాశాఖదే.

కుల, మత, ధనిక, పేద అనే తేడా లేకుండా, అంద రూ ఒకేచోట ఉండి చదువుకునే విధంగా, ఆంగ్ల మాధ్యమంలో కేజీ టు పీజీ వరకు ఉచిత, నిర్బంధ విద్యావిధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశ పెట్టనుంది. నూతన రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణలో, ఎన్నికల ప్రణాళికలో చేసిన వాగ్దానానికి అనుగుణంగా, కేజీ టు పీజీ దిశగా విద్యా నమూనాను రూపొందించే దిశగా సీఎం కేసీఆర్ చర్యలు చేపట్టారు. విద్యావ్యవస్థలో సంస్కరణలపై ద ృష్టిసారించారు. బాల బాలికలందరికీ ఒకే తరహా పాఠశాలల్లో, ఒకే రకమైన పరిస్థితుల్లో, విద్యాబోధన జరిగేట్లు చూడడమే ఈ విద్యావిధానం ప్రధాన ఉద్దేశం. సీఎం ప్రతిపాదించి అమలు చేయదల్చుకున్న ఈ విద్యా విధానం ఆరంభించి ముందుకుసాగాలంటే, ప్రధానంగా కావాల్సింది ఆంగ్ల భాషలో చక్కటి ప్రావీణ్యం ఉన్న ఉపాధ్యాయులు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలవుతున్న విద్యా విధానం కొంతమేరకు ఈ పథకానికి చేరువలో ఉన్నది.

వైద్య విద్య మినహా మిగిలినవన్నీ విద్యా శాఖ నోడల్ ఏజెన్సీగా, ఒకే గొడుగు కింద పనిచేస్తే ఫలితాలు బాగుంటాయనేది కేసీఆర్ భావన. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగులు, తదితర విభాగాలకు రెసిడెన్షియల్ పాఠశాలలు నడుస్తున్నాయి. ఇన్ని రకాల రెసిడెన్షియల్ పాఠశాలల ఆవశ్యకత ఉన్నదా అనే విష యం ఆలోచించాలి. ఆ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థికి సరైన బోధన జరుగుతున్నదా లేదా అనేది ముఖ్యం.

అందరికీ ఒకే రకమైన విద్య, వసతి, సౌకర్యాలు కల్పించాలి. విద్యాశాఖ నిర్ణయించిన, ఒకే రకమైన సిలబస్ అన్ని పాఠశాలల్లో అనుసరిస్తే మంచిది. ఇంకో విషయం.. ఈ పాఠశాలలకు రకరకాల పర్యవేక్షణ వ్యవస్థలు ఉండాల్సిన అవసరం ఉన్నదా అనేది. ఉదాహరణకు, గిరిజన సంక్షేమ శాఖ చేయాల్సిన పనులెన్నో ఉండగా, పలు సం క్షేమ కార్యక్రమాల అమలుపై ద ృష్టి సారించకుండా, దానికి పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగించడం ఎంతవరకు సబ బు? అన్ని రకాల రెసిడెన్షియ ల్ పాఠశాలలను ఒకే ఏజెన్సీ పర్యవేక్షణలో, ఒకే గొడుగు కింద తేవడం మం చిదని ముఖ్యమంత్రి అభిప్రాయం.

కేజీ టు పీజీ విద్యావిధానంలో భాగంగా, బాల బాలికలకు ఎనిమిది సంవత్సరాల వయసు పూర్తి అయిన తరువాతే, అంటే, నాలుగో తరగతి



పాసైన అనంతరం మాత్రమే, రెసిడెన్షియల్ పద్ధతి ద్వారా, హాస్టల్లో ఉంటూ విద్యనభ్యసించాలి. నాలుగో తరగతి వరకు తల్లిదండ్రుల సంరక్షణలోనే ఉండి, దానికనుగుణంగా, గ్రామ-లేదా వారుండే నివాస ప్రాంతం స్థాయిలోనే విద్యా బోధన జరగడం శ్రేయస్కరం. ఆ తరువాతే ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యనందించాలనేది సీఎం అభిప్రాయం. ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానంలో, ఐదవ తరగతి నుంచి, ఒక్కో ఏడాది గడుస్తుంటే, ఒక్కో తరగతి ఉపసంహరించుకోవడం జరుగుతుంది. అంటే, నూతన విద్యా విధానంలో, ఐదవ తరగతిలో చేరిన విద్యార్థి, పదవ తరగతిలో ప్రవేశించడానికి, ఆరేళ్లు పడుతుంది. ఇలా కొనసాగుతుంటే, ఆంగ్ల మాధ్యమంలో బోధనకు అనుకూలంగా, ఏటేటా పదవీ విరమణ చేసే ఉపాధ్యాయుల సంఖ్యను అంచనా వేసి, వారి స్థానంలో ఆంగ్లంలో ప్రావీ ణ్యం ఉన్న వారిని తీసుకుంటే మంచిది.

కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆరంభించి, దరిమిలా నిధుల కేటాయింపును నిలుపుదల చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి నిర్వహణ బాధ్యతను అప్పగించిన ఆద ర్శ పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా 668 వున్నాయి. వీటిల్లో ఆంగ్ల మాధ్యమం లో విద్యాబోధన జరుగుతోంది. వీటితో పాటు అనేక రెసిడెన్షియల్ పాఠశాలలు కూడా రాష్ట్రంలో ఉన్నాయి. వీటన్నిటినీ ఒకే గొడుగు కిందకు తేవాలనేది ముఖ్యమంత్రి అభిప్రాయం. సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఉన్నంతలో మెరుగ్గా నడుస్తున్నాయని, స్వల్ప మార్పులు అవసరమైతే చేసుకుని, అదే నమూనాలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడున్న 668కి తోడు మరో 522 స్కూల్‌లను ప్రారంభించి, మొత్తం 1190 రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పా టు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆ విధంగా, రాష్ట్రంలో ఉన్న 119 నియోజకవర్గాల్లో.. నియోజకవర్గానికి సగటున 10 ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు అవుతాయి.



ఈ పాఠశాలలో, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన విద్యార్థులందరికీ ప్రవేశాలు కల్పించాలనేది ముఖ్యమంత్రి ఆశయం. ప్రస్తుతం వున్న 668 మోడల్ స్కూళ్లను, శాసన సభ నియోజకవర్గాల వారీగా, సమతుల్యం పాటించే విధంగా పంపిణీ జరగాలి. అదే విధంగా, 12వ తరగతి తరువాత కూడా ఈ విద్యార్థులు ఏయే కోర్స్ లు ఎంచుకుంటున్నారు? వారికి ఎలాంటి విద్య, వసతి సౌకర్యాలు కల్పించాలి? అనే దానిపై ఓ సమగ్ర విధానం రూపొందించాలి.

వైద్య విద్యా విధానాన్ని కూడా విశ్లేషించి చూడాల్సిన అవసరం ఉన్నది. చదువంటే కేవలం మెడిసిన్, ఇంజినీరింగ్ మాత్రమే అనే భావన పోవాలని ముఖ్యమంత్రి అన్నారు. సమాజానికి అవసరమ య్యే సేవలు ఏమిటి? అందుకు అనుగుణంగా సేవలందించేవారిని ఎలా తయారు చేయాలి? అనే విషయంపై విద్యా శాఖకు అవగాహన ఉండాలి. ఏ వృత్తిలో ఎంతమం ది అవసరం? అనే విషయాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా కోర్సులు తీసుకురావాలి. సమాజానికి అవసరమైన నర్సులు, ఉపాధ్యాయులు, మానవ వనరులను పెం పొందించే వారు, ప్రణాళికలు రూపొందిం చే వారు, కళాకారులు, మెకానిక్‌లు, రాజకీయ, రాజకీయేతర నాయకులు.. ఇలా ఎన్నో రకాల వ్యక్తులను తయారు చేయాల్సి న బాధ్యత కూడా విద్యా శాఖదే. ఉదాహరణకు, తెలంగాణ రాష్ట్రంలో వివిధ స్థాయిలలో ఎన్నికయ్యే వేలకొలది భవిష్యత్ ప్రజాప్రతినిధులకు సరైన నాయకత్వ లక్షణాలు అలవరచుకునే రీతి విద్యా విధానం తయారు కావాలి. ఏ తరగతి నుంచి ఇలాంటి విద్యా బోధన జరగాలనేది ఆలోచించాలి.

ప్రస్తుతం ఉన్న డిగ్రీ కోర్సులు ఉద్యోగావకాశాలను పెంచేలా ఉండాలని ప్రభుత్వ లక్ష్యం. అంతిమంగా విద్యా విధానంలో ఈ మార్పులన్నీ చోటు చేసుకోవడం అంటే.. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా ఆంగ్ల మాధ్యమంలో కేజీ టు పీజీ వరకు ఉచిత నిర్బంధ విద్యా విధానాన్ని అమలు పరచడమే.

- వార్తాంశం



# పర్యావరణ పరిరక్షణ మానవాళి బాధ్యత

**పారిస్ ఒప్పందంలో వివిధ దేశాలు భూతాపాన్ని తగ్గించడానికి రూపొందించుకొన్న ప్రణాళికలను చట్టబద్ధత లేకపోవడం ప్రధాన లోపంగా కనపడుతున్నది. ఈ ప్రణాళికల అమలుకు కూడా నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక లేదు. ఐరాస ఆధ్వర్యంలో సదరు దేశాల ప్రణాళికల అమలును పర్యవేక్షించవలసిన అవసరం ఉన్నది. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతాయని ఆశిద్దాం.**

భారతీయ చింతనలో, వాఙ్మయంలో ప్రకృతికి ఆరాధనాభరితమైన స్థానం ఇవ్వబడింది. 'సర్వేజనః సుఖినో భవంతు' అనడమే కాకుండా 'సర్వేపి సుఖినః సంతు' అని కూడా చెప్పారు. అంటే మనుషులే కాకుండా సమస్త జీవులు కూడా సుఖంగా ఉండాలని అభిలాషించారు. అదే విధంగా ప్రకృతిలోని ప్రతి అణువుకు దైవత్వాన్ని ఆపాదించారు. అందుకే భూమికి శాంతి, నింగికి శాంతి, అంతరిక్షానికి శాంతి, అగ్నికి శాంతి, నీటికి శాంతి, దిక్కులకు శాంతి, ఓషధులకు శాంతి, చివరికి శాంతికే శాంతి కావాలని ఋగ్వేదంలో ఆకాంక్షించారు. ఇంత భావాత్మకంగా ఉదాత్తంగా, ఉద్వేగంగా ప్రకృతిని తాత్వీకరించడం మనిషి ప్రకృతిలో అంతర్భాగంగా చూడటం ప్రపంచ వాఙ్మయంలో అరుదుగా కనిపిస్తుంది. ఈ విషయంలో పాశ్చాత్యులం కంటే మనం ఉన్నతంగా ఆలోచించినట్లు కనపడుతున్నది. స్పినోజా అనే డచ్ తత్త్వవేత్త 17వ శతాబ్దంలో pantheism అనే భావన ద్వారా ప్రకృతిని దైవీకరించడం జరిగింది. ప్రకృతిలోని ప్రతి అంశంలో దైవాన్ని చూడటాన్ని pantheism అంటారు. అంతకుముందు వేల సంవత్సరాల క్రితమే ప్రకృతిని ఆరాధించడం భారతీయ సంస్కృతిలో అంతర్లీనంగా ఉన్నది. నేటికి మనదేశంలో చెట్టు, పుట్ట, రాయి, పాము మొదలగు వాటిని ఆరాధించడం చూస్తున్నాం. విలియం వర్డ్స్‌వర్త్ అనే ఆంగ్ల కవి 18వ శతాబ్దంలో ప్రకృతిని apparelled cellestial light అని వర్ణించాడు.

గత రెండు వందల సంవత్సరాలుగా పారిశ్రామిక విప్లవంతో ప్రారంభమైన పరిసరాల కాలుష్యం నేడు మనిషి మనుగడకే ప్రమాదం కలిగించే స్థాయికి చేరుకున్నది. పరిశ్రమల నుంచి, వాహనాల నుండి వచ్చే వ్యర్థాలు గాలిని, నీటిని, భూమిని, అంతరిక్షాన్ని అన్నింటిని కాలుష్యం చేస్తున్నవి. కర్బన ఉద్గారాల వల్ల భూతాపం పెరిగిపోతున్నది. భూగోళం అగ్నిగోళంగా మారుతుంది. భూతాపం 2 డిగ్రీల సెల్సియస్‌కు చేరితేనే సముద్ర మట్టం పెరిగి అనేక తీరప్రాంతాలు, ద్వీపాలు మునిగిపోతాయని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రీతిలోనే వాతావరణ కాలుష్యం పెరిగితే ఈ శతాబ్దపు అంతానికి భూతాపం 3.5 డిగ్రీ సెల్సియస్‌కు పెరిగి ప్రళయ విలయాలు సంభవించి జీవులు మనుగడ సాగించలేని స్థితికి చేరుతాయని చెప్తున్నారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రకృతి శక్తులను జయించి ఎన్నో సమస్యలను అధిగమించి ఆధునికుడిగా మారిన మనిషి తన ఉనికిని ఆధారభూతమైన పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుందన్న విషయాన్ని గ్రహించకపోవడం విషాదం. మనిషి వివేకాన్ని స్వార్థపరత్వం, అహంకారం, ఆధిపత్య ధోరణి, దురాశ మొదలైనవి కమేస్తున్నాయి. ఆర్థికాభివృద్ధి జరగాలంటే కాలుష్యం తప్పదని ప్రగతివాదులు భావిస్తున్నారు. కాలుష్యం గురించి మాట్లాడే పర్యావరణ శాస్త్రవేత్తలను ప్రగతి నిరోధకులుగా పరిగణిస్తున్నారు. ఆర్థికాభివృద్ధి కావాలంటే కాలుష్యం తప్పదని సూత్రీకరిస్తున్నారు. ఇదెలా ఉందంటే భూమి గుండ్రంగా ఉందని కోపర్నికస్ చెబితే అది దైవదూషణగా భావించి అతన్ని హింసించినట్లుగా ఉంది. దేశాలన్నీ విజ్ఞాన సమాజాలుగా మారుతున్నవని సంతోషిస్తున్నాం. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ఊహకందని ప్రగతి సాధిస్తూ ఎలాంటి విపత్తులనైనా సులువుగా ఎదుర్కోగలుగుతున్నామని సంబురపడుతున్నాం. అభివృద్ధి పేర కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్న విషయాన్ని గ్రహించలేకపోతున్నాం.

భూతాపం పెరగటానికి పారిశ్రామికీకరణ కారణమైనప్పటికీ ప్రపంచీకరణ, సరళీకరణ తర్వాత గ్రీన్‌హౌజ్ వాయు ఉద్గారాల విడుదల అనూహ్యంగా పెరిగింది. ప్రకృతి వనరులను ఎంతవీలైతే అంత తొందరగా కొల్లగొట్టి సంపద సృష్టించుకోవడంపైనే ప్రపంచ దేశాలన్నీ పోటీ పడుతున్నవి. వేల సంవత్సరాలు మానవ అవసరాలకు పొదుపుగా వినియోగించుకోవలసిన ఎంతో విలువైన, పునరుత్పత్తికి వీలుకాని ప్రకృతి వనరులను, శిలాజ ఇంధనాలను సంపద సృష్టి పేర విచ్చలవిడిగా

వాడుతున్నారు. అవసరం ఉన్నా లేకున్నా వస్తువులను ఉత్పత్తి చేసి ప్రపంచాన్ని అంతా వ్యాపారమయంగా, దేశాలను లాభాలు తెచ్చిపెట్టే మార్కెట్లుగా మారుస్తున్నాయి. లాభాల పేర కనీవిని ఎరుగని రీతిలో ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ప్రజలలో వినిమయతత్వం పెంచి వారిని వినియోగదారులుగా మారుస్తున్నారు. There is enough for every man's need but not every man's greed అని గాంధీజీ ముందుచూపుతో చెప్పారు. గాంధీజీ ఆదర్శాలన్నీ ఆచరణయోగ్యమైనవి కావని కొట్టిపారేయడం కూడా ఒక ఆదర్శంగా మారినట్లంది. సృష్టించబడుతున్న ఈ సంపద కచ్చితంగా మానవ, విశ్వ కల్యాణానికి వినియోగిస్తారని నమ్మకం లేదు. అది కొన్ని ధనిక దేశాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించుకోవడానికి మాత్రమే వినియోగపడుతున్నది.

ఈ రోజు ప్రపంచంలో ఆయుధ వ్యాపారం అగ్రదేశాలకు ఒక ప్రధాన ఆదాయ వనరుగా మారింది. వర్ధమాన దేశాలు అభద్రతా భావానికిలోనై లక్షల కోట్లు ఖర్చుపెట్టి ఆయుధాలు కొనుగోలు చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. Stock Holm international peace research institute అంచనా ప్రకారం ఆర్థిక సంవత్సరంలో ఆయుధాల తయారీకి, కొనుగోలుకు ప్రపంచ దేశాలు ఖర్చుపెట్టిన మొత్తం వ్యయం 1.776 బిలియన్ల అమెరికన్ డాలర్లు. ఇండియన్ కరెన్సీ ప్రకారం 118 లక్షల కోట్లు. ఇందులో అమెరికా 610, చైనా 216, రష్యా 84.5, సౌదీ అరేబియా 80.8, ఫ్రాన్స్ 62.3, బ్రిటన్ 60.5, ఇండియా 50 బిలియన్ డాలర్లు రక్షణ రంగానికి ఖర్చు పెడుతున్నాయి. అంటే ఒక అమెరికానే ప్రపంచ రక్షణ వ్యయంలో మూడవ వంతు ఖర్చు పెడుతున్నది. పెద్దఎత్తున ఆయుధ వ్యాపారం చేస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా ఇంతగా తయారు చేయడానికి ఎంత కర్బన ఉద్గారాలు వాతావరణంలోనికి విడుదల చేయబడుతున్నాయో ఊహకందని విషయం. అదే విధంగా అవసరాల మేరకు ఉత్పత్తి చేసుకోవల్సిన వస్తువులను లాభాల పేరిట అవసరానికి మించి తయారుచేసి మార్కెట్లను నింపేస్తున్నారు. పోనీ పది కాలాలపాటు నాణ్యమైన వస్తువులను తయారు చేస్తున్నారా అంటే అదీ లేదు. దైనందిన జీవితంలో వాడే ప్లాస్టిక్ కుర్చీ నుంచి మొదులుకొని సెల్‌ఫోన్ల వరకు వేటికీ నాణ్యత ఉండటం లేదు. ఈ వస్తువులకు స్వల్ప మార్పులు చేసి, ఆకర్షణీయమైన సృజనాత్మకతను జోడించి వినియోగదారులచే మళ్లీ మళ్లీ కొనిపిస్తున్నారు. వినియోగించు – పారేయి అనే వ్యాపార సూత్రాన్ని పాటిస్తున్నారు. ఈ రకంగా అమూల్యమైన, పునరుత్పత్తి కాని ముడి పదార్థాన్ని వృథా చేస్తున్నారు. దీని వల్ల ఎంత పరిమాణంలో కర్బన ఉద్గారాలు విడుదలవుతున్నాయో గమనించడం లేదు.

భూతాపం పెరగడానికి, పరిసరాలు కాలుష్యం చెందడానికి జనాభా పెరుగుదల కూడా ప్రధాన కారణమే. ప్రపంచమంతా విజ్ఞానమయంగా మారుతున్నందువల్ల జనాభా పెరుగుదల బాగా తగ్గింది. కానీ తగ్గవలసింతమేర తగ్గటం లేదు. అసలు ప్రపంచంలోని వనరులు, ఎంత జనాభాకు సరిపోతాయో ఇంతవరకు సరైన అంచనా లేదు. అంతర్జాతీయంగా జనాభా నియంత్రణకు దిశానిర్దేశం చేయగల ఒక సమగ్ర ప్రణాళిక ఉన్నట్లు కనబడదు. పశ్చిమదేశాలలో మాత్రం జనాభా నియంత్రణలో ఉన్నట్లు కనపడుతున్నది. కాని ఆసియా దేశాలలో ఈ సమస్య తీవ్రమవుతున్నది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే జనాభా సమస్యతో ఇబ్బంది పడుతున్న వర్ధమాన దేశాలకంటే అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలలోనే కర్బన ఉద్గారాలు ఎక్కువ విడుదలవుతున్నాయి. ఆసియా దేశాలలో జనాభా నియంత్రణ పద్ధతులను కచ్చితంగా అమలు చేయడం ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోయినప్పటికీ one or none అనే విధానాన్ని అమలు చేయడానికి గట్టి ప్రయత్నం చేయాలి. కమ్యూనిస్ట్ దేశమైన చైనా single child విధానాన్ని అమలు పరిచి జనాభా నియంత్రణకు చర్యలు తీసుకున్నది. ఈ మధ్యనే ఈ విధానాన్ని సడలించింది. ఈ విధానాన్ని సడలించడానికి ప్రధాన కారణం తన దేశ స్వయం పోషకత్వం దెబ్బతింటుందని కాదు. దేశంలో యువత సంఖ్య తగ్గి తద్వారా ఆర్థిక వృద్ధిరేటు తగ్గుతుందన్న ఆందోళనతో ఈ విధానాన్ని సడలించింది.

భూతాపాన్ని తగ్గించడానికి ఫ్రాన్స్‌లో జరిగిన ప్రపంచ దేశాల సదస్సులో జనాభా నియంత్రణ గురించి చర్చ జరగకపోవడం గమనార్హం. ఈ సమస్యపై అంతర్జాతీయంగా ఒక విధానాన్ని రూపొందించుకొని దాన్ని అమలు చేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకోకపోతే మాల్థస్ చెప్పినట్లు ప్రకృతే జనాభా నియంత్రణకు పూనుకునే అవకాశం ఉన్నది. అదే విధంగా మానవ తప్పిదాల వల్ల సంభవించే ఉత్పాదాల వల్ల మానవ మనుగడ తీవ్రమైన ప్రమాదంలోకి నెట్టివేయబడుతుంది. అయితే ఫ్రాన్స్‌లో జరిగిన ప్రపంచ దేశాల సదస్సులో దేశాలన్నీ కలిసి భూతాపాన్ని 2 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలన్నఏకగ్రీవ తీర్మానానికి రావడం హర్షణీయం. దీనికి ప్రధానంగా శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ ఇంధన వనరులైన సౌర విద్యుత్, పవన విద్యుత్ ఉత్పత్తులపై దృష్టి సారించవలసిన అవసరం ఉన్నది. ఇప్పటికిప్పుడు ఈ వనరులను అందుబాటులోకి తీసుకొని రావడం అంత సులువు కాదు. దానికి అనుకూలమైన సాంకేతిక పరిజ్ఞానం ఇంకా అభివృద్ధి కాలేదు. గ్రీన్‌హౌజ్ వాయువులను తగ్గించుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలంటే అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి దేశాలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాలు శిలాజ ఇంధనాలు విచ్చలవిడిగా వాడుకొని ఇప్పటికే అభివృద్ధిని సాధించాయి. ఈ కారణంగా విడుదలైన కర్బన ఉద్గారాలు ఇప్పటికే పర్యావరణానికి తీవ్రమైన హాని కలిగించాయి. అందువల్ల భూతాపం తగ్గించడానికి అవి వర్ధమాన దేశాలకు పెద్ద ఎత్తున నిధులు, పర్యావరణ అనుకూల సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చవలసిన అవసరం ఉన్నది. పారిస్ ఒప్పందం ప్రకారం అగ్రదేశాలపై 2020 నాటికి 100 బిలియన్ డాలర్ల నిధులను సమకూర్చవలసిన బాధ్యత ఉంది. ఈ నిధులు ఏ మూలకు సరిపోవు. 2100 నాటికి భూతాపాన్ని 2 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలంటే నిధులను బాగా పెంచవలసిన అవసరం ఉన్నది. పర్యావరణ కాలుష్యానికి ఏ దేశాలు ఏ మేరకు కారణం అయ్యాయో ఆ మేరకు నిధులు సమకూర్చవలసిన బాధ్యతను పారిస్ ఒప్పందంలో చేరిస్తే బాగుండేది. పారిస్ ఒప్పందంలో వివిధ దేశాలు భూతాపాన్ని తగ్గించడానికి రూపొందించుకొన్న ప్రణాళికలకు చట్టబద్ధత లేకపోవడం ప్రధాన లోపంగా కనపడుతున్నది. ఈ ప్రణాళికల అమలుకు కూడా నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక లేదు. ఐరాస ఆధ్వర్యంలో సదరు దేశాల ప్రణాళికల అమలును పర్యవేక్షించవలసిన అవసరం ఉన్నది. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతాయని ఆశిద్దాం.

– ఏక్టివిస్టు



# గ్రామీణాభివృద్ధిలో సాంకేతిక సౌకర్యాలు

నేడు భారత గ్రామీణ వ్యవస్థలో సాంకేతిక అభివృద్ధి ప్రముఖ పాత్ర పోషిస్తుంది. గతంలో కమ్యూనికేషన్ చేరాలంటే రోజులు పట్టేది. కాని నేడు క్షణాలలో సమాచారం చేరవేయడం జరుగుతుంది. నేడు భారతదేశంలో 92 కోట్ల మందికి సెల్‌ఫోన్లు అందుబాటులో కొచ్చాయి. అందులో 40 కోట్ల మందికి రెండు కంటే ఎక్కువ సెల్‌ఫోన్లు వాడుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. దానితో సమాచారం క్షణాలలో చేరుతుంది. ఉదా ఈశాన్య భారత రాష్ట్రమైన మిజోరంలో భూకంపం సంభవించిన వెంటనే విజయవాడ, హైదరాబాద్‌లో ఉన్న వారికి తెలిసిపోయింది. ఎందుకంటే ఆంధ్ర కంపెనీలు రోడ్ల నిర్మాణం, టెలిఫోన్లు, కమ్యూనికేషన్ అభివృద్ధిరంగంలో పనిచేస్తున్నాయి. దాని వలన మన వారుసురక్షితంగా ఉన్నారని తేలింది. మరో విధంగా కూడా కమ్యూనికేషన్స్ గ్రామాలకు చేరుతుంది. ఇంటర్‌నెట్ కనెక్షన్ ద్వారా దేశాలలో నలుమూలలో ఏమి జరుగుతుందో తెలిసిపోతుంది. సోషల్ మీడియా, ఫేస్‌బుక్, గూగుల్, ఇతర సాధనాల ద్వారా సమాచారం ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు చేరుతుంది.

కుటుంబాలకు సెల్‌ఫోన్లు అవసరమే. కాని కుటుంబానికి సెల్‌ఫోన్ అందుబాటులోకి రావడం వలన మానవ సంబంధాలు మట్టి కలుస్తున్నాయని ఒక తరం వారు వాపోతున్నారు. సెల్‌ఫోన్ అందుబాటులోకి రావడం వల్ల ప్రత్యక్షంగా మాటలు, చర్చలు కరువైపోయినాయి. మధ్య మాటలు కరువైపోయాయి. గ్రామాల్లోని కుటుంబ సంబంధాలు దెబ్బతింటున్నాయి. కుటుంబాలకు ఆదరణ లేకుండాపోతోంది. ఫోన్‌లో మాట్లాడుకుంటే సరిపోతుంది, ఇంటికి వెళ్లి సమయాన్ని వృధా చేయడం ఎందుకనే ఆలోచనకు వస్తున్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం వలన లాభం, నష్టం రెండూ ఉంటాయని గ్రహించాలి. గ్రామాలలో అంత అవగాహన ఉన్న వారు తక్కువ. కనుక సమస్యలను వివరించి చెప్పేవారు దొరకరు. దానితో గ్రామీణ ప్రజలు ఏది నిజం? ఏది అపకారం చేస్తుందో తెలియక నిస్తేజంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో జరిగే నష్టం వాటిల్లేది వాటిల్లుతుంది.

ఇక టెలివిజన్ విషయానికి వస్తే అది ప్రచార సాధనమే కాకుండా సామాన్య ప్రజానీకానికి ఉపయుక్తమైన ఎన్నో రకాల సమాచారాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుంది. ఆరోగ్య అంశాలు, విద్యా విషయక అంశాలు, సాంస్కృతిక అంశాలు, వ్యవసాయ సూచనలు, ప్రభుత్వ పథకాలు, వాతావరణ సూచనలు, ఇత్యాది ఎన్నో అంశాలలో విలువైన సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు అందిస్తోంది. కాని కొన్ని దుష్ఫలితాలు కూడా సంభవిస్తున్నాయి. టెలివిజన్ ప్రకటనలు నమ్మి మోసపోయే వాళ్లు ఎక్కువవుతున్నారు. దాన్ని కౌంటర్ చేయాల్సిన ఆవశ్యకత ఉంది. టెలివిజన్ పట్టణాలను దాటి గ్రామాలకు చేరింది. అందుకు కారణం సాంకేతిక అభివృద్ధిలో భాగమైన టెలివిజన్, కేబుల్ నెట్‌వర్క్‌ల ద్వారా సినిమాలు, సీరియళ్లు చూసి అవే నిజమని నమ్మే మహిళలు అధికమైపోయారు. టెలివిజన్ ప్రసారాలు చేయడం వలన మేలుకంటే కీడు ఎక్కువగా జరుగుతుంది. మన టెలివిజన్‌లో ప్రసారమవుతున్న సీరియల్స్‌లో స్త్రీ–పురుషుల మధ్య అక్రమసంబంధాలు, సంతానం తదితర అంశాలను

సీరియల్‌గా చూపడం వలన అవే నిజమనుకొని అన్నాదమ్ముల సంబంధాలు, భార్యభర్తల సంబంధాలు, అత్తాకోడళ్ల సంబంధాలు దెబ్బతిని ఉమ్మడి కుటుంబం అనేదానికి తూట్లు పొడుస్తుంది. టెలివిజన్‌లో ప్రసారమయ్యే అంశాలు వాస్తవానికి దగ్గరగా ఉన్న కొన్ని చెడు అంశాలను ప్రాముఖ్యత ఇవ్వడంతో మరింత అవి చదువురాని వారిపై మరింత ప్రభావాన్ని చూపుతున్నాయని నిపుణులు వివరిస్తున్నారు. ఎక్కడో ఒక సంఘటనను చెడు టెలివిజన్‌లో మరీమరీ చూపించడం వలన దృఢమైన మనస్సు లేనివారు ప్రభావితం అవుతున్నారు. మహిళలు ఆ సీరియల్స్ వచ్చే సమయంలో పిల్లలను, భర్తలను ఇంటి పనులకు స్వస్తి చెప్పి టెలివిజన్ ముందే అతుక్కుపోయి చూస్తున్నారు. ఇంట్లో వారి మధ్య వచ్చేవారం ఏం జరుగుతుందో అనే చర్చలకు దారితీస్తుంది. చదువుకోని ఆడవారు కూడా ఆ సీరియల్స్‌ను కోట్ చేస్తూ మాట్లాడుతున్నారు. కేబుల్ టెలివిజన్‌లో ప్రసారాలలో చూసి కష్టపడకుండా డబ్బులు సంపదించడం ఎలా? అనే వికృత ధోరణులకు యువత పాల్పడుతుంది. టీవీలలో ప్రకటనలు చూపి అవే కావాలని యువత వాటిని సంపాదించేందుకు అక్రమ పద్ధతులు దొంగతనాలకు  పాల్పడుతున్నారు. కొంతమంది యువత సినిమాల కోసం ముంబాయి, హైదరాబాద్‌లకు చేరుకొని అన్నీ



పోగొట్టుకుంటున్నారు. దీని వలన గ్రామాల సంపద పట్టణాలకు చేరడం పట్టణాల్లో సుఖజీవితం లభిస్తుందని ఆశతో తరలిపోవడం జరుగుతుంది. అంటే టెలివిజన్ ప్రకటనలు గ్రామీణుల మధ్య ఎంత ప్రభావాన్ని చూపుతున్నాయో ఇట్టే అర్థమైపోతున్నది.

మహిళలో ధనికులు అవలంబించే పద్ధతులు, అలవాట్లు నిజమని నమ్మి తమ కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకొంటున్నారని పలు సోషల్ సర్వేలు వెల్లడిస్తున్నాయి. గ్రామాల్లోని ధనికులకు, రాజకీయ నాయకులకు పెద్ద కుటుంబీకులకు చుట్టుపక్కల గ్రామాలలో పలుకుబడి, మద్దతు కోసం సంబంధాలు కొనసాగించడం అతిసహజం. చాలా మంది దానిని అనుకరించి అక్రమ సంబంధాలకు పాల్పడి వారి నిజజీవితాన్ని పాడు చేసుకొంటున్న కుటుంబాలు న్యూక్లియస్ కుటుంబాలుగా మారుతున్నాయి. కుటుంబంలో పెద్దవారిని గౌరవించడం తగ్గిపోయింది. ఈర్ష్య ద్వేషాలకు దారితీస్తూ, వారికి ఉన్నది మాకు లేదనే చింతన వ్యధతో సంబంధాలు దెబ్బతింటున్నాయి. సాంకేతిక లింకుతో గ్రామాలు స్వయం సమృద్ధి పెరిగి మరిన్ని సౌకర్యాలు గ్రామాలకు చేరి గ్రామీణులకు మరింతగా ఉపయోగపడాలని ఆశించడం తప్పుకాదు. కమర్షియల్ కంప్యూటర్స్ బ్యాంకింగ్ చెల్లింపులు, ఖాతాల ద్వారా వెసులుబాటు కలిగిన జీవితం సుఖమయమవుతుంది. గ్రామీణులకు నిధులు, ప్రభుత్వం కల్పించే వసతులు పెన్షన్స్, పంపిణీ సక్రమంగా జరిగి కంప్యూటర్స్ ద్వారా అవినీతి జరగకుండా దోహదపడవచ్చు.

ఈ సాంకేతిక అభివృద్ధి ద్వారా సాంఘిక సంబంధాలు ఘర్షణలకు, విరోధాలు అధికమై కక్షలు కార్పణ్యాలకు దారితీస్తున్నాయి. అంటే సాంకేతిక అభివృద్ధి సమాచారంతో పాటు చేటును కూడా అధికం చేస్తుందనటంలో సందేహం లేదు. సోషల్ మీడియా గ్రామాలలో నివసించే యువతకు పెరాశలు చూపి పక్కదారి పట్టిస్తుంది. అంటే సోషల్ మీడియా ద్వారా గ్రామాలలో సంపద పట్టణాలకు చేరడానికి దోహదపడుతుందని చెప్పవచ్చు. సోషల్ మీడియా మార్కెటీకరణ పేరుతో షాపింగ్‌మాల్స్, చీరలు, వస్తువులు, చైనాబజార్ లాంటి సంస్థలు బడా కంపెనీలు, ఆటోమొబైల్ కంపెనీలు గ్రామాలకు తెచ్చి కూడళ్లు పెట్టి అమ్మకాలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర మోటారు సైకిళ్లు, త్రిచక్ర ఆటోలు, వాటి వెనుక మైక్రోఫైనాన్స్ పేరుతో వడ్డీ వ్యాపారులు గ్రామాలలో ప్రవేశించి అప్పులు ఇస్తున్నారు. ఈ మైక్రోఫైనాన్స్ వారి వడ్డీ బ్యాంకు వడ్డీకంటే రెండు మూడువంతులు ఎక్కువ ఉంటుంది. దానిపై మరల చక్రవడ్డీ తీసుకొన్న అప్పు తీరకపోగా వడ్డీ అసలు కంటే మూడింతలు చెల్లించవలసి వస్తుంది. ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా అన్ని చెల్లించాలి. లేకుంటే ఇచ్చిన వాహనాన్ని ఇఎంఐ కట్టలేదన్న నెపంతో జప్తు చేయడం జరుగుతుంది. మైక్రోఫైనాన్స్ వారు అప్పిచ్చేటప్పుడు అప్పు తీసుకొనేవరకు మాటలతో ఊరించడం జరుగుతుంది. అప్పు వసూలు చేసేటప్పుడు కఠినంగా వ్యవహరిస్తారు. ఉదాహరణకు కాల్‌మనీ వ్యవహారాన్నే తీసుకోవచ్చు.

సాంకేతికంగా కంపెనీలు సౌకర్యాలను గ్రామాలకు చేర్చి అవసరం లేకున్నా గ్రామీణులకు అంటగట్టి సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తాయి. అదే జరిగి గ్రామసంపద గ్రామాల నుండి తరలిపోతుంది. గ్రామాలు వట్టిపోతున్నాయి. గ్రామీణులు సుఖసంపదలు పొందే స్థితి కోల్పోతున్నారు. గ్రామాలలో పంపుసెట్లకే విద్యుత్ కొరత అనుకొంటే ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, టెలివిజన్స్ సెల్‌ఫోన్‌ల వలన విద్యుత్ వినియోగం రెండింతలవుతుంది. ఏ విధంగా చూసినా ఆధునిక వసతుల సదుపాయాల వలన మనిషికి ఉపయోగం అందేది కొంతైతే వృధాగా వ్యయం అయ్యేది ఎక్కువగా ఉంటుంది. ఆ విధంగా గ్రామ సంపద గ్రామాల నుండి తరలిపోతుంది. మరి కొందరు గ్రామాలను వదిలి విదేశాలకు ఎగబాగటంతో విదేశాల నుండి వచ్చే డబ్బులు ఆధునిక సౌకర్యాల కోసం వెచ్చించిస్తున్నారు. ఈ విధంగా సాంకేతిక అభివృద్ధితో లాభనష్టాల మధ్య గ్రామీణుల జీవితాలు సాగుతున్నాయి. గ్రామాలలో సాంకేతికత వలన అశాంతి ప్రబలుతుందే కాని మంచి అతి తక్కువగా జరుగుతుంది. పట్టణాలలో ఉండే అవలక్షణాలు గ్రామాలకు చేరుతూ కుటుంబ వ్యవస్థ మీద పడుతుండడంతో కుటుంబ వ్యవస్థ కూలిపోయే ప్రమాదం ఉంది. ప్రతిది డబ్బుతో పోల్చుకోలేము. డబ్బుకంటే మానవ విలువలే ప్రధానం. డబ్బు శాశ్వతం కాదు. శాంతి, విలువలు, సంప్రదాయాలు ప్రధానం. కనుక మంచి పద్ధతులను నిలదుకునేటట్లు ప్రతి ఒక్కరూ పాటుపడాలి. అప్పుడే సుఖశాంతులు ఉంటాయి.

– సిఎంపి



# అధిక లాభాలను అందించే పాల పుట్టగొడుగుల పెంపకం

గ్రామీణ ప్రాంతాలే కాదు ఇప్పుడు నగర వాసులకు కూడా మంచి ఉపాధినిచ్చే పరిశ్రమగా పుట్టగొడుగుల పెంపకం విస్తరిస్తుంది. ఎంచుకున్న స్థలం, పెంచే బెడ్ల సంఖ్యను బట్టి పుట్టగొడుగుల ద్వారా నెలసరి ఆదాయం ఉంటుంది. మార్కెట్ డిమాండ్ పెరగటంతో సంవత్సరం పొడవునా వీటి ద్వారా ఆదాయం పొందే వీలుంటుంది. పుట్టగొడుగులు అనేవి శిలింధ్రపు జాతికి చెందిన చిన్న మొక్కలు. వీటిలో హరిత పదార్థం ఉండదు. కాబట్టి వాటికి కావలసిన ఆహారాన్ని అవి తయారు చేసుకోలేవు. ఇవి వాటి పెరుగుదలకు వృక్ష సంబంధిత పదార్థాలు నుంచి ఆహారాన్ని పొందుతాయి. వీటిలో అధిక శాతం ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్లు ఉంటాయి. పిండి పదార్థం అసలు ఉండకపోవటం వీటి ప్రత్యేకత. విటమిన్లు ఖనిజ లవణాలు అధికంగా ఉన్నందువలన పోషక ఆహారలేమితో బాధపడే మహిళలకు, పిల్లలకు, గుండెజబ్బు ఉన్నవారికి ఇవి మంచి ఆహారం. వీటి పెంపకాన్ని ఒక కుటీర పరిశ్రమగా చేపట్టి ఉపాధి పొందవచ్చు. పుట్టగొడుగులలో ప్రధానంగా అయోస్టర్ పుట్టగొడుగులు, పాలపుట్టగొడుగులు వేసవిలో వరిగడ్డి పుట్టగొడుగులను ఎక్కువగా పెంచుతారు. వీటిలో పాలపుట్టగొడుగులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. స్వయం ఉపాధి పరిశ్రమగా దీని పెంపకాన్ని ఎవరైనా చేపట్టవచ్చు. చదువులేని వారు కూడా చేపట్టవచ్చు. పుట్టగొడుగుల పెంపకం అతి తక్కువ పెట్టుబడి నుంచి వ్యవసాయ అనుబంధ పరిశ్రమగా సూక్ష్మతరహా నుంచి మధ్య తరహా పరిశ్రమగానూ పెద్దఎత్తులో కూడా పెంచడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. మనం పెట్టే పెట్టుబడిని బట్టి, మనం తీసుకునే జాగ్రత్తలను బట్టి ఈ పుట్టగొడుగుల పెంపకంలో లాభాలను అర్జించవచ్చు.

బటన్ పుట్టగొడుగులు పెంచాలంటే భారీ పెట్టుబడితో కూడుకున్న పని. అలాగే ముత్యపు చిప్ప పుట్టగొడుగుల పెంపకం ఆశాజనకంగా ఉన్నా ఇది నిల్వ చేయటానికి పనికి రావు. దీని వలన మార్కెట్‌లో డిమాండ్ తక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పొడవుగా పెరిగి బటన్ మాదిరి కనిపించే పాల పుట్టగొడుగుల పెంపకానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. పాలపుట్టగొడుగులను పెంచటానికి చాలామంది రైతులు ముందుకు వస్తున్నారు. ఎందుకనగా ఇది 30-32$^0$c లేదా 30-35$^0$c ఉష్ణోగ్రత వద్ద కూడా చాలా పెరుగుతుంది. అంతే కాకుండా దాదాపు వారం రోజుల వరకూ నిల్వ చేసుకోవచ్చు. అందువలన చాలా మంది కోస్తా ప్రాంతాలలో ఉన్న వారు మరియు ఉష్ణోగ్రత అధికంగా ఉన్న ప్రాంతాల వారు దీనిని పెంచటానికి ఉత్సాహం చూపిస్తున్నారు.

పాలపుట్టగొడుగుల ఉత్పత్తికి 60 రోజులు పడుతుంది. బెడ్లు నింపిన తరువాత రెండు దశలుగా వీటిని పెంచవలసి ఉంటుంది. మొదటిదశలో 15-20 రోజుల వరకు చీకటి గదిలో పెంచవలసి ఉంటుంది. ఆ తరువాత పంటవచ్చేదశలో వెలుతురు ఉన్న గదికి మార్చవలసి ఉంటుంది. వీటిని చిన్న చిన్న గదులలో లేదా హరిత గృహాలలో కూడా పెంచుకోవచ్చు.

వీటి పెంపకానికి గాలి, వెలుతురు, ఉష్ణోగ్రతలు చాలా అవసరం. ఒక్కొక్క బెడ్‌కు 1-1.5 అడుగుల స్థలాన్ని కేటాయించాలి. ఈ స్థలంలో 60-70 బెడ్లు ఒక వరుసలో పెట్టుకోవడానికి వీలుంటుంది. నేల మీద పెట్టే పద్ధతిలో ఒక్క వరుసలోనే బెడ్లు పెట్టడానికి అవకాశం ఉంటుంది. అలా కాకుండా వ్రేలాడదీసే పద్ధతి లేదా రాక్స్ పద్ధతిలో పై కప్పు ఎత్తును బట్టి 5 నుంచి 6 వరుసలు పెట్టుకోవచ్చు. ఈ విధంగా 10×10 చదరపు

అడుగులు ఉన్న గదిలో 250 నుంచి 300 బెడ్లు ఒక్కొక్క వరుసకి 50-60 బెడ్లు చొప్పున పెట్టుకోవచ్చు. బెడ్‌కు బెడ్‌కు మధ్యన కొంత స్థలాన్ని కూడా వదలాలి. పాల పుట్టగొడుగుల ఎదుగుదల దశలో లేదా ఇంక్యుబేషన్ దశలో గదిలో ఉష్ణోగ్రత $28-32^{0}$c గాలిలో తేమ 70 శాతం తప్పనిసరిగా ఉండేటట్లు చూసుకోవాలి. ఈ విధానంలో బెడ్లను మధ్య మధ్యలో గమనిస్తూ ఉండాలి. క్రాపింగ్ దశలో ఉన్నపాలపుట్టగొడుగులకు ఇంక్యుబేషన్ దశలో ఉన్న ఉష్ణోగ్రత కంటే 2 నుంచి $3^{0}$c ఉష్ణోగ్రత తగ్గాలి. గాలిలో తేమ శాతం 85 నుంచి 90 శాతం వరకూ పెంచాలి. దీనికి అనుగుణంగా వేడి చేసే మిషన్లు లేదా వేడి గాలిని గదులలోనికి పంపి వీటిని తగిన విధంగా పెంచటానికి ఆస్కారం ఉంటుంది. మొదటి ఇంక్యుబేషన్ దశ 15 నుంచి 20 రోజులు ఉంటుంది. ఆ తరువాత మరొక 10 నుంచి 15 రోజులలో పుట్టగొడుగులు కొత్త దశకు చేరతాయి. పాల పుట్టగొడుగుల పెంపకానికి సుమారుగా 2 నెలలు సమయం పడుతుంది. కాబట్టి సంవత్సరంలో 6సార్లు పుట్టగొడుగులను పెంచవచ్చు.



పాలపుట్టగొడుగుల పెంపకంలో బెడ్లు తయారు చేయడం చాలా ముఖ్యమైనది. శిలింధ్రం పట్టించిన విత్తనాన్ని స్పాన్ అంటారు. పుట్టగొడుగుల రకాన్ని బట్టి ఈ విత్తనాలు లభ్యమవుతాయి. సాధారణంగా పాలపుట్టగొడుగుల పెరుగుదల వరిగడ్డిలో వేగంగా ఉంటుంది. బెడ్లు తయారుచేసేటప్పుడు నియమానుసారంగా వనరుల ఎంపికతో పాటు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.

పుట్టగొడుగుల పెంపకం చేపట్టే ముందు మొదట తగినవాతావరణ పరిస్థితులు కల్పించుకోవాలి. లేదా బెడ్లు తయారు చేసే ముందుగా పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలి. గడ్డిని ఆరబెట్టే ముందు కూడా స్పిరిట్ కలిపిన నీటిని గాని గదిలో పిచికారి చేసి గడ్డి ఆరబెట్టిన తరువాత బెడ్లు పెట్టేటప్పుడు చేతులను స్పిరిట్ నీటితో లేదా సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.

**పుట్టగొడుగుల పెంపకానికి అవసరమైనవి:**

గడ్డి (గోధుమరంగులో ఉన్న గడ్డిని ఎంచుకోవడం మంచిది). ఈ గడ్డిని ముక్కలు ముక్కలుగా చేసి లేదా ముక్కలు చేయకుండా కూడా ఉపయోగించవచ్చు. ఈ రకమైన గడ్డిని సుమారు 6 నుంచి 8 గంటలు నీటిలో నానబెట్టాలి. ఈ విధంగా చేయటం వలన గడ్డి కొంచెం మెత్తగా తయారవుతుంది. తరువాత గడ్డిని డ్రమ్ములలో వేసి 1 లేదా 2 గంటలు ఉడకబెట్టాలి. తరువాత గడ్డిని నీడలో ఆరబెట్టి ఎక్కువ శాతం తేమ, నీరు లేకుండా జాగ్రత్త వహించాలి.

స్పాన్ అనేది బూజులాగ ఉంటుంది. దీనిని జొన్నలలో గాని గోధుమలలో గాని ఈ శిలింధ్రమును విత్తనానికి పట్టించి స్పాన్‌గా తయారు చేస్తారు. ఈ విత్తనం 1 కిలో 80 రూపాయలు వరకు ప్రభుత్వ సంస్థలలో లేదా పరిశోధనా స్థానాలలో కాని లభ్యం అవుతుంది.

ఈ పాల పుట్టగొడుగుల పెంపకానికి పాలిథిన్ సంచులను ఎంపిక చేసుకోవాలి. ఈ సంచుల యొక్క సైజు 14×20 లేదా 16×24 లేదా 18×27 అంగుళాలు ఉండాలి. క్రొత్తగా ప్రారంభించే రైతులు చిన్న సైజు సంచులలో అనగా 14×22 అంగుళాలు (100-120 గేజ్) ఉన్న సైజు సంచులను వాడటం మంచిది. ఈ సంచులను ఒక వైపున గుండు సూదిని ఉపయోగించి 7 నుంచి 8 వరుసలు రంధ్రాలు చేసుకోవాలి. సంచులకు ఒక వైపున రబ్బరుబ్యాండ్‌తో మూసివేయాలి. తరువాత 1 లేదా 2 అంచుల వరకూ గడ్డిని పరచాలి. పాలపుట్టగొడుగుల విత్తనాలను మధ్యలోను, చుట్టూ ఒక వరుసగా పరచాలి. గడ్డిని పొరలు పొరలుగా పరిస్తే పుట్టగొడుగులు తొందరగా పెరగటానికి ఆస్కారం ఉంటుంది. ఉదాహరణకు 18×27 అంగుళాల సైజు ఉన్న బెడ్డుకు 1 కిలో విత్తనం పడుతుంది. అదే విధంగా 16×24 అంగుళాల సైజు ఉన్న బెడ్డుకు 1 కిలో విత్తనాన్ని 6 నుండి 7 బెడ్లు వరకూ వేసుకోవచ్చు. గడ్డిని బెడ్లలో వరుసలు వరుసలుగా వేసిన తరువాత దీనిని రబ్బరుబ్యాండ్ లేదా తాడుతో సంచి పై భాగాన్ని మూసివేయాలి. ఈ విధంగా తయారు చేసిన బెడ్‌ను ఇంక్యుబేషన్ రూములో పెట్టాలి.

పాల పుట్టగొడుగుల పెంపకాన్ని నియమానుసారంగా చేపడితే ప్రతి బెడ్ నుంచి 1 లేదా 1.5 కిలోల పుట్టగొడుగుల దిగుబడిని పొందవచ్చు. శిలీంధ్రం బెడ్ మొత్తం వ్యాపించిన తరువాత దీనిని వెలుతురు ఉన్న గదికి తరలించే ముందు బెడ్ల మూతిని విప్పి పైన మట్టితో కప్పుతారు. దీనిని కేసింగ్ అంటారు. సాధారణంగా 14×20 అంగుళాలు ఉన్న బెడ్లు అయితే నేరుగా మూతిని విప్పి మట్టిని పైన చల్లి కప్పివేయాలి. ఈ విధానంలో పరిశుభ్రమైన మట్టిని ఎంపిక చేసుకుని వాడాలి. మట్టిని తయారు చేయటానికి 3 పాళ్లలో బంకమట్టి 1 పాళ్ళ ఇసుక లేదా కొబ్బరి పొట్టు తీసుకొని 1 లేదా 2 పాళ్ళ సున్నం కూడా కలిపితే మంచిది. ఈ మట్టిని ఉడికించి నీళ్లు కలపకుండా వాడుకోవటం మంచిది. తరువాత బెడ్‌ను క్రాపింగ్ రూమ్‌లోనికి మార్చి రోజూ నీటిని చిలకరించుకోవాలి. గదిలో వెలుతురు తప్పనిసరిగా ఉండేటట్లు చూసుకోవాలి. ఈ వెలుతురు అనేది నీలిరంగులో ఉంటే పుట్టగొడుగులు అందంగా పెద్దవిగా వస్తాయి. మొదటి కోత వారం రోజుల తరువాత వస్తుంది. మొదటి పంటలో 500 గ్రాములు, రెండవ పంటలో 300 గ్రామలు వస్తూ ఉంటాయి. పుట్టగొడుగులు పంట తీసేటప్పుడు కాండం పొడవుగా పెరిగే వరకూ ఉండకూడదు. మొదలు దగ్గర పట్టుకుని గుండ్రంగా త్రిప్పి పైకి తీసినట్లయితే సులభంగా పుట్టగొడుగులను సేకరించవచ్చు. ఈ తయారి విధానంలో ఒక్కొక్క బెడ్‌కు 50 రూపాయలు వరకూ ఖర్చు అవుతుంది. ఒక్కొక్క బెడ్‌కు 1 కిలో పుట్టగొడుగులను సాధిస్తే ఖర్చులు పోను 150-200 నికర లాభం పొందవచ్చు. అంటే పెట్టుబడికి 5 రెట్లు లాభం చేరుతుంది. అయితే పుట్టగొడుగుల దిగుబడి ఎంపిక చేసుకున్న గడ్డి మీద ఆధారపడి ఉంటుంది.

**– డా॥ ఆర్.సుభాష్‌రెడ్డి, డా॥ యస్.త్రివేణి, బి.ప్రసన్నకుమార్, వై.నాగరాజు, డి.మనోజ్‌కుమార్, మైక్రో బయాలజి విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్**



# మధ్యప్రదేశ్ పంచాయతీరాజ్ సంస్థల పరిశీలన

వివిధ రాష్ట్రాలలోని పంచాయతీ రాజ్ సంస్థలలో పనితీరు వివిధ పథకాల అమలు, పంచాయతీ సంస్థలలో సాంకేతిక పద్ధతులు, మరియు పారదర్శకతపై రాష్ట్ర పంచాయతీరాజ్ కమీషనర్ శ్రీమతి అనితా రామచంద్రన్ ఆదేశాల మేరకు ఆరుగురు సభ్యుల పరిశీలనా బృంధం మధ్యప్రదేశ్ వెళ్ళడం జరిగినది. ఈ బృందంలో బి.శేషాద్రి, సెంటర్ హెడ్, సి.డి.పి.& ఏ., జి.సూర్యారావు, స్పెషల్ ఆఫీసర్, గ్రామజ్యోతి, సుబ్రహ్మణ్యం అసిస్టెంట్ కమీషనర్, శ్రీ నారాయణరెడ్డి, హామీద్‌ఆలీ, రాజయ్య రాష్ట్ర (ఇ–పంచాయతీ పర్యవేక్షకులు) ఉన్నారు. ఈ బృందం జనవరి 27 వ తేదీ నుండి 31 వరకు మధ్యప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో విస్తృతంగా క్షేత్ర పరిశీలన జరపడం జరిగినది. ఈ మూడంచెల పంచాయతీ సంస్థలను పరిశీలించడం. అమలు అవుతున్న పథకాలు ఉ ద్యోగాల క్రూర్పు పరిశీలించడం జరిగినది.

ప్రతినిధి బృందం మొదట ఆ పంచాయితీరాజ్ డిప్యూటి కమీషనర్ శ్రీ వినోద్ యాదవ్‌ను కలిసి ఆ రాష్ట్రంలో అమలు ఆవుతున్న దర్పన్ కార్యక్రమం గురించి తెలుసుకోవడం జరిగింది. తరువాత NICకేంద్ర కార్యాలయంనకు వెళ్ళి NIC సాఫ్ట్‌వేర్ ఏలా పనిచేయుచున్నది ఏలా అమలు అవుతున్నది ఆ రాష్ట్ర డైరెక్టర్ వినాయకరావుగారిని కలిసి తెలుసుకోవడం జరిగింది. మధ్యప్రదేశ్ సచివాలయం నందు అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీమతి అరుణాశర్మను కలిసి ఆ రాష్ట్రంలో అమలు అవుతున్న వివిధ పథకాలను తెలుసుకోవడం జరిగింది.

మొట్టమొదట ఆ రాష్ట్రంలో అమలు అవుతున్న చేతిపంపుల పిర్యాదులు పరిష్కారాలకు (IVRS - Interactive Voice Response System) వాడకాన్ని పరిశీలించడానికి బానాపూర్ కంకడ్ వెళ్ళడం జరిగినది. చేతి పంపులు ఏవైనా పనిచేయకపోయినట్లై మొబైల్ ద్వారా ఫిర్యాదుచేస్తే 2 రోజులలో సమస్యల పరిష్కారం అవుతుంది. దీనికి టోల్‌ఫ్రీ నెంబరు ఇవ్వడం జరిగినది. దానిని నిర్వహించడానికి ప్రజారోగ్య ఇంజనీరింగ్ శాఖకు ఇవ్వడం జరిగినది. మొట్టమొదట ఫిర్యాదు మొబైల్ నెంబరు సమస్య ఫిర్యాదు చేసిన తర్వాత సమస్య నెంబరు ఇవ్వడం జరుగుతుంది. మళ్ళీ రెండు రోజుల తర్వాత సమస్య పరిష్కారం కాకపోతే ఫిర్యాదుదారులు మాట్లాడటం జరుగుతుంది.

ఈ విధంగా దీనిని పైలెట్ పథకం కింద ఖండ జనపద్ బ్లాక్ నందు అమలు చేస్తున్నారు.

ఆ గ్రామంలో (NWDP (National Water Development Plan) పథకం కింద 5000 లీటర్‌ల ట్యాంకు నిర్మించడం జరిగినది. దీనిని ఉ పగ్రహానికి లింక్ చేయడం జరిగినది. దీనివల్ల ఆన్ ఆఫ్ మానవ ప్రయత్నం లేకుండ జరుగుతుంది. దీనివల్ల నీటి వృధా జరగడంలేదు మరియు 24/7 సమయం నీరు ప్రతి ఇంటికి కుళాయిలు ద్వారా ఇవ్వడం జరుగుతుంది. 5000 కెపాసిటీ ట్యాంక్ ద్వారా 50 కుటుంబాలకు 4.87

లక్షల వ్యయం ద్వారా చేయడం జరిగినది. దీనికి 3% ప్రజల కంట్రిబ్యూషన్ కలదు. దీని నిర్వహణ గ్రామ కమిటీ ద్వారా జరుగుతుంది. ప్రతి ఇంటి వారు నెలకు 100/- చెల్లించుచున్నారు. 24 గంటలు కుళాయి ద్వారా నీటిని పొందుచున్నారు. దీనిని మొదట ఒక గ్రామంలో నిర్వహిస్తున్నారు. దీనిని విజయవంతమైన రాష్ట్రం మొత్తం విస్తరించే అవకాశాలు గాన్నాయి.

**గ్రామపంచాయతీ ఆర్థిక నిర్వహణ దర్పన్ కార్యక్రమం :-** దీనిని గ్రామపంచాయతీలలో ఆర్థిక నిర్వహణ పారదర్శకంగా ప్రతి పౌరుడు తెలుసుకోనడానికి ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామపంచాయతీకి ఒకే అకౌంట్ ఉంటుంది. దీనిని బ్యాంకుల ద్వారా నిర్వహిస్తున్నారు. దీని యందు 14వ ఫైనాన్స్, యస్.యఫ్.సి., సీనరేజ్, రాష్ట్ర ప్రభుత్వం గ్రాంటులు దీనిలో ఉండును. దీనిని పూర్తి ఆన్‌లైన్ నిర్వహించబడును. ఎవరైనా జరిగిన వ్యయం, దేనిపైన ఖర్చు పెట్టినది. ఎవరికి పేమెంట్ చేసినది తెలుసుకొనే వచ్చును. పనులపైన చేసిన వ్యయంనకు ఫోటోలు ఆన్‌లైన్ ద్వారా చూడవచ్చును. దీని ద్వారా ప్రతిఖర్చునకు పాలన అనుమతి, సాంకేతిక అనుమతి, వస్తువులు, స్టేషనరీ విక్రేత చిరునామా, ఆధార్ నెంబరు, టిన్ నెంబరు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. దీని ద్వారా పౌరులు చెల్లించినటువంటి పన్నులు నిర్ణీత పనులకు జరుగుతుంది లేనిది తెలుసుకొనవచ్చును.


దీని ద్వారా ఆడిట్‌నందు వ్యయంనకు ముందు వోచర్, వంటి చెక్‌మెజర్ ఆఫ్ లోడ్ చేయడం వల్ల ప్రతి సంవత్సరం నందు ఆడిట్ నందు రికార్డు సమర్పించకపోవడం అనే అభియోగం రాదు. దీనివల్ల ఆడిట్ అభ్యంతరంలు వచ్చే అవకాశాలు తక్కువ.

అంతేగాకుండ నిధులు పైద్వారా కల్పించబడినటువంటి ఆస్తులు రిజిష్టర్ నిర్వహించబడును. దీనిద్వారా వ్యయంపైన, నియంత్రణ ఉంటుంది. ఆస్తుల కల్పన జరుగుతుంది. దీనిని ఎన్.ఐ.సి. సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్వహించుచున్నారు.

**ఉపాధిహామీ పథకంలో పంచాయతీరాజ్ సంస్థల పాత్ర :-** ఉపాధి హామీనందు ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీని ద్వారా పంటపొలాలకు మొరం రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గృహనిర్మాణం, మంచినీటి భావులు, నిర్మించుచున్నారు. కూలీల







పరంగా చూస్తే మన రాష్ట్రంతో పోల్చితే కూలీలు చాలా తక్కువగా పనిచేయుచున్నారు. వ్యయం తక్కువగా ఉంది. కాని సుస్థిర ఆస్తుల కల్పనలో మన రాష్ట్రంతో పోల్చితే ముందున్నారు.

ఉపాధిహామీ పనులు వేరు, వేరు పథకాలతో జోడించి లేజర్, మెటీరియల్ 60:40 ద్వారా సి.సి.రోడ్లు నిర్మించుచున్నారు. గృహ నిర్మాణంనందు కేంద్రప్రభుత్వం పథకం ఇందిరా ఆవాస్ యోజన నందు ప్రతి గృహంనకు 70,000 ఉపాధిహామీనందు 30 పనిదినాలు, బేస్‌మెంట్ నిర్మాణం లాంటి పనులకు ఉపాధిహామీనుండి 14,000 మరియు స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద 12000 ఈ విధంగా వివిధ పథకాల ద్వారా ఒక్క గృహంనకు లక్ష రూపాయలు ఇవ్వడం జరుగుతుంది. ఈ ఆర్థిక సం॥లో 70,000 నిర్మాణాలు చేపట్టుచున్నారు. దీని ద్వారా గృహం నిర్మించుచున్నారు. దీని కొలతలు 15x14 sft. 210 sft. రెండు గదుల గృహం నిర్మించుచున్నారు.

**బహిరంగ మలవిసర్జనా రహిత జిల్లా ఇండోర్ :-** బహిరంగ మల విసర్జన రహిత జిల్లా అయినటువంటి జిల్లా అయిన ఇండోర్ పరిశీలించడం జరిగింది. జిల్లాల్లో మొత్తం 24,000 మరుగుదొడ్లు, 3-4 నెలల్లో నిర్మించడం జరిగింది. ప్రతి మరుగుదొడ్ల నిర్మాణం క్రింద ప్రభుత్వ నిధుల స్వచ్ఛ భారత్ నిర్మాణం మిషన్ ద్వారా చేపట్టడం జరిగింది. దీనిలో ఒక మరుగుదొడ్డి నిర్మాణానికి 12,000 రూపాయలు చెల్లించుచున్నారు. దీనిని రెండు విడతలలో ఇంటి యాజమాని బ్యాంక్ అకౌంట్ ద్వారా చేయడం జరిగినది. దేశంలో బహిరంగ మల విసర్జన రహిత రెండవ జిల్లాగా ప్రకటించబడినది. మొదట జిల్లా నాడియా పశ్చిమబెంగాల్ ప్రకటించడం జరిగినది.


ఆ జిల్లాలు బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా విజయం సాధించడానికి ప్రధాన కారణం గ్రామపంచాయతీలు క్రియాశీలకంగా వ్యవహరించడం. గ్రామంలో గల పంచాయతీ కార్యదర్శి, రోజ్‌గార్ సేవక్, అంగన్‌వాడీ కార్యకర్త, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు కలిసి సాధించడం జరిగినది. ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యం కూడా తోడ్పడింది.

**బి.శేషాద్రి, సెంటర్ హెడ్,**
**సి.డి.పి.&ఏ, టిసిపార్డ్.**

# తెలంగాణలో ప్రజాస్వామ్య పరిపాలన వికేంద్రీకరణకు అంకురార్పణ

## షాద్‌నగర్ పంచాయతీ సమితికి 1959లో నాటి ప్రధాని నెహ్రూ ప్రారంభోత్సవం

## ప్రజలు చొరవ చేసుకుని దేశాభివృద్ధికి పూనుకోవాలని నెహ్రూ ఉద్బోధ



*తెలంగాణ రాష్ట్రంలో 3 అంచెల పంచాయతీరాజ్ పాలన అక్టోబర్ 11, 1959 నుండే మొదలు అయ్యింది. 3 అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టిన రెండవ రాష్ట్రం మన రాష్ట్రమే. గాంధీ జయంతి, పంచాయతీరాజ్ వ్యవస్థల ఆవిర్భావంతో అక్టోబరు మాసం ఎంతో ప్రాధాన్యత సంతరించుకొన్నది. పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రారంభించిన నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి సంజీవరెడ్డిల ప్రసంగంలోని ముఖ్యాంశాలు పాఠకుల కోసం* **– ఎడిటర్**

హైదరాబాద్, అక్టోబర్ 11: పంచాయతీ సమితులూ, జిల్లా పరిషత్తుల కొత్త చట్టంప్రకారం మొట్టమొదటిదిగా ఏర్పడిన షాద్‌నగర్ పంచాయతీ సమితికి ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ ఇవాళ ప్రారంభోత్సవం చేయడంతో ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య పరిశీలన వికేంద్రీకరణకు నాంది అయ్యింది. సమాజ వికాస కార్యక్రమాలను అమలు జరిపే బాధ్యత, అభివృద్ధి శాఖ బాధ్యతలూ ఇక ఈ పంచాయతీ సమితికి మారుతవి.

ప్రతి గ్రామంలోనూ పాఠశాల, పంచాయతీ, సహకార సంఘం ఉండాలని చెబుతూ ప్రజాస్వామిక వికేంద్రీకరణ విధానాన్ని ప్రవేశపెట్టడంలో ముందంజ వేసినందుకు అప్పటి ఆంధ్రప్రదేశ్‌నూ, రాజస్థాన్ రాష్ట్రాన్ని శ్రీ నెహ్రూ అభినందించారు. హైదరాబాద్‌కు దాదాపు ముప్పై మైళ్ల దూరంలో ఉన్న షాద్‌నగర్‌కు ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ అభినందించారు.

హైదరాబాద్‌కు దాదాపు ముప్పై మైళ్ల దూరంలో ఉన్న షాద్‌నగర్‌కు ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ వెళ్లగానే ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి స్వాగతం చెప్పారు. దేశప్రజాస్వామ్య ప్రగతిలో ప్రధాన ఘట్టమైన పంచాయతీ సమితులూ, జిల్లా పరిషత్‌ల నిర్మాణ కార్యక్రమానికి ప్రధానమంత్రి నాందీప్రస్తావన చెయ్యడం హర్షించదగినదని గవర్నర్ భీమసేన్ సచార అన్నారు.

విజయదశమి నాడు ఈ ప్రజాస్వామిక వికేంద్రీకరణ ఈ రాష్ట్రంలో ప్రారంభమవుతున్నందుకు హర్షం ప్రకటిస్తూ ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ ఇట్లా అన్నారు.

'బ్రిటీష్ పాలన అంతమైన తరువాత భారత ప్రజల నూతన యాత్ర ప్రారంభమైంది. పరాయి ప్రభుత్వం, నిజామ్ రాజరికం అదృశ్యమై ప్రజాపరిపాలన ఏర్పడినది. దేశాభివృద్ధి కార్యక్రమాలూ, సమాజ వికాస కార్యక్రమాలూ కొంతకాలంగా దేశంలో కొనసాగుతున్నవి. కానీ వీటిలో ఇంతవరకూ అధికారులూ, ఉద్యోగులూ ప్రధాన బాధ్యతలు వహిస్తున్నారు. ఇకముందు ఈ కార్యక్రమాలను రూపొందించడంలోనూ, నిర్వహించడంలోనూ, ప్రజలే ప్రధానపాత్ర వహించవలసి ఉంటుంది. అధికారులు కేవలం ప్రజల సేవకులుగా ఉంటారు. ఈ ఆశయ సాధనకు అవకాశం కలిపించేందుకే పంచాయతీ సమితులను ఏర్పాటు చేస్తున్నారు.

పట్టణాలలో ప్రజలు సుఖంగా ఉండవలసింది గానీ, గ్రామాలు సస్యశ్యామలం గానూ, సౌభాగ్యవంతంగానూ ఉండకపోతే దేశాభ్యుదయమే జరగదు. పొలాల్లో, కర్మాగారాలలో ఉత్పత్తి వృద్ధిచెందాలి. కర్మాగారాలలో తయారవుతున్న వస్తువులు ప్రజలకు చాలా అవసరమైనవే కానీ వాటిని కొనేటందుకు ప్రజల వద్ద ధనం ఉండాలి. గ్రామాలలో మీరు ఎక్కువ పండిస్తే, మీకు కావలసిన వాటిని మీరు కొనగలుగుతారు. అయితే అధికోత్పత్తికి తోడ్పడే విద్య, పరిజ్ఞానం మీకు లభించాలి'.

### గ్రామగ్రామానికి పంచాయతీ, సహకార సంఘం

ప్రజాస్వామిక వికేంద్రీకరణ వల్ల గ్రామాలలోని ప్రజలపై గురుతరమైన బాధ్యతలు పడతాయి. వాటిని మీరు శ్రద్ధగా నిర్వర్తించాలి. ఢిల్లీలో లోక్‌సభ ద్వారానూ, హైదరాబాద్‌లో శాసనసభ ద్వారానూ ఇంతవరకూ ప్రజాస్వామ్య పరిపాలన కొనసాగినది. ఇక పంచాయతీ సమితుల ద్వారా స్వయంగా మీరే ఈ కార్యభారం వహించవలసి ఉంటుంది. ఇందుకోసం ప్రతి గ్రామంలోనూ పంచాయతీ ఏర్పాటు కావాలి.

గ్రామాలలో ఆర్థిక వ్యవహారాలన్నీ సహకార పద్ధతిలో జరగాలని మనకోరిక. ప్రతి గ్రామంలోనూ సేవా సహకార సంఘం ఏర్పడాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి సంఘాలకు ప్రాముఖ్యం ఇస్తున్నారని తెలిసి

సంతోషపడ్డాను. ఇవి జయప్రదం కావాలని కోరుతున్నాను. ఆర్థిక జీవితాన్ని సహకార పద్ధతిలో నడపడం సులభం కాదు. గ్రామంలో విద్యాలయం ఉంటే ప్రజలకు అవసరమయ్యే పరిజ్ఞానం లభిస్తుంది. అందుకే ప్రతి ఊళ్లోనూ పాఠశాల, పంచాయతీ, సహకార సంఘం ఉండాలి. వీటిని సాధించడం కోసమే పంచవర్ష ప్రణాళికలను రచించి అమలు చేస్తున్నాము. ఈ ప్రణాళిక రచనలోనే కాక నిర్వహణలో కూడా ప్రజలే ఇక బాధ్యత వహించవలసి ఉంటుంది. అధికారుల ద్వారా పని జరిపించే కాలం గతించినది.

### ఉమ్మడి సహకార వ్యవసాయం

చిన్న చిన్న భూమి ఖండాలున్న రైతులు ఖర్చులు కలిసి రావడానికి వీలుగా ఇష్టమైతే ఉమ్మడి సహకార వ్యవసాయ క్షేత్రంలో చేరవచ్చు. విధిగా చేరి తీరాలనే బలవంతమేమీ ఉండదని ప్రారంభోత్సవ సభలో ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ స్పష్టం చేశారు. ఇంకా ఇట్లా చెప్పారు: ఇష్టమైతే రైతులు తమంతట తాము ఉమ్మడి సహకార వ్యవసాయ క్షేత్రాలలో చేరవచ్చు. భూముల యాజమాన్యం హక్కును మార్చేది లేదు. సహకార వ్యవసాయ క్షేత్రంలో ఉండటం బాగా లేదని ఏ క్షణాన అనుకుంటే ఆ క్షణాన రైతులు బయటికి వచ్చే పూర్తి స్వేచ్ఛ ఉంటుంది.

### సంజీవరెడ్డి ప్రసంగం

జిల్లాకొకటి చొప్పున పంచాయతీ సమితులను తాత్కాలికంగా రాష్ట్ర ప్రభుత్వం కిందటి సంవత్సరం ఏర్పాటుచేసి, ఆయా ప్రాంతాలలో అభివృద్ధి పనులను అమలు జరిపే బాధ్యతలను 20 పంచాయతీ సమితులకు ఒప్పచెప్పిందని ప్రధానమంత్రికి స్వాగతం చెబుతూ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి అన్నారు. ఇంకా ఇట్ల చెప్పారు: 'తాత్కాలిక' పంచాయతీ సమితులు సంతృప్తికరంగా పనిచేసి, కేవలం అధికారాలు మాత్రమే ఉండే సంస్థలకంటే, ప్రజలు తమ వ్యవహారాలను బాగా, సమర్థవంతంగా చక్కదిద్దుకోగలరన్న నిబ్బరం కలిగింది.

'విద్య, ఆహార ధాన్యాల ఉత్పత్తి, పంటల రక్షణ, చిన్న నీటి వనరులు, తక్కువ మొత్తాలను నిలవజేసే ఉద్యమం వంటి వాటిలో పంచాయతీ సమితులు లేని అభివృద్ధి కేంద్రాలలో కంటే అవి ఉన్న ప్రాంతాలలో చాలా ఎక్కువ కృషి జరిగింది. మూడు పంచాయతీ సమితుల ప్రాంతాలలో ప్రత్యేకంగా కృషిచేయగా, ఆయా ప్రాంతాలలోని పాఠశాలకు వెళ్లే వయసువచ్చిన పిల్లలో నూటికి 25 మంది దాకా పాఠశాలల్లో చేరడం ప్రత్యేకంగా ప్రశంసించదగిన సంగతి'. ఆ తరువాత జిల్లా పరిషత్తులలో పంచాయతీ సమితుల ఒప్పందంలోని అంశాలను వివరిస్తూ, పంచాయతీ మొదటి ప్రజాస్వామిక సంస్థ అనే పద్ధతిలో ఈ వికేంద్రీకరణ విధానం పనిచేస్తుందని ముఖ్యమంత్రి వివరించారు. ఆయా ప్రాంతాలలోని అభివృద్ధి పనులన్నింటినీ ప్రజల ప్రతినిధులకు ఒప్పచెప్పడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఇంకా ఇలా తెలిపారు. 'అభివృద్ధి పనులను అమలు జరపడానికి కావలసిన డబ్బును సమకూర్చుకోవడానికి వీలుగా పన్నులు విధించే అధికారం కూడా ఈ సంస్థలకు ప్రభుత్వం ఇచ్చింది. ప్రభుత్వం కూడా కొంత డబ్బు ఇస్తుంది. తగినంత మంది ఉద్యోగులను ప్రభుత్వం ఇస్తుంది".



ఇదంతా కొత్త సీసాలో పోసిన పాత నీళ్లననే విమర్శ అర్థం లేనిది. పాత సంస్థలు జిల్లా బోర్డులూ, తాలుకా బోర్డులూ ప్రజల అభీష్టాలకు అనుగుణంగా వ్యవహారాలను నిర్వర్తించలేదు". సభకు గవర్నరు శ్రీ భీమసేన్ సచార్ అధ్యక్షత వహించారు.

ఈ కొత్త పథకం ఉద్దేశ్యాలను కేంద్ర సమాజ వికాస శాఖ ఉపమంత్రి శ్రీ బి.ఎన్.మూర్తి విశదం చేసారు..

ఆర్థిక, ప్రణాళికల శాఖ మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, తెలంగాణా ప్రాంతీయ సంఘం అధ్యక్షుడు అచ్యుతరెడ్డి, శాసనసభ సభ్యురాలు శ్రీమతి షాజహాన్‌బేగం కూడా ప్రసంగించారు. ప్రధాని హిందీ ప్రసంగాన్ని తెలుగులోకి శ్రీ పి.వి.నరసింహారావు తర్జుమా చేశారు. షాద్‌నగర్ పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ రామ్‌దేవ్ రెడ్డి వందన సమర్పణ చేశారు.

షాద్‌నగర్ పంచాయతీ సమితి పర్యవేక్షణలో 52,000 జనాభాలో 66 గ్రామాలు ఉండేవి. వాటి విస్తీర్ణం 280 చదరపు మైళ్ళు. జాతీయ విస్తరణ కేంద్రం షాద్‌నగర్‌లో 1954 అక్టోబరులో ఏర్పడింది. 1956 ఏప్రిల్‌లో సమాజాభివృద్ధి కేంద్రంగా రూపొందించారు. ఈ కేంద్రం ఆధ్వర్యాన విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు జరిపే కృషి 1959 మార్చిలో పూర్తి అయినది. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ విధానాన్ని అమలు జరపాలని కిందటి సంవత్సరం జూలైలో నిర్ణయించిన 20 సమితి బ్లాక్‌లలో ఇదొకటి.

**(ఆంధ్రపత్రిక 1959, అక్టోబర్ నాటి సంచిక నుంచి పునర్ముద్రణ)**

# సంవత్సరం పొడవునా పచ్చిమేత లభ్యతకు బహువార్షిక జొన్న (సిఓఎఫ్ఎస్-09 లేదా కో.ఎఫ్.ఎస్-29) సాగు వివరాలు

ప్రతి రైతు సంవత్సరం పొడవునా సుస్థిర ఆదాయం పొందాలంటే పశుపోషణ తప్పనిసరి. పాడికి ఆధారం పచ్చిమేత అనే నానుడి మనందరికీ తెలిసిందే. పచ్చిమేత తేలికగా జీర్ణమవడమే కాకుండా పాడిపశువులకు అవసరమైన మాంసకృత్తులు, విటమిన్లు మరియు ఖనిజాలు అధికంగా లభిస్తాయి. పచ్చిమేతను పుష్కలంగా మేపినట్లయితే పాల దిగుబడి, నాణ్యత (వెన్నశాతం) పెరుగుతుంది. పాడిపశువులకు పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తపడితే రోగ నిరోధకశక్తి పెరిగి వ్యాధులు సులభంగా ఆశించవు.


పాల ఉత్పత్తిలో 60-70% ఖర్చు పశువుమేతపై ఉంటుంది. రైతులు పశుగ్రాసం స్వయంగా సాగుచేయడం ద్వారా పాడిపశువులకు నాణ్యమైన పచ్చిగడ్డి మేపి అధిక పాలదిగుబడి సాధించవచ్చు. అంతేకాకుండా పాల ఉత్పత్తి ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చు.

సంవత్సరం పొడవునా పచ్చిమేత లభించాలంటే ఒక ప్రణాళికా బద్ధంగా పశుగ్రాసాలను సాగు చేసుకోవాలి. రైతు సోదరులు పశుగ్రాసాల కొరకు కేటాయించిన పొలంలో కొంత విస్తీర్ణంలో బహువార్షిక పశు గ్రాసాలను, మిగిలిన విస్తీర్ణంలో కాలానుగుణంగా పచ్చిమేతను అందించే పశుగ్రాసాలను సాగుచేసుకోవాలి. జొన్నపంటను పశుగ్రాసాలలో ప్రధాన పశుగ్రాసపంటగా చెప్పుకోవచ్చు. జొన్నలో ఒకే కోతనిచ్చేవి, రెండు లేదా మూడు కోతలనిచ్చే ఏకవార్షికాలు మరియు పలు కోతలనిచ్చే బహువార్షిక రకాలు ఉన్నాయి. పలు కోతలనిచ్చే బహువార్షిక రకాల్లో డి.ఒ.ఎఫ్.ఎస్. (సిఓఎఫ్ఎస్-29) అనే రకం నీటి వసతిలో సాగు చేయుటకు అనుకూలం. ఈ బహువార్షిక జొన్న ఎక్కువ మాంసకృత్తులు (7%-9.5%), తక్కువ పీచ్చుపదార్థం (34.0%) కలిగియుండి 65 నుండి 70 రోజుల్లో 50% పూతదశకు వస్తుంది. మొక్కలు 220-250 సెం.మీ. పొడవు పెరిగి సంవత్సరానికి 60 నుండి 70 రోజుల వ్యవధిలో 5-6 కోతలనిస్తుంది.

బహువార్షిక జొన్న (సిఓఎఫ్ఎస్-29) సాగు వివరాలు : నీటిపారుదల ఉన్న ప్రాంతాలలో సంవత్సరం పొడవునా విత్తుకోవచ్చు. నల్లరేగడి, ఒండ్రుమట్టి, ఎర్రచల్కా నేలలు అనుకూలంగా ఉంటాయి. పొలాన్ని ఇనుప నాగలితో లోతుగా 2.3 సార్లు దుక్కివచ్చేవరకూ దున్ని హెక్టారుకు 5 కిలోల విత్తనాన్ని 30 సెం.మీ. ఎడంగా సాళ్ళలో విత్తుకోవాలి.

**ఎరువుల యాజమాన్యం**

దుక్కిలో 12.5 ట/హె పశువుల ఎరువు లేదా కంపోస్టుతో బాటుగా 2 కిలోల అజోస్పైరిల్లమ్ (జీవన ఎరువు)ను వేయాలి. ప్రతి హెక్టారు భూమిలో 45 కిలోల నత్రజని, 40 కిలోల భాస్వరం, 40 కిలోల పొటాషియం ఎరువులను దుక్కిలో విత్తేముందు వేసుకోవాలి. విత్తిన 30 రోజులకు పైపాటుగా 45 కిలోల నత్రజనినిచ్చే ఎరువులను వేసి నీరు పెట్టాలి. అదే విధంగా ప్రతి కోత తరువాత 45 కిలోల నత్రజనినిచ్చే ఎరువును వేసి నీరు పెట్టాలి. నాలుగవ కోత తరువాత 45 కిలోల నత్రజనినిచ్చే ఎరువుతోబాటుగా 40 కిలోల భాస్వరం, 40 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను పైపాటుగా వేసుకోవాలి.



**కలుపు యాజమాన్యం**

కలుపు నివారణకు 2000 గ్రా అట్రాసిన్ 50% పొడి మందును 500 లీటర్ల నీటిలో కలిపి హెక్టారు విస్తీర్ణంలో, విత్తిన వెంటనే లేదా 2 రోజల లోపుల తడినేలపై పిచికారి చేసుకోవాలి. విత్తిన 20-30 రోజులకు గుంటక లేక దంతితో అంతర కృషి చేయడం వలన కలుపును సమర్ధవంతంగా నివారించుకోవచ్చు. అవసరాన్ని బట్టి ప్రతికోత తరువాత కలుపుతీయాలి.

**నీటి యాజమాన్యం**

విత్తిన వెంటనే మరియు విత్తిన మూడవరోజున పలుచగా నీటి తడులివ్వాలి. ఆ తరువాత ప్రతి 10-15 రోజులకొకసారి వర్షపాతం మరియు నేలస్వభావాన్ని బట్టి నీటి తడులివ్వాలి. ప్రతికోత తరువాత పై పాలగా ఎరువులను వేసి తప్పనిసరిగా నీటిని ఇవ్వాలి.

**పంట కోత దిగుబడి**

ఈ జొన్న లేతదశలో ఉన్నప్పుడు హైడ్రోసైనిక్ ఆటిడ్ యాసిడ్ అనే విషపదార్థం ఉంటుంది కాబట్టి పంట పూత దశకు వచ్చే వరకు కోసి మేపకూడదు. ఈ జొన్న పంటను 50% పూతదశలో కోసి మేపినట్లయితే పశువులకు ఎటువంటి హాని ఉండదు. పోషకాలు కూడా ఈ దశలో అత్యధిక శాతంలో ఉంటాయి. సరియైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే అయిదు నుండి ఆరు కోతలలో హెక్టారుకు 100 నుండి 150 (నేల స్వభావాన్ని బట్టి) టన్నుల పచ్చిమేత దిగుబడి పొందవచ్చు.

ఆకుల శాతం, ఎక్కువగా ఉండి కాండమునేవళంగా ఉండడం వలన ఈ జొన్న గ్రాసాన్ని ముక్కలు చేయకుండా మేపినాగాని పశువుల పూర్తిగా మేస్తాయి. పశుగ్రాసం వృధా అవదు. కాబట్టి ప్రతిపాడి రైతు తన పొలంలో కొంత విస్తీర్ణంలో ఈ బహువార్షిక జొన్న, కో.ఎఫ్.ఎస్-29 (సిఓఎఫ్ఎస్-29) రకాన్ని సాగు చేసుకొని సంవత్సరం పొడవునా నిర్దిష్ట పరిమాణంలో నాణ్యమైన పచ్చిమేతను పొందవచ్చు.

**డా॥ఆర్.సుశీల, డా॥ఆర్.వి.టి.బాలాజీ జీనాయక్, డా॥ టి.శశికళ, డా॥ ఎం.అనురాధ మరియు ప్రొ॥జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం.**




# పాతిక సంవత్సరాల సంస్కరణలు

తీవ్రమైన ఆర్థిక సమస్యలను దేశం ఎదుర్కొంటున్న 1991వ సంవత్సరం జూన్ 21వ తేదీన భారత ప్రధానమంత్రిగా బాధ్యతలను చేపట్టారు. పి.వి.నరసింహారావు ఆనాడు దేశం తీవ్రమైన విదేశీ మారకం సమస్యను ఎదుర్కొంటుంది. దిగుమతుల చెల్లింపులకు అవసరమయ్యే విదేశీ మార్గకం నిల్వలు కేవలం రెండు వారాలకి సరిపడ మాత్రము ఉన్నాయి. 1990 ఆగస్టు చివరి నాటికి 3.1 బిలియన్ డాలర్లు ఉన్న విదేశీ మారక ద్రవ్యం జనవరి మధ్య కాలానికి 896 మిలియన్ల డాటర్లకు తగ్గిపోయింది. గల్ఫ్ యుద్ధంకారణంగా క్రూడాయిల్ ధరలు పెరిగి సంక్షోభాన్ని మరింత జటిలం చేశాయి. అంతకంటే ముందు కేంద్రంలో అధికారంలో వున్న చంద్రశేఖర్ మైనారిటీ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా ఉన్న యస్వంత్‌సిన్హా ఇరవయి టన్నుల బంగారాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్‌లో తాకట్టుపెట్టి 200 మిలియన్ల డాలర్లను తెచ్చి తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం జరిగింది. ఇది జరిగిన రెండు రోజులకు మార్చి 6వ తేదీన చంద్రశేఖర్ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం నాటకీయ పరిణామాల మధ్య రాజీవ్‌గాంధీ కాంగ్రెస్ పార్టీ మద్దతును ప్రభుత్వానికి ఉపసంహరించుకోవడం, ప్రభుత్వం రాజీనామా చేయడం జరిగింది. ఆర్థిక పరిణామాల తీవ్రతను సమీక్షించిన ఆనాటి ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు ఆర్థిక మంత్రి బాధ్యతలను మన్మోహన్‌సింగ్‌కు అప్పగించడం జరిగింది. వీరిద్దరి సారధ్యంలో మనం మిశ్రమ ఆర్థిక వ్యవస్థను అనుసరించినా ప్రభుత్వరంగం వైపు మొగ్గు చూపడం జరిగింది. రక్షణ, రైల్వేలు, టెలికం, విమానయానం రంగాల అభివృద్ధి నిర్వహణలను పూర్తిగా ప్రభుత్వరంగ సంస్థలకు అప్పగించడం జరిగింది. 1991వ సంవత్సరంలో ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానంలో విప్లవాత్మకమైన మార్పులు తేవడం జరిగింది. లైసెన్స్ పరిమితి రాజ్‌కు స్వస్తికి జరిగింది. గతంలో లైసెన్స్ పరిమిట్ రాజ్యంలో ప్రభుత్వ లాభాలు దేన్ని ఉత్పత్తి చేయాలి, ఎక్కడ ఉత్పత్తి చేయాలి, ఎలా ఉత్పత్తి చేయాలి, ఎంత ఉత్పత్తి చేయాలి అనే అంశాలను నిర్ణయించేవి. ఆ విధానం రద్దు కావడం వలన పారిశ్రామికవేత్తలకు, ఉత్పత్తిదారులకు ఈ వినమయంలో ఇప్పుడు పూర్తి స్వేచ్ఛ లభించింది. ఒకప్పుడు కేవలం ప్రభుత్వరంగానికి మాత్రమే కేటాయించిన రంగాలలో ప్రయివేటు రంగానికి కూడా ప్రాతినిధ్యం కల్పించడం జరిగింది. అనేక మార్కెట్ ఉత్పత్తుల, సేవా రంగాలలో ప్రభుత్వం తన పాత్రను క్రమక్రమంగా తగ్గిస్తుంది.

**సత్ఫలితాలనిచ్చిన సంస్కరణలు:**

1991వ సంవత్సరంలో ప్రవేశపెట్టిన సంస్కరణలు చాలా వరకు సత్ఫలితాలనిచ్చాయి. 1992-93లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తరువాత మన ఆర్థిక వ్యవస్థ సగటున 6.8 శాతం వృద్ధి చెందింది. 2004-05లో వార్షిక అభివృద్ధి రేటు 7.6 శాతం 2005-06, 2010-11లో అభివృద్ధి రేటు 8.7 శాతానికి చేరింది. ఇందుకు భిన్నంగా 1952-1980 సంవత్సరాల వ్యవధిలో మన ఆర్థిక వృద్ధి రేటు కేవలం 3.5 శాతం. 1980-1990లో వృద్ధిరేటు 5.6 శాతం. దురదృష్టవశాత్తు 1991-92లో వృద్ధిరేటు గణనీయంగా ఒకటి శాతానికి పడిపోయింది. ఆర్థిక వ్యవస్థలో మనం ప్రవేశపెట్టిన సంస్కరణలు వృద్ధిరేటు పెరుగుదలకు తోడ్పడ్డాయి.

టెలికం రంగంలో మనదేశం అనూహ్యమైన అభివృద్ధిని సాధించింది. ఒకప్పుడు సగటు మనిషికి టెలిఫోన్ కనెక్షన్ పొందడం ఒక కల. టెలికం రంగంలో ప్రవేశపెట్టిన సంస్కరణల వల్ల సెల్‌ఫోన్ సేవలు కేవలం నగర,



పట్టణ ప్రాంతాలలోని ప్రజలకే కాక మారు మూలగ్రామ ప్రజలకు కూడా అందుబాటులోకి వచ్చాయి. 1995వ సంవత్సరం నుండి ఎయిర్‌టెల్, అయిడియా సెల్‌ఫోన్ సేవలు అందుబాటులోనికి వచ్చాయి.

1969లో 14, 1980లో 6 ప్రైవేట్ బ్యాంకులను ఇందిరాగాంధీ ప్రభుత్వం జాతీయం చేసింది. బ్యాంకుల జాతీయకరణ చట్టంలో సవరణలు చేయడం వలన జాతీయం చేయబడిన బ్యాంకులలో ప్రభుత్వం వాటాను 51 శాతానికి తగ్గించడానికి వీలు కలిగింది. కొన్ని దశాబ్దాల అనంతరం ప్రైవేట్ బ్యాంకుల ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతులు లభించాయి. ఐసిఐసిఐ, యుటిఐ, అక్సిస్ బ్యాంకు వంటి ప్రైవేట్ బ్యాంకులు బ్యాంకింగ్ రంగంలో ప్రసిద్ధి పొందాయి.

## పెరిగిన విమానయాత్రికుల సంఖ్య

సంస్కరణలను ప్రవేశపెట్టక ముందు విమానయాన నిర్వహణ బాధ్యతను పూర్తిగా ప్రభుత్వ సంస్థలైన ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్‌లయిన్స్‌లకు అప్పగించడం జరిగింది. సంస్కరణలను ప్రవేశపెట్టిన




తరువాత అనేక ప్రైవేట్ ఎయిర్‌లయిన్స్ సేవలు అందుబాటులోనికి వచ్చాయి. 1992 ప్రయివేట్ రంగంలో నరేష్‌గోయల్ జెడ్‌ఎయిర్‌వేస్‌ను ప్రారంభించారు. ఇది ప్రయివేట్ రంగంలో ప్రారంభించబడ్డ మొదటి ఎయిర్‌క్రాఫ్ట్ సంస్థ. ఈ సంస్థ 73 గమ్యస్థానాలకు విమానాలను నడుపుతోంది. ఒకప్పుడు విమానయానం ఒక మధుర స్వప్నం. ఆర్థిక సంస్కరణ అమలు తరువాత సగటు మనిషికి రెక్కలు వచ్చాయి. 1991వ సంవత్సరంలో 89 లక్షల మంది విమానాలలో ప్రయాణం చేయగా ఆ సంఖ్య గణనీయంగా పెరిగి 2014-15 నాటికి 8.7 కోట్లకు చేరుకుంది. 1991వ సంవత్సరంలో వీక్షకులకు కేవలం ప్రభుత్వం ఆధ్వర్యంలోని దూరదర్శన్ కార్యక్రమాలు మాత్రమే అందుబాటులో ఉండేవి. సంస్కరణల అనంతరం ఈనాడు 800 కంటె ఎక్కువ ప్రైవేట్ ఛానళ్ళు తమ కార్యక్రమాలను 24 గంటలు ప్రసారం చేస్తున్నాయి. ఈ కార్యక్రమాలను సుమారు 40 కోట్లమది వీక్షిస్తున్నారు. 2000-2001లో ప్రభుత్వ రంగంలోని జీవితభీమా సంస్థ గుత్తాధిపత్యం ముగిసింది. అనేక దేశవిదేశీ సంస్థలు భీమారంగంలోకి ప్రవేశించాయి.

## వృద్ధి చెందిన మధ్య తరగతి

ఆర్థిక సంస్కరణల పుణ్యమా అని భారతదేశంలో వైట్‌కాలర్ ఉద్యోగాల సంఖ్య పెరిగింది. తక్కువ ఆదాయవర్గాల వారి ఆదాయం పెరగడం వల్ల మధ్యతరగతి కుటుంబాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా ఐటి రంగంలో పనిచేసే వారి ఆర్థిక పరిస్థితిలో చెప్పుకొతగ్గ మార్పులు వచ్చాయి. ఆదాయం పెరిగింది. ఫలితంగా వినియోగ వస్తువులకు గిరాకీ కూడా పెరిగింది. మధ్య తరగతి వారికి ఉన్నత వర్గం వారికి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ధనిక బీదవర్గాల మధ్య తేడాలు కొంతమేర పెరిగాయి. సంస్కరణలు ప్రవేశపెట్టిన 25 సంవత్సరాల అనంతరం కూడా అనేక మిలియన్ల మందికి అవసరమైన విద్య, సాంకేతిక పరిజ్ఞానం కరువయ్యాయి. ఈనాటికి మనదేశంలో సుమారు 91 శాతం మంది ప్రజలు అసంఘటిత వ్యవస్థలో చాలీచాలని జీతాలతో జీవితాన్ని గడుపుతున్నారు. సంస్కరణల అమలు అనంతరం మనదేశంలో దారిద్ర్యంలోని ప్రజల సంఖ్య తగ్గినా ఇంకా సుమారు 300 మిలియన్ల ప్రజలు దారిద్ర్యంతో బాధపడుతున్నారు. ఆర్థిక సంస్కరణలు ప్రారంభించిన తరువాత 1991వ సంవత్సరం నుండి కార్మిక సంఘాల ప్రాముఖ్యం క్రమక్రమంగా తగ్గుతోంది. ఆర్థిక సంస్కరణలు తలుపులు తెరిచిన తరువాత సహజంగానే పోటీ విధానం నెలకొంటుంది. ఈ పరిణామ క్రమంలో కొన్ని ప్రముక కంపెనీలు మూతపడ్డాయి. ఇందులో ప్రధానంగా పేర్కొనదగిన అంబాసిడర్, ప్రీమియర్ పద్మిని కార్లు, రాజ్‌దూత్ మోటారు సైకిళ్ళు, గోల్డ్‌స్పాట్ (సాఫ్ట్‌డ్రింక్). నూతనంగా వినూత్న డిజైన్లతో క్రొత్త కార్లు, బైకులు రోడెక్కాయి. ప్రముఖ ప్రభుత్వరంగ వాచ్‌కంపెనీ హెచ్‌ఎంటి సమస్యల వలయంలో చిక్కుకుంది. ప్రస్తుతం ఈ కంపెనీ కర్నాటక రాష్ట్రంలోని తుముక్కురు, బెంగుళూరు నగరాలలలో మాత్రమే వాచీలను తయారు చేస్తుంది. వ్యవసాయ రంగం ఆర్థిక సంస్కరణల వల్ల పెద్దగా లాభపడకపోవడమేకాక సంక్షోభంలోనికి నెట్టబడింది. రైతులకు పండించిన పంటకీ గిట్టుబాటు ధర లభించడంలేదు. ఎరువుల, పురుగుల మందులు సకాలంలో లభ్యం కావడం లేదు. చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి సంబంధించిన విధాన నిర్ణయాలలో ప్రముఖ పాత్రను పోషించిన ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి దాని స్థానంలో నీతి అయోగ్‌ను ఏర్పాటు చేయడం సంచలన నిర్ణయం.

సబ్సిడీల దుర్వినియోగాన్ని నివారించాలన్న ఆశయంతో ప్రభుత్వం సబ్సిడీలను నేరుగా లబ్దిదారుల ఖాతాలో జయచేయడం సకారాత్మక చర్య. ఎల్.ఐ.టి.పై సబ్సిడీని ఒదులుకొమ్మని ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి పెద్దగా స్పందనరాలేదు. ఇకపై వార్షిక ఆదాయం పదిలక్షల కంటే ఎక్కువ ఉన్నవారికి ఎల్.పి.జి.పై సబ్సిడీ లభించదు. మన దేశ ఆర్థిక అభివృద్ధిలో విదేశీ పెట్టుబడుల పాత్ర గణనీయంగా ఉంటుంది. ప్రధాని నరేంద్రమోడీ, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు సంస్కరణలలో భాగంగా విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి అవసరమైన చర్యలను గైకొంటున్నారు.

25 సంవత్సరాల సంస్కరణల వల్ల భారత ఆర్థిక వ్యవస్థ కొన్ని విమర్శలకు లోనైనప్పటికి చెప్పుకోతగ్గ ప్రగతిని సాధించింది. ఈనాడు చాలా దేశాలతో పోలిస్తే ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యకరంగా ఉంది. ఈ కారణంగానే అనేక విదేశీ సంస్థలు మనదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహాన్ని కనబరుస్తున్నాయి.

**డాక్టర్ పి.మోహన్‌రావు,**
**అసోసియేట్ ప్రొఫెసర్, రైల్వే డిగ్రీ కాలేజి.**



# మైనారిటీలకు ప్రభుత్వ పథకాల లబ్ధి

తెలంగాణ వచ్చిన తర్వాతనే రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి పెద్దయెత్తున అడుగులు పడుతున్నాయి. మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామంటూ పలు సందర్భాల్లో చెప్పిన సీఎం కేసీఆర్ అందుకు తగినట్లు చర్యలు తీసుకొంటున్నారు. మైనారిటీల కోసం షాదీముబారక్, షాదీఖానాల నిర్మాణం వంటి పలుపథకాలను ప్రవేశపెట్టారు. ఎన్నో ఏండ్లుగా మైనారిటీల సంక్షేమశాఖలో, ఇతర అన్ని విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని రాష్ట్ర మైనారిటీ కమిషన్ కోరుతున్నది. రెండున్నర దశాబ్దాల క్రితం నాటి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కేటాయించిన బడ్జెట్ కేవలం 20 లక్షలే. ఆ బడ్జెట్‌కు అనుగుణంగా ఆనాడు ఈ శాఖలో నామమాత్రంగానే సిబ్బందిని నియమించింది. వారిసంఖ్య నేటికీ పెరుగలేదు. మైనారిటీ సంక్షేమ శాఖలోని ఎనిమిది విభాగాల్లో 284 పోస్టులుండగా వాటిలో183 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న ఉద్యోగుల్లో కూడా డిప్యూటేషన్లపై, తాత్కాలికంగా పనిచేస్తున్న వారే అధికంగా ఉన్నారు. వైఎస్ హయాంలో మైనారిటీ సంక్షేమశాఖలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో నియమించిన 68 మంది ఉద్యోగుల్లో దాదాపు అందరు ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చినవారే తప్ప నేరుగా నియమితులైనవారు కాదు. తమ క్యాడర్ స్ట్రెంత్ పెంచాలని వక్ఫ్‌బోర్డు 1956 నుంచి ఉన్న ప్రభుత్వాలకు ఎన్నిసార్లు లేఖలు రాసినా నేటికి మంజూరు కాలేదు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డులు ఇటీవలే ఏర్పాటయ్యాయి. మైనారిటీ సంక్షేమ శాఖలో మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, మైనారిటీ సంక్షేమ డైరెక్టర్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, మైనారిటీ కమిషన్, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఉర్దూ అకాడమీ, వక్ఫ్‌బోర్డు హజ్ కమిటీలు ఉన్నాయి. రాష్ట్ర విభజన అనంతరం మైనారిటీ సంక్షేమ శాఖ, మైనారిటీ కమిషనరేట్, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, వక్ఫ్‌బోర్డు హజ్ కమిటీలను విభజించారు. కానీ ఉర్దూ అకాడమీ, మైనారిటీ కమిషన్ విభజన ఇంకా జరుగలేదు. తెలంగాణ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ బడ్జెట్‌ను రూ.1030 కోట్లకు పెంచింది. గతంలో ఉన్న ఫీజులు, స్కాలర్‌షిప్‌ల పథకాన్ని కొనసాగిస్తూనే కొత్తగా షాదీముబారక్, నిరుద్యోగుల స్వయం ఉపాధికి రుణ పథకాలు ప్రకటించింది. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందజేసే రుణాలపై లబ్ధిదారులకు సబ్సిడీ 80 శాతానికి పెంచింది. రాజధానిలో వెయ్యి ఆటోల పంపిణీ చేయడమేగాక జిల్లాలకు కూడా ఈ పథకాన్ని విస్తరించనున్నట్లు తెలిపింది. మైనారిటీలకు ఉచిత, నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొత్తగా 60 మైనారిటీ గురుకులాలను ప్రారంభించనున్నట్లు పేర్కొంది. వీటితోపాటే దశాబ్దాలుగా భర్తీ కాని మైనారిటీ ఉద్యోగాలను భర్తీ చేస్తామని కూడా ప్రకటించింది. ఉర్దూ మీడియం స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ళలో 15,628 టీచర్ పోస్టులను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేయనున్నట్లు వెల్లడించింది. వీటిలో 1225 ఉర్దూ టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా లేదా టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేసే విషయమై నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖను రెండు రోజుల క్రితం రాష్ట్ర క్యాబినెట్ ఆదేశించింది. మైనారిటీలకు ప్రభుత్వ సంక్షేమ



పథకాలు చేరాలంటే ఉద్యోగ వ్యవస్థ ముఖ్యం. కాబట్టి తొలి విడతలో మైనారిటీ సంక్షేమ శాఖలో 80 పోస్టుల భర్తీకి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టరేట్‌లో 20 మందితో పాటు ప్రతి జిల్లాలో ఆ శాఖ పథకాలు, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ కోసం ఆరుగురు చొప్పున సిబ్బందిని భర్తీ చేస్తామని తెలిపింది. మైనారిటీ సంక్షేమ శాఖలో సిబ్బంది కొరత పై రాష్ట్ర మైనారిటీ కమిషన్ ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు ఒక నివేదికను అందజేసింది.

ప్రస్తుత అవసరాలకు ఈ సిబ్బంది సంఖ్య ఏ మాత్రం సరిపోదని, భారీగా సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ ఖాళీలపై రెండు నెలలుగా సర్వే జరిపి వివరాలు సేకరించినట్లు కమిషన్ చైర్మన్ ఆబిద్ రసూల్ ఖాన్ తెలిపారు. నాలుగు శాతం రిజర్వేషన్ ప్రకారం ముస్లింలకు వివిధ విభాగాల్లో 647 ఉద్యోగాలు కేటాయించాల్సి ఉంటుంది.

**– వార్తాంశం**



# టిసిపార్డు నందు ఎన్ఎస్ఎపి అమలుచేయు అధికారులకు మూడురోజుల శిక్షణా కార్యక్రమం

గ్రామీణ పేద ప్రజలకు జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం అమలుపై 3 రోజుల శిక్షణ కార్యక్రమంను ఎన్ఎస్ఎపి డైరెక్టర్ శ్రీరాజేశ్వర్‌రెడ్డి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలలో రక్షణ, జీవిత సాఫల్యంను సాధించెందుకు తగిన పారితోషికంను చెల్లించి బ్రతుకు భద్రత కల్పించేందుకు ఉద్దేశించబడినదని అన్నారు. కేంద్ర ప్రభుత్వమే జాతీయ సామాజిక సహాయ కార్యక్రమంనకు బడ్జెట్‌ను యిస్తుంది. కాని రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 420కోట్లు ఖర్చు చేస్తూ 32 వేల మందికి ఆసరా పెన్షన్‌లు యిస్తుందన్నారు. ఈ ఎన్ఎస్ఎపి కార్యక్రమం ఆసరాలో అంతర్భాగంగా పనిచేస్తుంది. సాంఘిక భద్రత కల్పించడంకు ఉద్దేశించిన వాటిలో కేంద్ర పథకాలు 'సురక్ష', జనశక్తి, భీమాయోజన, అటల్ పెన్షన్ యోజనలు పనిచేస్తున్నాయన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమంను క్రింది స్థాయిలో పనిచేసే అధికారులకు ఉద్దేశించబడినది. ఈ కార్యక్రమంనందు సీనియర్ కన్సల్టెంట్ జి.జయపాల్‌రెడ్డి కోర్సును గూర్చి వివరించారు. ఆ సిఎన్ఆర్ఎం సెంటర్ హెడ్ బి.నరేంద్రరావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి ప్రజల భద్రత కోసం ఇన్సూరెన్స్ స్కీమ్‌లను గూర్చి వివరించారు. కోర్సు డైరెక్టర్‌గా టిఎంకె గాంధీ వ్యవహరించారు.





# పర్యావరణ ఉద్యమాలు

మానవజాతి ఆవిర్భావం మొదలు నేటివరకు పర్యావరణానికి మానవుని జీవనానికి విడదీయలేని అవినాభావ సంబంధం కొనసాగుతున్నది. మానవ సమాజాలు పర్యావరణంలో అంతరాగేంగా కొనసాగు తున్నాయి. అయితే పారిశ్రామిక విప్లవం తర్వాత పర్యావరణంపై మానవ సమాజాల దాడి, విధ్వంసం మొదలై ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ ఇది మరింత ప్రమాద స్థాయికి చేరుకున్నది. పర్యావరణ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. మానవుల విలాసవంతమైన స్వార్థపూరిత జీవనం, మిగతా జీవరాశులు, అడవులు, సహజసంపద అంతరించిపోవడానికి కారణమవుతున్నది. ఏకపక్షంగా జరుగుతున్న పర్యావరణ విధ్వంసంలో చివరకు మావనవజాతి కూడా అంతరించిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి ఇప్పటికైనా వాస్తవాన్ని గ్రహించి, అప్రమత్తమై పర్యావరణాన్ని సంరక్షించుకొనేందుకు కృషిచేయాలని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణ అనేది బహుముఖ వ్యూహం (Multi dimensional) గల అంశం. మానవుడు పర్యావరణాన్ని ఎన్ని విధాలుగా విధ్వంసం చేస్తున్నాడో అంతకు రెట్టింపు విధానాల ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవాల్సి ఉంది. నూతనంగా కనుగొంటున్న శాస్త్ర సాంకేతిక విధానాలు, పద్ధతులను పర్యావరణ పరిరక్షణకు ఉపయోగించుకొనేవిధంగా ప్రకృతి వనరుల వినియోగాన్ని తగ్గించి వీటికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. అన్నింటికన్నా ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ పట్ల యావత్ ప్రపంచ సమాజాన్ని చైతన్యపర్చాలి. సామాజిక ఉద్యమాల్లో భాగంగా, పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలను చేపట్టి ప్రకృతి తల్లిని కాపాడుకోవాలి.

**నర్మదా బచావో ఆందోళన్**

- నర్మదా నదిపై 1961 నుంచి నిర్మాణంలో ఉన్న సర్దార్ సరోవర్ ప్రాజెక్టు, నర్మదాసాగర్ డ్యామ్‌లతో లక్షలాది మంది స్థానిక గిరిజనులు, రైతులు, సామాన్య ప్రజలు నిరాశ్రయులుకావడంతో పాటు పర్యావరణ సమతుల్యత (Ecological Balance) దెబ్బతింటుందని ప్రముఖ పర్యావరణ ఉద్యమ నాయకురాలు మేధాపాట్కర్ నర్మదా బచావో ఆందోళన్ ఉద్యమాన్ని ప్రారంభించింది.
- భారతదేశంలో పశ్చిమంగా ప్రవహించే నర్మదా నదికి మత, సాంస్కృతిక, జీవనపరంగా అధిక ప్రాముఖ్యం ఉంది.
- 1980వ దశకంలో తీవ్రరూపం దాల్చిన నర్మదా బచావో ఆందోళన్ నర్మదా ప్రాజెక్టు నిర్మాణానికి ప్రపంచబ్యాంక్ అందిస్తున్న ఆర్థికసహాయాన్ని వెంటనే నిలిపివేయాలని పోరాటం చేశారు.
- ఈ ఉద్యమ ప్రభావంతో నర్మదా నది నిర్మాణానికి సంబంధించి 1991లో ప్రపంచ బ్యాంక్ మూర్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది.
- సర్దార్ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా మేధాపాట్కర్‌తో పాటు బాబా ఆమ్టే, నందితాదాస్, అరుంధతిరాయ్ వంటి పర్యావరణ ఉద్యమకారులు ఉద్యమించారు.
- ఈ ఉద్యమం ప్రభావంతో నర్మదా ట్రిబ్యునల్ ఏర్పాటయ్యింది.
- నర్మదా బచావో ఆందోళన చివరకు ఒక ప్రజా ఉద్యమంగా మారడం, సుప్రీంకోర్టులో దీనిపై వ్యాజ్యాలు వేయడంతో సుప్రీంకోర్టు సర్దార్ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆదేశించింది.

**తెహ్రీబంద్ విరోధి సంఘర్ష్ సమితి**

- ఉత్తరాంచల్ (ఉత్తరాఖండ్)లో భగీరథ, భిలంగన్ నదుల సంగమం వద్ద తెహ్రిడ్యామ్‌ను నిర్మించి సాగునీటి కల్పన, జల విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించి 1949లో పనులను ప్రారంభించారు.

- ఈ డ్యామ్ నిర్మాణ ప్రాంతం పర్యావరణపరంగా అత్యంత సున్నిత ప్రాంతం. దీని నిర్మాణంతో సుమారు 100 గ్రామాలు పూర్తిగా, మరో వంద గ్రామాలు పాక్షికంగా ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.
- డ్యామ్ నిర్మాణంతో సుమారు వెయ్యి హెక్టార్ల సాగుభూమి, వెయ్యి హెక్టార్ల అటవీ భూమి, మరో రెండువేల హెక్టార్ల పశుగ్రాస భూములు ముంపునకు గురికావడంతో పాటు భూకంపాలు సంభవించే తీవ్రత ఎక్కువగా ఉంటుంది.
- డ్యామ్ నిర్మాణం తర్వాత భూకంపాలు సంభవించి డ్యామ్ కూలిపోతే హరిద్వార్ రిషికేష్‌లో నివసించే ప్రజలు ముంపునకు గురవుతారు.
- ఈ డ్యామ్ నిర్మాణానికి వ్యతిరేకంగా తెహ్రీబంద్ విరోధి సంఘర్ష్ సమితి ఆధ్వర్యంలో పర్యావరణ ఉద్యమం జరిగింది.
- ఈ ఉద్యమం ప్రభావంతో అంతర్జాతీయ స్థాయిలో తెహ్రీడ్యామ్ నిర్మాణంతో కలిగే ప్రమాదాల గురించి చర్చలు మొదలయ్యాయి.
- 1985లో తెహ్రీడ్యామ్ నిర్మాణానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో ఒక వాజ్యం దాఖలైంది.

**తెలంగాణలో పర్యావరణ పరిరక్షణ**

- తెలంగాణ రాష్ట్రం పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా దీర్ఘకాలిక వ్యూహంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నది.

**తెలంగాణకు హరితహారం**

- రాబోయే మూడేండ్లలో రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 33 శాతం అటవీ విస్తీర్ణం ఉండేలా అడవుల పెంపకాన్ని ప్రోత్సహించే కార్యక్రమం ఇది.
- ఈ మూడేండ్లలో మొత్తం 230 కోట్ల మొక్కలను నాటుతారు.
- అటవీయేతర ప్రాంతాల్లో 120 కోట్ల మొక్కలను
- అటవీ ప్రాంతాల్లో 100 కోట్ల మొక్కలను
- హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ పరిధిలో 10 కోట్ల మొక్కలను పెంచుతారు.
- 2015లో 40 కోట్ల మొక్కలను నాటుతారు.
- 2016లో మరో 40 కోట్ల మొక్కలను నాటుతారు.
- ఈ కార్యక్రమానికి రూ. 800 కోట్లు ఖర్చు చేయనున్నారు.
- మన ఊరు – మన ప్రణాళిక కార్యక్రమం ద్వారా మొక్కలు నాటే ప్రాంతాలను గుర్తిస్తారు.

**మిషన్ కాకతీయ**

- మన ఊరు – మన చెరువు నినాదంతో రాష్ట్రంలోని 46,531 చెరువులను చిన్న నీటి వనరులను పునరుద్ధరించే ప్రక్రియ నడుస్తుంది.
- మిషన్ కాకతీయ ద్వారా స్థానిక జల వనరులను పూర్తిస్థాయిలో సంరక్షించుకొని సాగు, తాగు అవసరాలను తీర్చడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడుతారు.

**అప్పికో ఉద్యమం**

- చిప్కో ఉద్యమం స్ఫూర్తితో ఉత్తర కర్ణాటకలోని కలాసేకుదోర్ అటవీ ప్రాంతంలో 1983లో అప్పికో ఉద్యమం ప్రారంభమైంది.
- అటవీ శాఖ నుంచి అనుమతి పొందిన కాంట్రాక్టర్లు విచక్షణారహితంగా అడవులను నరికి కలపను వ్యాపారం చేసుకొనేవారు.
- ఈ అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న సల్కని, బాలెగద్దె, మనన్దోర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు చిప్కో ఉద్యమం మాదిరిగానే చెట్లను నరకకుండా వాటిని హత్తుకొని రక్షించుకున్నారు.





- లక్ష్మీ నరసింహ యువమండలి అనే సంస్థ అప్పికో నిర్వహించిన ఉద్యమం జాతీయస్థాయి ఉద్యమంగా మారింది.
- ఈ ఉద్యమ ప్రభావంతో ఉత్తర కర్నాటక ప్రాంతంలో సామాజిక అడవుల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

**గంగా సంరక్షణ ఉద్యమం**

- హిందువులకు అత్యంత పవిత్ర నదిగా పరిగణించబడుతున్న గంగానది పరిరక్షణ కోసం గాంధీ మనుమరాలు తారాగాంధీ భట్టాచార్జీ ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు.
- గంగానది పరిరక్షణ కోసం అహింసామార్గంలో సాగిన గాంధీయన్ పర్యావరణ ఉద్యమం ఇది.
- గంగా నది పరీవాహక ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు పరిమితికి మించి ఆవాసాల ఏర్పాటుతో గంగానది ప్రమాదకరస్థాయిలో జలకాలుష్య సమస్యను ఎదుర్కొంటుంది.
- దేశంలో వ్యవసాయానికి, మానవ జీవనానికి, భారతీయ ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా ఉన్న గంగానదిని రక్షించుకోవడమే ఈ ఉద్యమం అంతిమలక్ష్యం.
- ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కూడా గంగా నది పరిరక్షణ కోసం, ప్రత్యేక మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటుచేసింది.

**కోయెల్‌కరో ఉద్యమం**

- జార్ఖండ్‌లో చేపట్టిన కోయెల్‌కరో జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా స్థానిక ఒరాన్, మూండా గిరిజన తెగలు జరిపిన పర్యావరణ ఉద్యమం ఇది.
- కోయెల్‌కరో జన్ సంఘర్షణ సమితి అనే స్వచ్ఛంద సంస్థ ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లింది.
- కామ్ రకో ఆందోళన్ నినాదంతో స్థానిక ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించింది.
- దేశంలో అత్యంత శక్తివంత పర్యావరణ ఉద్యమంగా పరిగణించబడ్డ కోయెల్‌కరో ఉద్యమం ప్రభావంతో విచ్చలవిడిగా ప్రాజెక్టు చేపట్టకుండా నిరోధించింది.

**చిప్కో ఉద్యమం**

- పర్యావరణంలో అత్యంత ప్రధాన అడవులను రక్షించుకొనేందుకుగాను నాటి ఉత్తరప్రదేశ్ (నేటి ఉత్తరాఖండ్)లోని చమోలీ జిల్లాలో 1973లో చిప్కో ఉద్యమం ప్రారంభమైంది.
- సుందర్‌లాల్ బహుగుణ నాయకత్వంలో స్థానిక మహిళలు అడవుల పరిరక్షణలో క్రియాశీల పాత్ర పోషించారు.
- చమోలీ ప్రాంతాన్ని పరిపాలించే రాజు ఒక పెద్ద రాజభవనాన్ని నిర్మించాలని తన సేవకులను ఆదేశిస్తాడు. దీనికోసం సేవకులు చెట్లను నరకడం ప్రారంభిస్తారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక బాలిక అమిత్రాదేవి చెట్లను నరకకుండా వాటిని కౌగిలించుకొని చెట్లను నరకాలంటే ముందు నా తలను నరకాలని హెచ్చరిస్తుంది. రాజు ఆదేశాల మేరకు సేవకులు ఆమె తలను నరికివేస్తారు. ఈ సంఘటనతో స్థానిక మహిళలందరూ సంఘటితంగా చెట్లను నరకకుండా వాటిని కౌగిలించుకొని (చిప్కో) అడవులను కాపాడుకున్నారు.
- సుందర్‌లాల్ బహుగుణ స్థానిక మహిళల సహకారంతో అడవులను పరిరక్షించేందుకు ప్రజలను చైతన్యపర్చారు. పర్యావరణ పరిరక్షణతో కూడిన అభివృద్ధే నిజమైన అభివృద్ధి అని నాటి ప్రభుత్వాలను మెప్పించగలిగాడు.
- పర్యావరణ సత్యాగ్రహం రూపంలో మొదట స్థానిక గిరిజన మహిళలు పాల్గొని పర్యావరణ మహిళా ఉద్యమాలను (Ecofeminism) ప్రారంభించారు.



- చిప్కో ఉద్యమంలో భాగంగా చండీప్రసాద్ భట్ (Chandi Prasad Bhat) కుటీర, చిన్న తరహా, అటవీ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం అనేక విధాలుగా కృషి చేశారు.
- చిప్కో ఉద్యమం తీవ్రతను గమనించిన నాటి రాష్ట్ర ప్రభుత్వం అడవుల నరికివేతను నిషేధించడమే కాకుండా అడవుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది.
- చిప్కో ఉద్యమం ప్రభావంతో హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమకనుమలు, బీహార్, వింధ్యాసాత్పూర పర్వతాల్లో అడవుల సంరక్షణకు చర్యలు చేపట్టారు.

**– ఎన్.కె.వెంకట్,**

**సీనియర్ ఫ్యాకల్టీ, 9849186827, విజేతస్కూల్**



# మన రాజ్యాంగానికి ప్రాణం 'న్యాయ సమీక్ష'

**భా**రత దేశ ఐక్యతకు, పార్లమెంట్ వ్యవస్థ నిలకడగా కొనసాగడానికి కారణం మన రాజ్యాంగంలోని 'న్యాయ సమీక్ష'యే

చట్టాలు చేయడమే కాదు ఆ చట్టాలను అమలు చేయు బాధ్యతను పార్లమెంటు చూస్తుంది. ప్రశ్నించుతుంది. సూచనలు సలహాలను ఇస్తుంది. కాలానుగుణంగా చట్టాలను సవరించుతుంది.

పార్లమెంటు (లేదా) రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన చట్టాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా తీసుకున్న పరిపాలన సంబంధమైన నిర్ణయాలు రాజ్యాంగానికి అనుగుణంగా ఉన్నాయా లేవా అని నిర్ణయించే అధికారం సుప్రీంకోర్టుకు ఉంది. ప్రభుత్వాలు చేసిన నిర్ణయాలు లేదా చట్టాలు లేదా తీసుకొను పాలనా సంబంధమైన నిర్ణయాలు రాజ్యాంగ బద్ధం కాదు అని నిరూపితమైతే సుప్రీంకోర్టు వాటిని కొట్టివేయవచ్చు. రాజ్యాంగాన్ని రక్షించడం కోసమే కాకుండా ప్రభుత్వంలోని అన్ని విభాగాలు రాజ్యాంగ అధికార పరిధి క్రింద పనిచేస్తున్నాయా లేదా అని పరిశీలించి తగు ఉత్తర్వులు హామీ ఇవ్వడానికి కూడా భారతదేశ న్యాయ వ్యవస్థకు న్యాయసమీక్ష అధికారం ఉంది. దీనివల్ల

1. వ్యక్తిగత హక్కులకు భంగం కలుగకుండ ప్రతి వారికి రక్షణ దొరుకుతుంది.
2. చట్టం ముందు అందరు సమానులే. అనే సూత్రం అమలవుతుంది.
3. హేబియస్ కార్పస్‌లాంటి రూల్స్ ద్వారా పౌరులకు రక్షణ కల్పించుతుంది.
4. సమాచార హక్కు చట్టం, ద్వారా పేదలకు సంక్రమించిన హక్కులు కూడా కాపాడేందుకు తోడ్పాటు లభిస్తుంది.
5. ప్రాథమిక హక్కులకు జీవం పోస్తుంది.

– సి.ఎంపి.

## ఉపాధి హామీ పథకం అమలులో తెలంగాణ రాష్ట్రానికి నాలుగు అవార్డులు

**మ**హాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పదవ వార్షికోత్సవ ఉత్సవాలల్లో భాగంగా న్యూఢిల్లీలో నిర్వహించిన ఉపాధి హామీ మేళాలో తెలంగాణ రాష్ట్రం నాలుగు అవార్డులను పొందింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు శ్రీ అరుణ్‌జైట్లీ మరియు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రివర్యులు శ్రీ బీరేంద్రసింగ్ చౌదరి గార్ల చేతుల మీదుగా అవార్డుల ప్రదానం జరిగింది.

తెలంగాణ రాష్ట్రానికి జాతీయ స్థాయిలో సోషల్ ఇంక్లూజన్ (Social Inclusion)

పారదర్శకత మరియు జవాబుదారితనం (Transparency and Accountability)

అంశాల్లో ఉత్తమ రాష్ట్ర అవార్డులను స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీ ఎస్.పి.సింగ్ గారు, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టరు శ్రీమతి అనిత రామచంద్రన్ గారు, సోషల్ ఆడిట్ డైరెక్టర్ సౌమ్య కిదాంబి అందుకున్నారు.

జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాగా ఎంపికైన నిజామాబాద్ జిల్లా అవార్డును కలెక్టర్ డా.యోగితా రాణా గారు అందుకున్నారు.

ఉత్తమ గ్రామంగా ఎంపికైన కరీంనగర్ జిల్లా చందుర్తి గ్రామం అవార్డును గ్రామసర్పంచ్ శ్రీ గొట్టె ప్రభాకర్ గారు అందుకున్నారు.

ఉపాధి కూలీ నుండి రైతుగా మారిన మెదక్ జిల్లా సిద్దిపేట మండలం రాఘవపూర్‌కు చెందిన శ్రీ కొమ్మిడి వెంకట్రామిరెడ్డి విజయగాథను పురస్కరించుకొని ఆయనను సన్మానించడం కూడా ఈ మేళాలో జరిగింది.




"చిన్న వ్యాపారులకు, వ్యవసాయేతర రంగాలకు సరళతర రుణాలు లేక అభివృద్ధిలో సమతుల్యత లోపిస్తుంది. దీనిని ముద్రాయోజన పథకం పూరిస్తుంది. హామీ లేని రుణాలు అర్హులు అందరికీ లభిస్తాయి. ఇక నుంచి 60% మంది ప్రజలు దేశ ఆర్థిక ప్రగతిలో భాగస్వాములవుతారు." - నరేంద్రమోదీ, భారత ప్రధానమంత్రి

# కారుచీకటిలో కాంతి రేఖ
# చిరువ్యాపారుల పాలిట జీవన ముద్ర

- మైక్రో యూనిట్స్ డెవెలప్‌మెంట్ అండ్ రీఫైనాన్స్ ఏజెన్సీస్ ముద్రా
- సత్తా ఉంటే చాలా రుణం మీ సొంతం
- ఔత్సాహికులకు అనుకోని వరం
- రూ.5వేల నుండి 10 లక్షల వరకు రుణం అందే అవకాశం
- ప్రభుత్వ గ్రామీణ, ప్రైవేటు బ్యాంకుల ద్వారా రుణాలు
- యువత కలల ప్రపంచాన్ని ఇలపైకి తీసుకురానున్న ముద్రా

ప్రపంచంలో అధిక సంఖ్యలో నిరుద్యోగులు ఉన్న దేశం భారతదేశం అంటే అతిశయోక్తి కాదేమో. నిరుద్యోగమునకు ప్రత్యామ్నాయం ఉపాధి కల్పన. దేశంలో పెద్ద వ్యాపార సంస్థల కన్నా చిన్న చిన్న యూనిట్ల ద్వారా ఉపాధి పొందే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు భారీ పరిశ్రమలకు దేశీయ బ్యాంకులు 55 లక్షల కోట్ల రుణములు అందించగా కేవలం 12 కోట్ల మంది ప్రజలకే ఆ పరిశ్రమలు ఉపాధి కల్పించగలిగాయి. అయితే దేశంలోని సూక్ష్మ, చిన్నతరహా వ్యాపార సంస్థలు కేవలం 11 లక్షల కోట్ల పెట్టుబడితో నడుస్తూ 12 కోట్ల మందికిపైగా ఉపాధి అవకాశములు అందిస్తున్నాయి. కానీ ఎక్కువమందికి ఉపాధి చూపిస్తున్న ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను సకాలంలో పరిష్కారించకపోవడం వలన చిరువ్యాపారులు ఆర్థికంగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆలోచనలలో రూపుదిద్దుకొన్నదే ప్రధానమంత్రి ముద్రా (మైక్రోయూనిట్స్ డెవెలప్‌మెంట్ అండ్ రీఫైనాన్స్ ఏజెన్సీస్ (MUDRA) యోజన PMMY. ఈ పథకంను 2015 ఏప్రిల్ 8వ తేదీన దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినది. ఈ పథకం చిరువ్యాపార సంస్థలకు ఆర్థిక పుష్టి కల్గించే విధంగా రూపొందించబడినది.

ఈ పథకం లక్ష్యం: చేతి వృత్తుల వారు, చిరువ్యాపారులు, వస్తువుల తయారీ, వాణిజ్యము, సేవా, వ్యాపార రంగములలో ఉన్న సూక్ష్మ, చిన్నపాటి వ్యాపార సంస్థలకు నడుపుతున్న దేశంలోని 5.77 కోట్ల మంది చిరువ్యాపారులకు రుణములను అందించి పరోక్షముగా మరికొందరికి ఉపాధి కల్పించడమే ఈ ముద్రా పథకం యొక్క ముఖ్య లక్ష్యం.

ప్రధానమంత్రి ముద్రాయోజన (PMMY) పథకంలో ప్రస్తుతం 3 రకములైన రుణములు అందుబాటులో ఉన్నాయి. 1. శిశు విభాగము 2. కిశోర్ విభాగము 3. తరుణ్ విభాగము. వ్యాపారులు స్థాయి ప్రారంభము, వృద్ధి ఎన్ని సంవత్సరములుగా నిర్వహిస్తున్నారు వంట

**రేవు నాగేంద్ర ఒక చిల్లర దుకాణం నడుపుతున్నాడు తక్కువ పెట్టుబడి పరిమిత వస్తువులతో వ్యాపారం చేస్తున్నాడు. దీనిని అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉన్నా సరిపడా పెట్టుబడి పెట్టలేకపోతున్నారు. హామీగా చూపేందుకు ఆస్తులు లేక బ్యాంకురుణం పొందలేకపోతున్నాడు. కారు చీకటిలో కాంతి రేఖలా ఎలాంటి హామీ లేకుండా 2 లక్షల వరకు రుణం పొందే చక్కటి అవకాశం అతనికి లభించింది.**

ప్రధాని మోదీ ఆలోచనల ప్రతిరూపంగా అమలులోనికి వచ్చిన ముద్రాయోజన పథకం వీరందరి కలలను సాకారం చేయనుంది. ఎడారి లాంటి జీవితాలలో చిరుజల్లులు కురిపించనుంది.



**పీతా సుబ్బరత్నం ఒక చేపల అమ్మే చిరువ్యాపారి. చాలా సంవత్సరాలుగా చేపల వ్యాపారం చేయడం వలన వ్యాపారంలో మెళుకువలు తెలిశాయి. సొంత వ్యాపారం పెట్టుకొని స్థిరపడాలనేది ఆమె కల.**

**అందుకు లక్ష రూపాయలు పెట్టుబడిగా కావాలి. అంత మొత్తం ఆమె దగ్గర లేదు. అంత మొత్తం అందేలా ముద్రాయోజన రూపంలో అదృష్టం ఆమె తలుపు తట్టింది.**

అంశములు పరిగణనలోకి తీసుకొని రుణములు ఇస్తారు.

1. **శిశువిభాగము:** ఈ విభాగము క్రింద చేతివృత్తులు, చిరువ్యాపారములు నిర్వహించుకొనుటకు రూ.5000/- నుండి రూ.50,000/- వరకు పెట్టుబడి రుణముగా మంజూరు చేస్తారు. ఈ రుణముపై సంవత్సరమునకు 10% వడ్డీగా చెల్లించవలసి ఉంటుంది.
2. **కిశోర్ విభాగము:** ఈ విభాగము క్రింద చిరు వ్యాపారములతో పాటుగా వస్తు తయారీ చిన్న తరహా వ్యాపారములు నిర్వహించుకొనుటకు రూ.50,000/- నుండి రూ.5,00,000/- వరకు పెట్టుబడి రుణముగా మంజూరు చేస్తారు. ఈ రుణములలో రూ.50,000 నుండి రూ.2,00,000/- లోపు అయితే 10.75% వడ్డీ మరియు రూ.3,00,000/- నుండి రూ.5,00,000/- వరకు సంవత్సరమునకు 11.5% వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది.
3. **తరుణ్ విభాగము:** ఈ విభాగము ద్వారా వస్తువుల తయారీ, సేవా మరియు వాణిజ్య వ్యాపార కార్యకలాపములు నిర్వహించుటకు రూ.5,00,000/- నుండి రూ.10,00,000/- వరకు పెట్టుబడిగా రుణములను మంజూరు చేయడం జరుగుతుంది. వీరు సంవత్సరమునకు 11.7% నుండి 12.5% వరకు వడ్డీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

**ఏ బ్యాంకులను సంప్రదించాలి:**

ముద్రా యోజన పథకమునకు సంబంధించిన రుణములను ప్రభుత్వ రంగ బ్యాంకులైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI), స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (SBH), సిండికేట్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, కార్పొరేషన్ బ్యాంకు, కెనరా బ్యాంకు మొదలగు అన్ని రకముల బ్యాంక్‌లతో పాటు, రూరల్ బ్యాంకులైన ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మొదలగునవి మరియు ప్రైవేటు బ్యాంకులైన ఐసిఐసిఐ, హెచ్‌డిఎఫ్‌సి, కరూర్ వైశ్యా బ్యాంక్, లక్ష్మీవిలాస్ బ్యాంక్ లాంటి వారు కూడా ముద్రాయోజన రుణములను ఇస్తున్నారు.



**రుణము పొందే విధానము:** ముద్రా యోజన రుణములను పొందుట కొరకు మీకు ఖాతా ఉన్న లేదా మీకు సమీపంలోనున్న బ్యాంకును సంప్రదించిన అక్కడి బ్రాంచి మేనేజర్ లేదా ఫీల్డ్ ఆఫీసర్ మీకు అన్ని వివరములు తెలియజేస్తారు. వారి ద్వారా తెలుగు/ ఇంగ్లీషులలో ఉన్న దరఖాస్తును పొంది దానిని భర్తీ చేయవలెను. జతపర్చవలసిన డాక్యుమెంట్లతో పాటు, చేస్తున్న వ్యాపారమునకు ఆధారములు లేదా చెయ్యబోయే వ్యాపారమునకు సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టును సమర్పించవలెను.

ముద్రా రుణములకు నిర్దిష్ట కాలపరిమితి లేదు. బ్యాంకులలో రుణం కోసం సంవత్సరంలో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకొనవచ్చును.

దరఖాస్తుదారుడు ఏ బ్యాంకులోగాని/ ఆర్థిక సంస్థలో గాని డిపాల్టర్‌గా ఉండరాదు.

**దరఖాస్తుతో పాటు సమర్పించవలసిన పత్రాలు:**

1. **గుర్తింపు ధృవపత్రము:** ఓటర్‌కార్డు/ డ్రైవింగ్ లైసెన్స్/ పాన్‌కార్డు/ ఆధార్‌కార్డు/ పాస్‌పోర్టు/ ప్రభుత్వం ఇచ్చిన ఫోటో గుర్తింపుకార్డు.



పైవానిలో ఏదైనా రెండు ధృవపత్రములు సమర్పించాలి.

2. **నివాస ధృవపత్రము:** ఇటీవల టెలిఫోన్ బిల్లు/ విద్యుత్‌బిల్లు/ ఆస్తిపన్ను రశీదు (2 నెలలకు మించనిది)/ బ్యాంక్ పాస్‌బుక్/ స్వస్థల ధృవీకరణ పత్రం/ ప్రభుత్వ / స్థానిక పంచాయతీ/ పురపాలక సంస్థచే ధృవీకరించిన పత్రము మొదలగునవి.
3. దరఖాస్తుదారుడు ఇటీవల తీయించుకొన్న ఫోటోలు 2/6 నెలలు మించరాదు.
4. కొనదలచిన మిషనరీ యొక్క కొటేషన్
5. సప్లయిర్ పేరు/ చిరునామా/ కొనుగోలు చేయదలచిన మిషనరీ వివరములు, విలువ
6. కిషోర్/ తరుణ్ విభాగ రుణముల కొరకు వ్యాపార సంస్థ గుర్తింపు/ చిరునామా ధృవపత్రం/ ఇటీవల లైసెన్స్‌లు/ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లు/ ఓనర్‌షిప్‌కి సంబంధించిన డాక్యుమెంట్లు/ బిజినెస్ యూనిట్ గుర్తింపు/ చిరునామా రుజువు ఏదైనా
7. అభ్యర్థి ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/మైనారిటీ కమ్యూనిటీ అయినట్లయితే ఇటీవల ధృవీకరణ పత్రం

**ఎటువంటి హామీ అవసరం లేదు:** ముద్రాబ్యాంకు రుణములను పొందేందుకు ఎటువంటి హామీ అవసరం లేదు. ఆస్తిపాస్తులు గాని, ఇతర సెక్యూరిటీలను హామీగా ఉంచవలసిన పనిలేదు. ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు లేదు.

**డెబిట్ కార్డు సౌకర్యం:** ముద్రాబ్యాంకు రుణములను ముద్రా కార్డు పేరుతో డెబిట్ కార్డు ద్వారా బ్యాంకు ద్వారా అందజేస్తారు. దానిని ఓవర్‌డ్రాఫ్ట్ కార్డుగా చెప్పుకోవచ్చు. ముద్రాకార్డు ద్వారా అన్ని ఎటిఎంల నుండి నగదు డ్రా చేసుకొనవచ్చును. లేదా పిఓఎస్ యంత్రముల ద్వారా వ్యాపారసంస్థలలో వస్తువులు కొనుగోలు చేయవచ్చును. బ్యాంకు ఖాతాలో ఎలాంటి నగదు నిల్వలేకపోయినా బ్యాంకుల డెబిట్ కార్డులాగానే నిర్దిష్ట పరిమితి వరకు నగదు పొందవచ్చును.

**ముద్రాబ్యాంకు రుణములపై సబ్సిడీ ఉందా?:**

వాస్తవముగా ముద్రాబ్యాంకు రుణములపై ఎటువంటి సబ్సిడీ లేదు. అయితే తీసుకొన్న రుణములను జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా తాము చేసే వ్యాపారములను రిజిస్ట్రేషన్ చేయించుకొని ముద్రాబ్యాంక్ ద్వారా తీసుకొన్న రుణములకు అన్ని వర్గముల వారు సబ్సిడీ పొందవచ్చును. ఎస్సీ/ఎస్టీ పురుషులకైతే 35%, మహిళలకు 45% వరకు సబ్సిడీ ఇస్తారు. ఓసీ/బీసీ వర్గముల వారికి కూడా జిల్లా పరిశ్రమల కేంద్రం వారు నిర్ణయించిన మేరకు రాయితీ ఇవ్వడం జరుగుతుంది.

ముద్రా రుణముల చెల్లింపు విధానము: ముద్రాయోజన పథకము ద్వారా తీసుకున్న రుణములను 48 వాయిదాల నుంచి గరిష్టంగా 84 వాయిదాలు (7 సం॥లు) లోపు చెల్లించవచ్చును. బ్యాంకులకు ముద్రాబ్యాంకు వారు కేవలం 7% వడ్డీకి అందిస్తుండగా ఆయా బ్యాంకు యాజమాన్యములు రుణములను తీసుకొనే వారి నుండి వడ్డీ క్రింద 0.80పైసల నుండి 0.91% వరకు వసూలు చేస్తున్నాయి. ప్రైవేటు బ్యాంకులు అయితే సుమారు రూ.1 వరకు వడ్డీ అయ్యే అవకాశం ఉంది.

**గ్రామీణ బ్యాంకులకు నాబార్డు (NABARD) సూచనలు**

ప్రధానమంత్రి ముద్రాయోజన (PMMY) పథకమును 2015 ఏప్రిల్ 8వ తేదీన ప్రారంభించారు. గ్రామీణ బ్యాంకుల ద్వారా 2015-16 ఆర్థిక సంవత్సరంలో లబ్దిదారులకు రుణములు అందించేందుకు నాబార్డు బ్యాంకుల వారీగా లక్ష్యములను నిర్ణయించింది. ఈ పథకము ద్వారా వస్తువుల ఉత్పత్తి వ్యాపారము, సర్వీసులు వంటి యూనిట్లు ఏర్పాటు చేసుకొనే వారికి రూ.10 లక్షల వరకు రుణములు ఇవ్వాలి. ప్రధానమంత్రి జన్‌ధన్‌యోజన (PMJDY) పథకంలో అర్హులకు రూ.5000/- ఓవర్ డ్రాఫ్ట్ ఇచ్చే సదుపాయం ఉంది. దానిని కూడా ప్రధానమంత్రి





ముద్రాయోజన PMMY ద్వారా రుణములు ఇచ్చే పథకంలోకి మార్చవచ్చును.

1. ప్రధానమంత్రి ముద్రాయోజన పథకం కింద దరఖాస్తులను రూపొందించుకోవాలి.
2. బ్యాంకుశాఖలలో ఈ పథకంలో లావాదేవీలు చేసేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఈ కౌంటర్ ద్వారా లబ్దిదారుల నుండి దరఖాస్తులు తీసుకోవాలి.
3. ఈ పథకము అమలును పర్యవేక్షించేందుకు రీజనల్ లేదా ప్రధాన కార్యాలయములో ఒక నోడల్ అధికారిని నియమించుకోవాలి.
4. ఈ పథకం అమలులో నెలవారీ నివేదికను ప్రభుత్వం నిర్దేశిత నమూనాలో తెలిపిన విధముగా నింపి ప్రతి నెలా 3వ వారంలో పంపాలి.

**ప్రభుత్వ బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు**

ప్రభుత్వ రంగ బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ఇలా ఉన్నాయి.

1. నాబార్డు సూచనలను పాటించాలి.
2. మెగారుణ మేళాలు ఏర్పాటు చేసి అర్హులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి.
3. రిటైల్ వ్యాపారులు, చేనేత పనివారు, హస్తకళాకారులు, వీధి వ్యాపారులు పాల వ్యాపారులు, వృత్తిదారుల స్వయం ఉపాధి చేసుకొనేవారు, చిరువ్యాపారులలో అప్పులు తిరిగి చెల్లించే వారిని గుర్తించి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలి. ఇప్పటికే రుణాలు తీసుకొని చెల్లించని వారికి ఎగవేతదారులకు, అప్పులు సకాలంలో చెల్లించని వారికి తప్ప మిగతా వారందరికీ రుణములు ఇచ్చేందుకు ఎంపిక చేయ్యాలి.
4. రీజనల్ మేనేజర్లు అన్ని శాఖలను సమన్వయపర్చి రుణమేళలలో రుణాల ఎంపిక లేఖలను ఇచ్చి మేళాలు విజయవంతమయ్యేలా చేయాలి.

5. రుణము పొందే దరఖాస్తులు తెలుగులో దరఖాస్తుదారులకు అందుబాటులో ఉంచి అర్హుడైన ప్రతి చిరువ్యాపారస్తునికి ముద్రాయోజన ఋణం అందేలా ప్రయత్నించాలి.

**ఇక నుండి ముద్రాబ్యాంక్:**

బ్యాంకింగేతర ఆర్థిక సేవల సంస్థ (NBFC) ముద్రా లిమిటెడ్‌ను ముద్రాబ్యాంకుగా మార్చేందుకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్రవేసింది. మోదీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ముద్రాయోజన పథకం ద్వారా ఇచ్చే రుణములకు క్రెడిట్ గ్యారంటీ ఫండ్‌ను ఏర్పాటు చేయడానికి కేబినెట్ అంగీకరించినది. ఇప్పుడున్న ముద్రాలిమిటెడ్ ఇకపై ముద్రా(సిడ్బి)బ్యాంక్‌గా మారుతుంది. ఇది ప్రస్తుతం ఉన్న చిన్నపరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (సిడ్బి)కి పూర్తిస్థాయి అనుబంధ సంస్థగా కొనసాగుతుంది.

ముద్రాయోజన క్రింద సూక్ష్మ, చిన్న వ్యాపార యూనిట్లకు బ్యాంకులు అందించిన రూ.లక్ష కోట్లకు పైబడిన రుణములకు తొలిదశలో క్రెడిట్ గ్యారంటీ ఫండ్ క్రింద ప్రభుత్వం గ్యారంటీని అందించనుంది. దీని వలన ఈ పథకములో ఎదురయ్యే అప్పు ఎగవేతలు (డిఫాల్ట్‌లు) విషయంలో బ్యాంకులు ఆర్థిక సంస్థలకు రిస్క్ తగ్గుతుంది. క్రెడిట్ గ్యారంటీ ఫండ్ ఫర్ ముద్రా యూనిట్స్ (CGFMU) పేరుతో దీన్ని ఏర్పాటు చేస్తారు. 2015 ఏప్రిల్ 8 నుంచి ఈ స్కీమ్ కింద మంజూరయిన రుణములన్నింటికీ ప్రభుత్వం గ్యారెంటీ వర్తిస్తుంది. నేషనల్ క్రెడిట్ గ్యారంటీ ట్రస్టీ కంపెనీ (NCGTC). ఈ CGFMUకు ట్రస్టీగా వ్యవహరిస్తుంది.

రుణ పోర్టు ఫోలియో ఆధారంగా మొత్తం ఋణంలో డిపాల్ట్ అయిన దానిలో గరిష్టంగా 50% వరకు బ్యాంకుల ఆర్థిక సంస్థలకు ఈ CGFMU గ్యారంటీని అందించేందుకు వీలవుతుంది. ప్రతిపాదిత ముద్రా బ్యాంకుకు రూ.20,000/- కోట్లు వరకు రీఫైనాన్స్ మూలనిధి (కార్పస్) క్రెడిట్ గ్యారంటీ ఫండ్‌కు రూ.3000 కోట్లు మూలనిధిని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2015-16) బడ్జెట్ నుంచే అందించనున్నారు.

– కోమట్ల త్రినాథరెడ్డి





# తెలంగాణలో డిజిటల్ ఆరోగ్య సేవలు

## రోగులకు ఆధార్ తరహా యూనిక్ నంబర్

తెలంగాణలో వైద్య, ఆరోగ్య రంగంలో మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగానే త్వరలో డిజిటలైజ్డ్ హెల్త్‌కేర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పంచాయతీరాజ్ శాఖమంత్రి కె.తారకరామారావు చెప్పారు. డిజిటలైజ్డ్ హెల్త్‌కేర్‌లో భాగంగా పౌరుల ఆరోగ్య సంబంధిత సమాచారాన్ని పొందుపర్చనున్నామని తెలిపారు. ప్రత్యేకమైన ఆధార్ తరహాలో యూనిక్ నంబరు కేటాయించి 3.60 కోట్ల మంది లబ్ధిపొందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గురువారం నగరంలోని హయత్ హోటల్‌లో ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ హెల్త్‌కేర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విభాగం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య రంగంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలు సైతం ఈ రంగంలో పలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని, నేడు అంతర్జాతీయ సమస్యగా ఆరోగ్య సంరక్షణ రంగం మారిందన్నారు.

ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు బలపడాల్సిన అవసరం ఉందని, ఇందుకు ప్రభుత్వం తరఫున సహాయ, సహకారాలు ఉంటాయని, పన్ను మినహాయింపు అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగం వెనుకబడి ఉందని, గత కొన్ని సంవత్సరాలుగా తాను ప్రజా ప్రతినిధిగా ఈ విషయం గమనించానని అన్నారు. వైద్య ఆరోగ్య రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తున్నదన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని 1000 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వెబ్‌క్యాంలను ఏర్పాటు చేసి, ఆధునిక టెక్నాలజీని జోడించి ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించనున్నామని చెప్పారు. రాష్ట్రంలోని పౌరులందరి సౌకర్యార్థం డిజిటలైజ్డ్ హెల్త్‌కేర్ విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో ఐటీ, ఏరోస్పేస్-డిఫెన్స్, హెల్త్‌కేర్ రంగాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. నాస్కాం చైర్‌పర్సన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ వీబీ దేశాయ్, ఇండియన్ రివర్స్ అడ్వయిజర్స్ కార్పొరేషన్ ఎండీ అవినాష్, ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ పీజే నారాయణన్, ప్రొఫెసర్ వాసుదేవ వర్మలతో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### త్వరలో రెండు ఇంక్యుబేషన్ కేంద్రాలు

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటైన గేమింగ్-యానిమేషన్ కేంద్రాన్ని మంత్రి కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టార్టప్‌ల కేంద్రం టీ హబ్‌ను విజయవంతంగా ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుడుతున్నదని తెలిపారు. ఇందులో గేమింగ్-యానిమేషన్ కేంద్రం ఒకటి కాగా మరొకటి ఏరోస్పేస్ హబ్ అని వివరించారు. ఏరోస్పేస్ హబ్ ఏర్పాటుచేయడంలో భాగంగా విమానరంగంలో దిగ్గజ సంస్థలైన బోయింగ్, ప్రాట్ అండ్ విట్నీతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు మొదలుపెట్టినట్లు మంత్రి తెలిపారు. వచ్చే ఏడాది మార్చికల్లా ఏరోస్పేస్ హబ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా ఐఐటీ హైదరాబాద్‌తో సమన్వయం చేసుకోనున్నట్లు వివరించారు.

– మీడియా రిలీజ్



# పేదల జీవితాలకు ఉపాధినిచ్చిన యంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం

భారతదేశం అమలు చేయుచున్న పేదరిక నిర్మూలన కార్యక్రమాలలో పేదలకు భరోసా కల్పిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కల్పన పథకం (MGNREGES) ఒకటి. దీన్ని ఫిబ్రవరి 2వ తేదీ 2006 సంవత్సరంలో మహబూబ్‌నగర్ జిల్లా కరలకుంట్ల గ్రామం నుండి ప్రారంభించారు. దీని ద్వారా ఎంతో మంది పేదలు తమ గ్రామాన్ని విడిచి బ్రతుకు కోసం కూలి కోసం వేరే ఊరు/ గ్రామం వెళ్లకుండ ఉన్న చోటనే కూలీ కల్పించడం, అందుకు రోజు వేతనం నెలనెలా చెల్లించడం చేస్తున్నారు. రోజువారి కూలీ రూ.140. సంవత్సరంలో 145 రోజులు ఉపాధి కల్పిండఎచం జరుగుతుంది. ఆ విధంగా పేద కూలీలకు కూలీ కల్పించడం జరుగుతుంది. ఈ దశాబ్దకాలంలో ఎంజీఎన్ఆర్‌జిఎస్ పథకం నిర్వహణలో ఉత్తమ ఫలితాలను పురస్కరించుకొని ఫిబ్రవరి 2 తేదీన తెలంగాణాకు నాలుగు బహుమతులు, ఆంధ్రప్రదేశ్‌కు మూడు బహుమతులు ఇచ్చారు. ఈ పథకంతోపాటు తెలంగాణాలో ఇతర గ్రామీణ పథకాలను అమలు చేయుటలో తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయత్‌రాజ్, ఐటి శాఖ మంత్రిని శ్రీ కె.టి.రామారావును కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి భీరేంద్రసింగ్ ఎంతగానో ప్రశంచించారు. అదే విధంగా 'భగీరథ పథకం' క్రింద (వాటర్‌గ్రిడ్ పథకం) ఇంటింటికి నల్లా నీళ్లు సప్లయి చేయడం జరుగుతుందని కేటీఆర్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రుల సమావేశంలో వివరించారు. కరువు పరిస్థితులు నెలకొన్న నిజామాబాద్ జిల్లాకు ఉత్తమ అవార్డు లభించింది. జిల్లాలో దుర్భిక్ష పరిస్థితుల్లో వ్యవసాయ పనులు లేక అల్లాడుతున్న పేదలను ఆదుకోవాలనే తపనతో ఈ పథకం 200 రోజులకు పెంచి అమలు చేయాలని విజ్ఞప్తులు చేయడమైంది.

పేదలే అసలైన అవార్డు గ్రహితలు: ఎంజిఎన్ఆర్ఇజిఎస్ అవార్డును అందుకున్న నిజామాబాద్ కలెక్టర్ యోగితారాణా మాట్లాడుతూ

ఎ) దేశంలోనే ఎక్కువ మంది లబ్ధిదారులను ఈ పథకం క్రిందకు తెచ్చినందుకు నిజామాబాద్ జిల్లాకు ఉత్తమ అవార్డు లభించిందని చెప్పారు. జిల్లాలో దుర్భిక్ష పరిస్థితుల్లో వ్యవసాయ పనులు లేక



బి) నిజామాబాద్ జిల్లాకు అత్యధిక శారీరక వికలాంగులకు పథకంలో భాగస్వామ్యులను చేసినందుకు కూడా అవార్డు దక్కింది.

సి) లబ్ధిదారులకు మూడు రోజుల వ్యవధిలోనే పారితోషకాన్ని చెల్లించడంలో ఉత్తమ అవార్డు లభించింది.

డి) ఈ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు లబ్దిదారుల చెంతకు చేర్చి ఉత్తమ ఫలితాలను సాధించినందుకు మరో అవార్డు లభించింది. ఈ అవార్డులే కాక పలువురకు ప్రశంసాపత్రాలు కూడా లభించాయి.

లబ్ధిదారులకు చొరువ తీసుకొని వేతనం చెల్లినందుకు గాను కరీంనగర్ జిల్లా చందుర్తి గ్రామ సర్పంచ్ గొట్టి భాకర్‌కు వ్యక్తిగత విభాగంలో ప్రశంసాపత్రం లభించింది. గత ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా 734 శ్రమశక్తి గ్రూపులకు ఉపాధి హామీ పనులు కల్పించడంలో చొరవ తీసుకొన్నందుకు గాను కరీంనగర్ జిల్లా ఎల్లారెడ్డిపేట మండల సహాయ ప్రోగ్రామ్ ఆఫీసర్ లింగపల్లి నర్సయ్యకు ప్రశంసాపత్రం లభించింది. ఈ పథకంలో అత్యధిక లబ్ధిదారులకు అందేలా చూసినందుకు గాను ఎల్లారెడ్డి మండలంకు ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్‌కు ప్రశంసాపత్రం ఇచ్చారు.

ఎక్కువ రోజులు పనిచేసి కుటుంబ ఆర్థిక స్థితులను చక్కదిద్దుకున్నందుకు వెలగటూరు మండలం జగదేవిపేట సర్పంచ్ పొన్నం రాజమల్లయ్యకు, కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్‌కు చెందిన తాంద్రప్రమీలకు ప్రశంసాపత్రాలు లభించాయి. ఎల్లారెడ్డిపేట మండలం మదిమల్ల గ్రామ కూలీ బంటు ఆనంద్ కూడా ఈ పథకాన్ని ఎక్కువ స్థాయిలో ఉపయోగించుకున్నందుకు ప్రశంసాపత్రం లభించింది.

నిజామాబాద్ జిల్లా మొత్తం మీద 4.5 లక్షల మంది లబ్ధిదారులున్నారని గత రెండు నెలల్లో 2 లక్షల మందికి 100 రోజులకుపైగా హామీ పనుల్లో పాల్గొన్నారు. వీరిలో ఎస్సీ/ఎస్టీ జనాభాలో సుమారు 75% మంది ఈ పథకం క్రింద లబ్ధిపొందుతున్నారని, శారీరక వికలాంగ జనాభాలో సుమారు 85% లబ్ధిపొందుతున్నారు. జిల్లాలో పేదలకు ఈ పథకం స్థిరమైన జీవనాధరంగా ఉందన్నారు. ఈ పథకం క్రింద పశువుల షెడ్లు, బయోగ్యాస్ ప్లాంటుల్లు పొలాల్లో ఇండ్ల నిర్మాణంను ప్రోత్సహించుతున్నామన్నారు. సగటున 50% కంటే ఎక్కువ సంతృప్తికరంగా జరిగిన జిల్లాలను ఉత్తమ ఫలితాలు సాధించినట్లుగా పరిగణించి అవార్డుకు ఎంపిక చేశారు. నిజామాబాద్ జిల్లాలో ఇది 65%గా ఉన్నది. ఉపాధి పథకంను పారదర్శకతతో పాటిస్తూ లోపాలు జరిగిన చోట్ల సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నామని కొన్ని చోట్ల డబ్బుల్ని రికవరి చేశారు. సోషల్ ఆడిట్‌లో జిల్లాలో ఇప్పటికి 9 రైండ్ల ప్రక్రియ పూర్తయింది.

తెలంగాణాకు నాలుగు జాతీయ అవార్డులు: తెలంగాణ రాష్ట్ర ఉపాధి హామీ పథకంలో జాతీయ స్థాయిలో 4 అవార్డులను పొందింది. ఉపాధి హామీ 10వ వార్షికోత్సవంలో ఫిబ్రవరి 2, 2016 కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బీరేంద్రసింగ్ చౌదరీలు ఈ అవార్డులను అందజేశారు.

సామాజిక సమ్మిళితం (Social Inclusive) అంశంలో అవార్డును పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ అనిత రామచంద్రన్‌లు అందుకున్నారు. పారదర్శకత, జవాబుదారీతనంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ సామాజిక తనిఖీ డైరెక్టర్ సౌమ్య కిదాంబినిలు అందుకున్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాగా నిజామాబాద్ ఆ జిల్లా కలెక్టర్ యోగితారాణా, ఉత్తమ గ్రామంగా కరీంనగర్ జిల్లా చందుర్తి ఎంపిక కాగా ఆ అవార్డును గ్రామసర్పంచ్ గొట్టి ప్రభాకర్ అందుకున్నారు. ఉపాధి హామీ కూలీ నుంచి రైతుగా మారిన మెదక్ జిల్లా సిద్దిపేట మండలం రాఘవపూర్‌కు చెందిన కె.వెంకటయ్య గాధను ఈ సందర్భంగా ప్రదర్శించారు. అనంతరం రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు.



ఈ ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకంను దశాబ్దకాలం నుంచి అమలు చేస్తూ 2016 ఫిబ్రవరి 2న పదకొండో సంవత్సరంలో ప్రవేశించింది. కాని ఈ పథకంను అయ్యే ఖర్చును తగ్గించివేసింది. బిజెపి ప్రభుత్వం ఈ పథకంను మొత్తం 28 రాష్ట్రాలలో 12 రాష్ట్రాలు అమలు చేయడం లేదు. అంతేగాక బిజెపి ప్రభుత్వం కార్పొరేటు సెక్టార్‌కు రాయితీలు, సెజ్‌లను ఏర్పాటు చేయడంలోని శ్రద్ధను పేదలకు ఉపయోగపడే పథకంను నిర్వీర్యం చేయడం కూడదు. అంతేగాక ఈ పథకంకు అయ్యే ఖర్చంత ఒక సెట్‌కు ఇచ్చే రాయితీ లక్ష కోట్లకు మించి ఉండదు. మోదీ ప్రధాని అయ్యాక గతంలో యుపిఏ ప్రభుత్వం అమలుచేసిన పథకాలకు బడ్జెట్‌లో డబ్బు కేటాయించకుండ వేరే పథకాలను అమలు చేయడం జరుగుతుంది అంటారు. వ్యవసాయం మీద ఆధారపడ్డ ప్రజలున్న దేశంలో వ్యవసాయం నిర్లక్ష్యం చేయరాదు. అంతేగాక బిజెపి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి









పథకాలైన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పథకం (BRGF) రాజీవ్‌గాంధీ గ్రామీణాభివృద్ధి పథకం (RIGPS)లను రద్దు చేయడం వలన గ్రామీణాభివృద్ధి కుంటుపడుతుంది. వీటిని పునః కేటాయింపులు చేసేది పోయి రద్దు చేయడం వలన వేలాది మంది పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ఉద్యోగులు పని లేకుండాపోతారు. అంతంత మాత్రంగానున్న పంచాయతీలు మరల ఆధిపత్య రాజకీయాల వైపుపోతాయి. ప్రాంతీయ పార్టీలు అధికారం ఉన్న రాష్ట్రాలలో వారు శ్రద్ధ తీసుకొనేది బదులు కాడిపారేసి పనులను చేయడం లేదు.

గ్రామీణ ప్రాంతాలలో వైద్యం, విద్యకు కేటాయించిన నిధులు సక్రమంగా ఖర్చు అగునట్లు చూడాలి. ఉపాధిని కల్పించే పనులు చేపట్టి ఎక్కువ మందికి పని కల్పించే బదులు మిషన్సే ఉపయోగించి రోడ్లు నిర్మించడం వంటివి చేపట్టడం ద్వారా గ్రామాలలో నిరుద్యోగిత పెరుగుతూ MGNREGES పథకంను PMGSYకి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనకు లింకు చేసి పనిచేయించాలని ప్రణాళిక సభ్యుడు ఎన్.సి.సక్సేనా సూచించారు.

ఉత్తరప్రదేశ్‌లో 48 మిలియన్ల ప్రజలు పేదరికంలో ఉన్నారు. బీహారులో 38 మిలియన్లు పేదవాళ్లు ఉండగా కేవలం రూ.411కోట్లు, రూ.165 కోట్లు మాత్రమే MGNREGES మీద ఖర్చు చేయడం జరిగింది. కేరళలో 9,655 కోట్లు తమిళనాడులో 5,237 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 1.5 మిలియన్ పేదలు 5.9మి గ్రామీణ పేదలకు ఖర్చు చేసినట్లు లెక్కలు తెలుపుతున్నాయి. దక్షిణ దేశ ప్రాంత రాష్ట్రాలలో పేదరిక నిర్మూలన కార్యక్రమాలు క్రమం తప్పకుండా అమలుచేయుచున్నారు. బీహారులో గ్రామీణ పేదరికంను 55.7% 2004 నుండి 34.1%కు 2014కు తగ్గించడం జరిగింది. దాదాపు బీహారులో 2000 కోట్లు ప్రతి ఏడాది పేదరిక నిర్మూలన మీద ఖర్చు చేయుచున్నది. బీహారు విద్యుత్ మీద ఖర్చు ఎక్కువ చేసి పేదరిక నిర్మూలనకు కేటాయించిన 30,000 కోట్లు ఖర్చు చేయలేదు. కేవలం PMGSY మీద 2,259 కోట్లు 2015-15లో ఖర్చు చేసి MGNREGES మీదకే 1,073 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. కనుక పెద్ద రాష్ట్రాలు పేదలు మీద ఖర్చు చేయవలసిన ధనంను పనులకు కేటాయించి ఖర్చు చేయడం తగదు. ప్రజలు ఉన్న పేదరికంను తగ్గించేందుకు కేటాయించిన ధనంను ఖర్చు చేయకపోవడం అన్యాయంకు ఒడిగట్టినట్లే.

కనుక ప్రతి రాష్ట్రం నీతిఅయోగ్ (ప్రణాళిక సంఘం) కేటాయించిన నిధులను పేదరిక నిర్మూలను MGNREGES కే ఖర్చుచేసి ఉపాధి కార్యక్రమాలు విజయవంతం చేయవలయును. ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి అజామ్ చెప్పినట్లు MGNREGES 200 జిల్లాల్లోనే అమలవుతుంది. మిగతా జిల్లాల్లో మహిళా కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ఖర్చు చేయవలెనని సూచించారు. ఈ MGNREGES పథకం అమలు చేయటం వలన వేతనం సమానంగా అందుతుంది. జండర్ సమానత్వంను పొందవచ్చును. గ్రామాల నుండి తరలిపోతున్న కార్మికులకు ఉన్న ఊరిలోనే ఉపాధించి చూపించి కమ్యూనిటీ అసెట్స్ పెంచవచ్చును. తద్వారా పేదరిక నిర్మూలన పెద్దఎత్తున జరుగుతుంది. అందువలన గ్రామీణ నిధులకు గండివేయకుండా ఖర్చుచేసేలా ప్రభుత్వాలు శ్రద్ధ వహించాలి.

**డాక్టర్ కె.ఆసయ్య, సెంటర్‌హెడ్ సిఎంపి, టిసిపార్డ్**



# గిరిజన తండాల్లో ఉచిత భోజనం

- పౌష్టికాహార లోపాన్ని అధిగమించే యోచనతో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- తొలుత పలు తండాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన గిరిజన సంక్షేమ శాఖ

పౌష్టికాహార లోపం ఎక్కువగా ఉన్న గిరిజన తండాల్లో ఉచిత భోజన పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. త్వరలోనే దీనిని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు గిరిజన సంక్షేమ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఏయే జిల్లాల్లో, ఏయే ప్రాంతాల్లో ఈ ఉచిత భోజన పథకం అవవసరముంది. ఎన్ని సెంటర్లలో అమలు చేయాలి. ఈ బాధ్యతను ఎవరికి అప్పగించాలనే వివరాలతో సమగ్ర ప్రణాళికను రూపొందిస్తోంది.

ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.5కే భోజన పథకం విజయవంతంగా అమలవుతోంది. అన్నార్తుల ఆకలి తీర్చేదిగా ప్రశంసలు అందుకుంటున్న ఈ పథకం స్ఫూర్తితో... దుర్భర పరిస్థితులున్న గిరిజన తండాల్లో ఉచిత భోజన పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో శిశు మరణాలు, పౌష్టికాహార లోపంతో వచ్చే వ్యాధులకు అడ్డుకట్టవేయవచ్చని భావిస్తోంది.


ప్రధానంగా ఆదిలాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మారుమూలన ఉన్న గిరిజ తండాల్లో ఈ దుర్భర పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. అలాంటి తండాలను ఎంపిక చేసుకుని పైలట్ ప్రాజెక్టుగా ఉచిత పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

### అన్ని వయసుల వారికీ....

ప్రస్తుతం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మి పథకం అమల్లో ఉంది. గర్భిణులు, బాలింతలు, 3 నుంచి 6 ఏళ్ల వయసున్న పిల్లలకు ప్రతిరోజు ఒకపూట అన్నం, పప్పు, పాలు, గుడ్డు అందిస్తున్నారు. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ఈ రెండింటినీ కలిపి... గిరిజన తండాల్లో అన్ని వయసుల వారికి ఉచిత భోజనం అందించేలా కొత్త పథకాన్ని రూపొందించనున్నారు. ఇందుకోసం ఎంత ఖర్చవుతుంది. ఎంత మందికి భోజనం వడ్డించాల్సి ఉంటుందన్న వివరాలను అధ్యయనం చేస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. గతంలో జీహెచ్ఎంసీ కమీషనర్‌గా పనిచేసిన సోమేష్‌కుమార్ ప్రస్తుతం గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో రూ.5 భోజన పథకం రూపకల్పనతో పాటు అమలు తీరుతెన్నులపై ఆయనకు స్పష్టమైన అవగాహన ఉంది. దీంతో తండాల్లో పౌష్టికాహార లోపాల్ని అధిగమించే ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా ఉచిత భోజన పథకంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

– వార్తాంశం

# గ్రీన్ సూపర్ రైస్ - నూతన వరి ఆవిర్భావం




చినుకు కరువై, సాగు బరువై, గుండె చెరువై ఖరీదైన విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుమందులు కొనలేని చిన్న, సన్నకారు రైతులకు గ్రీన్ సూపర్‌రైస్ వరం కానుంది.

రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకపోయిన, ఉప్పునీటి తాకిడి ఉన్న, అంతే కాదు కరువు మేఘాలు కమ్ముకున్నా సరే చీడపీడలను తట్టుకొని ఇప్పుడున్న వంగడాల సగటు కన్నా ఎక్కువగా ఎకరానికి 6 టన్నులకు పైగా దిగుబడినిచ్చే వరి వంగడాలు 'ఈ గ్రీన్ సూపర్ రైస్ వంగడాలు'.

ఈ గ్రీన్ సూపర్ వరి వంగడాలు జన్యుమార్పిడి ద్వారా కాకుండా సాంప్రదాయ పద్ధతిలో (హైబ్రిడ్‌ల నుండి) సృష్టించబడినవి. ఈ విత్తనాలు తిరిగి వాడుకోదగినవి కావున రైతులకు భారం కాబోవు. వందలాది దేశవాళి వంగడాలలోని సద్గుణాలను నూటికి నూరుపాళ్ళు పుణికి పుచ్చుకున్న వంగడాలివి!

వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్న తరుణంలో వరిసాగుకు కష్టాల నుంచి గట్టెక్కించడం కోసం గ్రీన్ సూపర్ రైస్ (జిఎస్ఆర్) విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని 1998లో చేపట్టారు. చైనా అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్, ఫిలిఫైన్ లేని అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ప్రపంచ దేశాల నుంచి సేకరించిన 250 దేశవాలి వరి వంగడాలు, హైబ్రిడ్‌లలోని మేలైన లక్షణాలను (ఇంట్రిగ్రేట్ క్రాస్ బ్రీడింగ్, బాక్ క్రాస్ బ్రీడింగ్/ పద్ధతుల ద్వారా ఒడిసిపట్టి కొన్ని గ్రీన్ వంగడాలను దేశవిదేశీ శాస్త్రవేత్తలు రూపొందించారు. తొలిదశలో 16 దేశాల్లో, మలిదశలో మరో 16 దేశాల్లో గ్రీన్ వంగడాల రూపకల్పన, ప్రయోగాత్మక సాగు చేపట్టారు. రెండో దశ ఇప్పుడు ముగింపు దశలో ఉంది.

ఈ గ్రీన్ వంగడాలను ఫిలిఫైన్స్ దేశంలో బొహలీ ప్రాంతంలో గల ఉప్పునీటి పొలాల్లో మరియు నీటి ఎద్దడి గల పొలాల్లో సాగుచేసి ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఈ వంగడాలు మొక్క పొట్టదశలో ఉన్నప్పటికి కూడా నీటి ఎద్దడిని తట్టుకొని దిగుబడిని ఇవ్వగలవు. ఈ గ్రీన్ వంగడాల వలన రైతులకు సాగు వ్యయం తగ్గడమే కాకుండా భూమి, నీరు, పర్యావరణ కాలుష్యం బాగా తగ్గనుంది. ఈ గ్రీన్ వంగడాలు వివిధ ప్రాంతాల్లోని ప్రజల ఇష్టాఇష్టాలకు అనుగుణంగా ఉండేలా రూపొందించామని అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డా॥ జహర్ అలీ వివరించారు. సాధారణ వరి వంగడాలు అసలు మనుగడ సాగించలేని పరిస్థితులలోను, సగటు కన్నా అధిక దిగుబడినివ్వడం గ్రీన్ వంగడాల ప్రత్యేకత.

ఈ గ్రీన్ వంగడాలు వియత్నాంలో 25 వేల హెక్టార్లు, ఫిలిఫైన్స్‌లో 5,700 హెక్టారులలో సాగుచేస్తున్నారు.

మనదేశంలో 2011లో కొన్ని గ్రీన్ వంగడాలను స్వల్ప మోతాదులో రసాయనిక ఎరువులు వాడి అనేక చోట్ల పండించగా, వాడుకలో ఉన్న వంగడాల కన్నా '11' గ్రీన్ వంగడాలు అధిక దిగుబడినిచ్చాయని డైరెక్టరేట్ ఆఫ్ రైస్‌రీసెర్చ్ పేర్కొంది. ఈ వంగడాలు నత్రజని, ఫాస్పరస్ నిల్వలు తక్కువగా గల భూముల్లోనూ దిగుబడి బాగుందని వరి పరిశోధన సచివాలయం పేర్కొంది.

పర్యావరణానికి హాని చేయని, రైతుల సాగుబడి వ్యయం తగ్గించే జన్యుమార్పిడి కాని గ్రీన్ వరి వంగడాలు అందుబాటులోకి రావడం రైతులకు భరోసా, భవిష్యత్ తరాలకు శుభప్రదం.

టి.నరేందర్, పి.మధుకర్, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ఎండి గౌస్, ఎస్.ప్రణీత్, కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్, పిహెచ్‌డి స్కాలర్స్, పిజెటిఎస్ఎయు

# గత విధానాల వల్ల ఏర్పడిన కరువు పరిస్థితులు - తెలంగాణ ప్రభుత్వ వ్యూహం







ప్రఖ్యాత జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ 'ఎవ్రీవన్ లవ్స్ ఎ గుడ్ డ్రౌట్' అనే పేరుతో 1996లో ఓ పుస్తకం రాశారు. దేశంలో చాలా పేదరికం అనుభవిస్తున్న ప్రజలుండే జిల్లాల్లో కలియ తిరిగి రాసిన పుస్తకమది. కరువు ఏర్పడటానికి కారణాలు, దాని వల్ల పేదలు పడే ఇబ్బందులు, ప్రభుత్వం చేయాల్సిన పనులు అన్నింటినీ కూలంకషంగా చర్చించారు.

కరువును నిర్ధారించడానికి కరువును ఎదుర్కోవడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతులు, దాని వల్ల ఎవరికి మేలు కలుగుతున్నదనే విషయాలను లోతుగా అధ్యయనం చేసి అక్షరీకరించారు. ఆ పుస్తకం జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నది కానీ, ఏ ప్రభుత్వం కూడా దాన్నొక పాఠంగా స్వీకరించలేదు. సాయినాథ్ తర్వాత కూడా కరువు మీద పుస్తకాలు వస్తున్నాయి. వ్యాసాలు వస్తున్నాయి. మీడియాలో ఎపిసోడ్ల మీద ఎపిసోడ్ల వార్తలు వస్తున్నాయి. కానీ కరువు మాత్రం మళ్లీ మళ్లీ పేదింటి తలుపు తడుతూనే ఉన్నది. వర్షాలు సరిగా పడకపోవడం వల్ల కరువు వస్తుందనే ఓ ప్రాథమిక సూత్రీకరణతో ప్రజలను సమాధానపరుస్తున్నారు. విచిత్రమేమిటంటే వర్షాభావ పరిస్థితులకు కరువు పర్యాయపదంగా మారింది.

కరువు అనుకోకుండా వచ్చే సునామీ కాదు. అయినా సరే ప్రభుత్వం కరువును ఓ ప్రకృతి వైపరీత్యంగానే చూస్తున్నది. కేంద్రం రాష్ట్రాలకు కేటాయించే స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ కింద ఇచ్చే డబ్బులనే కరువును ఎదుర్కోవడానికి ఖర్చు పెట్టాలనే నిర్దేశిస్తున్నది. సాధారణ వర్షపాతం కన్నా ఎక్కువగానో, తక్కువగానో వర్షాలు కురవడం చాలా సాధారణం. ప్రపంచంలో ఏ దేశంలోనైనా, ఏ ప్రాంతంలోనైనా వర్షపాతం ఏటా ఒకే విధంగా ఉండదు. హెచ్చుతగ్గులుంటాయి. అలాంటి సమయంలో అనుసరించాల్సిన వ్యూహం సిద్ధంగా ఉండాలి. వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం వల్ల కరువు వస్తుందనేది అందరూ నమ్మే మాట. కానీ వర్షాభావ పరిస్థితులను అధిగమించడానికి దీర్ఘకాలిక వ్యూహాలు అనుసరించకపోవడం వల్ల మాత్రమే కరువు వస్తుంది. ఈ విషయంలో ఇప్పటివరకు అటు కేంద్రస్థాయిలో గానీ, ఇటు రాష్ట్రస్థాయిలో గాని పాలకులు దీర్ఘకాలిక వ్యూహాలు అనుసరించకపోవడం వల్ల మాత్రమే కరువు వస్తుంది. ఈ విషయంలో ఇప్పటివరకు అటు కేంద్ర స్థాయిలో గానీ, ఇటు రాష్ట్ర స్థాయిలో గానీ పాలకులు దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకుపోలేదు. పాలకుల దృష్టిలోపం వల్ల వచ్చే కరువును ప్రకృతి శాపంగా చిత్రీకరిస్తున్నారు. నిజంగా కరువు ప్రకృతి వైపరీత్యం కాదు. సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తున్న పాలకుల నేర ఫలితం కరువు. అంతే కాదు కరువును నిర్ధారించడానికి, కరువును ఎదుర్కోవడానికి ఇప్పుడున్న పద్ధతులు పూర్తిగా అశాస్త్రీయంగా ఉన్నాయి.

తెలంగాణలో ఏడాదికి 907 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాలి. వర్షాకాలంలగా పరిగణించే జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు 713 మి.మీ. వర్షపాతం ఉండాలి. కానీ ఈ ఏడాది 611మి.మీ.కు






805 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది. ఆదిలాబాద్ జిల్లాలో 984 మి.మీ.కు 805 మి.మీ., ఖమ్మంలో 875 మి.మీ.కు 977 మి.మీ. వర్షపాతం నమోదు కావడంతో ఆ జిల్లాలు కరువు జాబితాలో లేవు. మిగతా ఎనిమిది జిల్లాలు కరువు జిల్లాలే. అయితే ఈ జిల్లాల్లో కూడా కొన్ని మండలాల్లో వర్షపాతం తక్కువగా, మరి కొన్ని మండలాల్లో వర్షపాతం ఎక్కువగా నమోదైంది. దాని ఆధారంగా కరువు మండలాల జాబితా తయారైంది. ఇది కూడా ఓ అశాస్త్రీయ పద్ధతే. వర్షపాతాన్ని లెక్కకట్టే సమయంలో జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకుపడిన వర్షం మొత్తాన్ని లెక్కలోకి తీసుకుంటున్నారు.

ఈ సారి జూన్ మొదటివారంలో బాగానే వానలు పడ్డాయి. దీంతో రైతులు వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. ఎంతో పెట్టుబడి పెట్టి పంటలు వేశారు. కానీ జూలై, ఆగస్టులలో అసలు వానలే లేవు. దీంతో ఆ పంటలు ఎండిపోయాయి. కానీ సెప్టెంబర్ మధ్య నుంచి మళ్లీ వానలు జోరందుకున్నాయి. వర్షపాతం లెక్కల్లో ఆ వాన చుక్కలు కలిశాయి కానీ పంటలకు ఉపయోగపడలేదు. లెక్క ప్రకారం చూస్తే వర్షపాతం బాగానే ఉన్నట్లు నమోదైన మండలాల్లో నిజంగా కరువు పరిస్థితులుండడానికి కారణం ఇదే.

వర్షపాతంతో పాటు పంటలు వేసిన వ్యవసాయ భూమి యాభై శాతం కన్నా తక్కువగా ఉండటం, పంట దిగుబడి 33 శాతం తగ్గడం, వరుసగా 21 రోజుల పాటు వర్షాలు పడకుండా ఉండటం, పంటలో పచ్చదనం, భూమిలో తేమశాతం తదితర లెక్కలతో కరువును నిర్ధారిస్తారు. వీటన్నింటిలో ప్రధానమైనది వర్షపాతం తక్కువగా ఉండటమే. వర్షపాతం లెక్కలు వేయడంలోనే అసలు లోపముంది కాబట్టి, కరువు ప్రాంతాల నిర్ధారణలోనే లోపం ఉన్నది. సరే, కరువు వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఏమిటి? అనే విషయంలో కూడా ప్రభుత్వానికి స్థిరమైన అవగాహనే ఉన్నది. కరువు వల్ల పంటలు పండవు. భూగర్భ జలాలు అడుగంటిపోతాయి. ప్రజలకు మంచినీళ్ల సమస్య ఏర్పడుతుంది. పశువులకు మేత దొరకదు. కూలీలకు పని దొరకదు. వీటిని ఎదుర్కోవడానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి. మంచినీళ్ల కోసం అప్పటికప్పుడు బోర్లు వేయాలి. దేశంలో ఎక్కడ పశు గ్రాసం ఉన్నా కొనుక్కురావాలి. ఉపాధిహామీ పనిదినాలు పెంచాలి. అవసరమైతే కరువు పింఛన్లు కూడా ఇవ్వాలి. ఇదీ ఇప్పటివరకూ ఉన్న కరువు గురించి తెలుసుకోవడానికి కేంద్ర బృందాలు వచ్చాయి. తిరిగాయి. కరువు చూశాయి. రాష్ట్ర ప్రభుత్వం దగ్గరున్న రూ.270 కోట్ల దాకా వాడుకునే అవకాశం కల్పించడంతో పాటు, మరికొన్ని డబ్బులిచ్చి కేంద్రం చేతులు దులుపుకుంటుంది. ఆ డబ్బులకు మరికొంత జమ చేసి ఎకరాకు మూడు, నాలుగు వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందిస్తుంది. కొన్ని బోర్లు, కొంత గడ్డి కూడా వస్తుంది.

అంతే తప్ప అంతకు మించి ఏమీ జరగదు. ఈ పరిస్థితిపై సీఎం కేసీఆర్ తన అభిప్రాయాలను కేంద్ర బృందానికి నిర్మొహమాటంగానే చెప్పారు. అసలు కరువును ఎదుర్కోవడానికి అనుసరించే పద్ధతులు ఇవి కానే కాదని తేల్చిచెప్పారు. దీర్ఘకాలిక వ్యూహం కావాలని డిమాండ్ చేశారు. కేంద్రం సంగతలా ఉంచితే, కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అసలు రాష్ట్రంలో కరువే ఉండకుండా చేయడానికి తీసుకుంటున్న చర్యలను కూడా వివరించారు.

నిజానికి కరువును ఎదుర్కోవడానికి దీర్ఘకాలిక వ్యూహం ఉండాలి. అగ్ని పర్వతాలు బద్దలు కావడంతో అమెరికాలోని లాస్‌వెగాస్ లాంటి ప్రాంతాల్లో ఎన్నటికీ పంట పండని, భూగర్భ జలాలకు అవకాశం లేని వాతావరణం ఉంది. కానీ అక్కడి ప్రజలు తిండి కోసం, నీళ్ల కోసం అలమటించడం లేదు. ఎనభై ఏండ్ల కిందటే హూవర్ డ్యామ్ కట్టి బూడిద మాత్రమే ఉండే భూమిని భూతల స్వర్గంగా మార్చారు. అలాంటి ప్రణాళిక కేంద్రం దగ్గర లేదు. కానీ తెలంగాణ రాష్ట్రం దగ్గర ఉన్నది. రాబోయే రెండు, మూడేళ్లలో కరువును శాశ్వతంగా పారదోలిన రాష్ట్రంగా తెలంగాణ నిలవబోతున్నది.

వర్షపాతం తక్కువ నమోదైనా సరే, పంటలు పండటానికి ప్రాజెక్టుల రీ డిజైన్ జరుగుతున్నది. గోదావరి, కృష్ణాలపై బ్యారేజీలు వస్తున్నాయి. కోటి ఎకరాలకు నీరందించే రిజర్వాయర్లు సిద్ధమవుతాయి. వర్షపు నీళ్లనే కాదు, ప్రాజెక్టు ద్వారా వచ్చే నీళ్లను నిల్వ చేసుకోవడానికి మిషన్‌కాకతీయ ద్వారా చెరువులు సిద్ధమవుతున్నాయి. భూగర్భజలాలు పెరుగుతాయి. స్థానిక నీటి నిల్వలతో సంబంధం లేకుండానే నదీ జలాలు మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ అందుతాయి. వర్షపాతం పెంచడానికి హరితహారం దోహదపడుతుంది. దీర్ఘకాలిక చర్యల ద్వారా ఎంతటి కరువైనా ఎదుర్కొనే సామర్థ్యం పెంపొందించాలి. వర్షాభావ పరిస్థితులున్నా సరే, కరువులేని కాలం కావాలి. తెలంగాణ దేశానికి ఆదర్శం కావాలి.

**– మీడియా రిలీజ్**

# గ్రామీణ వికాసానికే తొలి ప్రాధాన్యం

## పంచాయతీరాజ్ వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి నిహాల్‌చంద్





గ్రామీణ వికాసంపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టిందని, పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, మురుగునీటి వ్యవస్థ, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి నిహాల్‌చంద్ తెలిపారు. ఆర్థిక వికేంద్రీకరణ: రాష్ట్ర ఆర్థిక సంఘాల పాత్ర అనే అంశంపై రెండురోజుల జాతీయ వర్క్‌షాపు ఢిల్లీలో ప్రారంభమైంది. వివిధ రాష్ట్రాల నుంచి పంచాయతీరాజ్ మంత్రులు, కార్యదర్శులు, అధికారులు హాజరయ్యారు. సమావేశంలో గతంలో ఆర్థిక సంఘంలో పనిచేసిన సభ్యులు, ఆర్థిక నిపుణులు పలువురు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల్లోని ఆర్థిక కమిషన్లు పనిచేస్తున్న తీరును, వాటి అనుభవాలను, పంచాయతీరాజ్ వ్యవస్థకు ఇస్తున్న నిధులు తదితరాల గురించి ఈ వర్క్‌షాపులో చర్చ జరిగింది. తెలంగాణ రాష్ట్రం తరపున పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రామారావు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ రాష్ట్ర ఆర్థిక కమిషన్ (ఫైనాన్స్ కమిషన్) ఇంకా ఉమ్మడిగానే కొనసాగుతున్నందున రాష్ట్రం తరఫున అనుభవాలను, పనితీరును వివరించే అవకాశం లేకపోయింది.

ఈ వర్క్‌షాపులో కేంద్ర మంత్రి నిహాల్‌చంద్ ప్రసంగిస్తూ 2015-20 సంవత్సరాలకుగాను 14వ ఆర్థిక సంఘం రెండు లక్షల కోట్ల రూపాయలను గ్రామ పంచాయతీలకు కేటాయించిందని, వీటిని సద్వినియోగం చేయడం ద్వారా గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడం వీలవుతుందని అన్నారు. 14వ ఆర్థిక సంఘం స్థానిక పరిపాలనా సంస్థలకు జనాభా ప్రకారం 90%, విస్తీర్ణం ప్రకారం 10%గ్రాంట్‌లను కేటాయిస్తున్నదని, ఈ విధంగా దేశంలోని సుమారు 2.60 లక్షల గ్రామ పంచాయతీలకు నిధులు అందుతాయని తెలిపారు. ఈ గ్రాంట్లు కూడా ప్రాథమిక అవసరాలకు 90%, పనితీరులో ఉత్తమ ఫలితాలు కనబర్చినందుకు 10% చొప్పున ఉంటాయని, మున్సిపాలిటీలకు ఇది 80%:20% ఉంటుందని వివరించారు. నిర్దిష్ట పరిస్థితుల్లో ఒక్కో రాష్ట్రంలో ఉన్న ఆర్థిక సంఘాల పనితీరు ఎలా ఉందనే విషయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

– సిఎంపి

Printed & Published by: Anita Ramachandran, Commissioner, on behalf of TSIPARD, Printed at Navatelangana Printers Pvt.Ltd. M.H.Bhavan, Near RTC Kalayanamandapam, Hyderabd.-20. Published at TSIPARD, Rajendranagar, Hyderabad- 500 030. Editor : Anita Ramachandran